బుధవారం
26•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 242
• పేజీలు : 12 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE





మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త మీడియా సమావేశం అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ

**భారత్‌తో** సమగ్ర వాణిజ్య ఒప్పందంపై రెండు దేశాల ప్రతినిధుల బృందం పురోగతి సాధిస్తున్నది. ఇరు దేశాలకు సమ ప్రాధాన్యం ఉండేలా త్వరలో మంచి ఒప్పందం కుదురుతుంది. అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక సుంకాలను విధిస్తున్నది. ఈ విషయంలో భారత్ పునరాలోచించాలి. భారత్–అమెరికా మధ్య గతంలోకన్నా ఇప్పుడు దృఢమైన బంధం ఉన్నది. ఇరు దేశాల మధ్య అద్భుతమైన ఒప్పందాలు కుదిరాయి.

**- అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

**భారత్,** అమెరికా మైత్రి 21వ శతాబ్దంలో అతి ముఖ్యమైన భాగస్వామ్యాలలో ఒకటి. పెరుగుతున్న ద్వైపాక్షిక, రక్షణ, భద్రత సహకారం ఈ వ్యూహాత్మక బంధంలో కీలకం. ద్వైపాక్షిక వాణిజ్యానికి సంబంధించి రెండు దేశాల వాణిజ్య మంత్రుల మధ్య సానుకూల చర్చలు జరిగాయి. భారీ వాణిజ్య ఒప్పందానికి చర్చలు ప్రారంభించాలని కూడా నిర్ణయం తీసుకున్నాం. రెండు దేశాలకు ఇది మంచి ఫలితాలు అందిస్తుందని మేం భావిస్తున్నాం.

**- ప్రధానమంత్రి నరేంద్రమోదీ**

# 21 వేల కోట్ల రక్షణబంధం

## ఒప్పందంపై అమెరికా - భారత్ సంతకాలు

### భారత్‌కు అందనున్న అత్యాధునిక అపాచీ, ఎంహెచ్-60 రోమియో హెలికాప్టర్లు

### ఆరోగ్యం, ఇంధన రంగాల్లో మరో మూడు ఎంవోయూలు

**సీఏఏ భారత్ అంతర్గత విషయం**

- ప్రజలందరికీ మతస్వేచ్ఛ ఉండాలని కోరుకుంటున్న మోదీ
- ఉగ్రవాదంపై పోరుకు కట్టుబడి ఉన్నాం
- భారత్–పాక్ మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధం
- సంయుక్త మీడియా సమావేశంలో ట్రంప్
- సీఏఏపై మోదీతో చర్చించలేదని వెల్లడి
- మన మైత్రి ఈ శతాబ్దికే కీలకం: మోదీ
- భారత్‌లో ముగిసిన ట్రంప్ పర్యటన
- అమెరికాకు తిరుగు ప్రయాణం

**భారత్-అమెరికా** మధ్య రక్షణబంధం మరింత బలోపేతమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనలో రెండోరోజైన మంగళవారం ఇరుదేశాల మధ్య దాదాపు రూ.21,549 కోట్ల విలువైన భారీ రక్షణ ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా అమెరికా అత్యాధునిక అపాచీ, ఎంహెచ్-60 రోమియో సైనిక హెలికాప్టర్లను, ఇతర ఆయుధ సామగ్రిని భారత్‌కు అందించనున్నది. దీంతోపాటు మరో మూడు ఎంవోయూలు కూడా కుదిరాయి. అంతకుముందు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ట్రంప్, మోదీ దాదాపు ఐదుగంటలకుపైగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఉదయం ట్రంప్ దంపతులకు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు, ప్రధాని మోదీ సాదర స్వాగతం పలికారు. అనంతరం ట్రంప్ దంపతులు రాజ్‌ఘాట్‌లో గాంధీజీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. మెలానియా ట్రంప్ ఢిల్లీలోని సర్వోదయ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడ బోధిస్తున్న 'హ్యాపీ క్లాసెస్'ను చూసి ముగ్ధులయ్యారు. రాత్రి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చిన ప్రత్యేక విందులో ట్రంప్ దంపతులు పాల్గొన్నారు. ఈ విందుకు ప్రధాని నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. 5


మంగళ వారం రాష్ట్రపతిభవన్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కరచాలనం చేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

## ట్రంప్‌కు రాష్ట్రపతి ప్రత్యేక విందు

ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖుల హాజరు 5


పట్టణప్రగతి కార్యక్రమం సందర్భంగా మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ 10వ వార్డులో మహిళలను ఆప్యాయంగా పలుకరిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్

# మనం మారుదాం.. పట్టణాన్ని మార్చుకొందాం

## పురపాలన అంటేనే పౌరుల భాగస్వామ్యం

**ప్రభుత్వం ప్రజలపై విశ్వాసముంచింది.. ఆ నమ్మకాన్ని వమ్ముచేయొద్దు**

**అందరూ బాధ్యతగా కదిలితేనే పట్టణాల్లో మార్పు • ఒక్కో కౌన్సిలర్ ఒక్కో కేసీఆర్ కావాలి**

**మిషన్ భగీరథ నీళ్లే తాగుదాం • సీసా నీళ్లు తాగే దుస్థితి వద్దు**

**దేవరకొండ, కల్వకుర్తి పట్టణప్రగతి కార్యక్రమాల్లో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్**

**కాలనీల్లో కాలినడకన తిరుగుతూ ప్రజలతో మాటామంతీ**

**నల్లగొండ ప్రధాన ప్రతినిధి/ నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే.. పట్టణాల్లో మార్పు సాధ్యపడుతుందని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. కొత్త మున్సిపల్ చట్టంలో అనేక వెసులుబాట్లు కల్పించడంద్వారా ప్రభుత్వం ప్రజలపై ఎంతో విశ్వాసముంచిందని.. ఆ విశ్వాసాన్ని వమ్ముచెయ్యవద్దని కోరారు. 'ఇప్పటివరకు ఒక లెక్క.. ఇప్పటినుంచి పద్ధతులు మార్చుకొందాం' అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంత బాధ్యతగా పనిచేసినా.. ప్రతి పట్టణవాసి, ప్రజాప్రతినిధులు, అధికారుల్లో కూడా బాధ్యత పెరిగినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. పురపాలన అంటేనే పౌరుల భాగస్వామ్యంతో కూడిన పరిపాలన అని చెప్పారు. సీసా నీళ్లు తాగడం మానేసి.. మిషన్ భగీరథ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛమైన మంచినీటిని తాగడం అలవాటుచేసుకోవాలని హితవుచెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పట్టణప్రగతి కార్యక్రమం మంగళవారం రెండోరోజు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున కొనసాగింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా పట్టణాలు, నగరాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ నల్లగొండ జిల్లా దేవరకొండ, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. 'ఇల్లు మాత్రమే నాది.. వీధి నాది కాదు.. రోడ్డు నాది కాదు.. పట్టణం నాది కాదు అనే భావన

మిగతా 2వ పేజీలో

### డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్ ఎన్నికల్లో

# టీఆర్‌ఎస్ హవా

### డీసీసీబీలలో 147 డైరెక్టర్లు • డీసీఎంఎస్‌లలో 74 డైరెక్టర్లు ఏకగ్రీవం

### ఒక్కటి మినహా అన్నీ టీఆర్‌ఎస్ మద్దతుదారుల కైవసం • 29న ఆఫీస్ బేరర్ల ఎన్నిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలోని తొమ్మిది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లు, తొమ్మిది జిల్లా కో- ఆపరేటివ్ మార్కెటింగ్ సంస్థ (డీసీఎంఎస్)ల డైరెక్టర్ల పదవులన్నీ ఏకగ్రీవమైనట్టు రాష్ట్ర సహకార శాఖ ఎన్నికల అథారిటీ ప్రకటించింది. ఇందులో నల్లగొండ జిల్లాలో ఒక్కస్థానం మినహా మిగిలిన అన్ని డైరెక్టర్ పదవులు టీఆర్‌ఎస్ మద్దతుదారులకే దక్కాయి. ఒక్కొక్క డీసీసీబీలో 20 (గ్రూప్ ఏలో 16, గ్రూప్ బీలో 4), ఒక్కొక్క డీసీఎంస్‌లో 10 చొప్పున డైరెక్టర్ పదవుల భర్తీకి మంగళవారం ఉదయం నోటిఫికేషన్ విడుదలచేసి, నామినేషన్లు స్వీకరించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్లు స్వీకరించిన అధికారులు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణకు అవకాశమిచ్చారు. కొన్నిచోట్ల డైరెక్టర్ పదవికి ఇద్దరు ముగ్గురు నామినేషన్లు వేసినప్పటికీ, ఉపసంహరణ గడువు ముగిసేసరికి అన్నిచోట్లా ఒక్కొక్కరే పోటీలో మిగిలారు. తొమ్మిది డీసీసీబీలలో మొత్తం 180 డైరెక్టర్ పదవులుండగా, 147 పదవులకు ఒక్కొక్క నామినేషనే దాఖలైంది. రిజర్వేషన్ క్యాటగిరీలోని మరో 33 డైరెక్టర్ పదవులకు అభ్యర్థులు లేకపోవడంతో ఒక్క నామినేషన్ కూడా దాఖలుకాలేదు. దీంతో డీసీసీబీలలో 147 డైరెక్టర్ పదవులు ఏకగ్రీవమైనట్టు అధికారులు వెల్లడించారు. తొమ్మిది డీసీఎంఎస్‌లలోని మొత్తం 90 డైరెక్టర్ పోస్టులకు నామినేషన్లు స్వీకరించగా 74 పోస్టులకు ఒక్కొక్కరే నామినేషన్ దాఖలుచేశారు. రిజర్వేషన్ క్యాటగిరీలోని మరో 16 డైరెక్టర్

మిగతా 2వ పేజీలో

# రేవంత్ భూ దందా

## హైదరాబాద్ గోపన్‌పల్లిలో 150 కోట్లకుపైగా విలువైన భూమిలో పాగా

### తప్పుడు పత్రాలతో ఏడెకరాలు రాయించుకున్న అన్నదమ్ములు • రెవెన్యూ అధికారుల కుమ్మక్కు



రేవంత్‌రెడ్డి పేరిట ఉన్న భూమి వివరాలను తెలియజేస్తున్న ఆన్‌లైన్ పహాణీ

- రెవెన్యూ అధికారుల విచారణలో తేటతెల్లమైన అక్రమాలు
- సీఎస్‌కు నివేదిక అందజేసిన రంగారెడ్డి జిల్లా అధికారులు
- తాసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్‌లో ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలోని భూమి.. ఎకరం ధర దాదాపు రూ.పాతికకోట్లు. మొత్తం ఏడెకరాల భూమి విలువ రూ.150 కోట్లపై మాటే. ఇంతవిలువైన భూమికి రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారు ఎవరనే వివరాలు సక్రమంగా లేకపోవడాన్ని అసరా చేసుకుని మల్కాజిగిరి ఎంపీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుముల రేవంత్‌రెడ్డి భూదందాకు పాల్పడ్డారు. రెవెన్యూ అధికారుల సహకారంతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అత్యంత విలువైన భూమిని తనతోపాటు, తన సోదరుడి పేరుమీద మ్యుటేషన్ చేయించుకున్నారు. శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో ఏడెకరాల భూమిని రేవంత్‌రెడ్డి సోదరులు అక్రమమార్గంలో దక్కించుకున్నట్టు రంగారెడ్డి జిల్లా అధికారులు తమ విచారణలో తేల్చారు. దీనిపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు నివేదికను అందజేశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన రెవెన్యూ ఉన్నతాధికారులు.. నకిలీ డాక్యుమెంట్లతో మ్యుటేషన్ చేసిన తాసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేశారు.

**ఎకరం పాతిక కోట్లకు పైగానే..**

గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సమీపంలోని గోపన్‌పల్లి గ్రామంలో ప్రధాన రహదారికి చేరువలో.. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ సెంటర్ వెనుక 127 సర్వేనంబర్ భూమి ఉన్నది. బహిరంగ మార్కెట్‌లో దీనిధర ఎకరం రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు పలుకుతున్నది. గోపన్‌పల్లిలో

మిగతా 2వ పేజీలో




**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 50.00 | రిటైల్ లైవ్ | 72.00 |
| డ్రెస్డ్ | 104.00 | స్కిన్‌లెస్ | 119.00 |


**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 310.00 | రంగారెడ్డి | 310.00 |
| మెదక్ | 310.00 | కరీంనగర్ | 313.00 |
| వరంగల్ | 313.00 | డజన్ ధర | 60.00 |

# సేకరించిన ధాన్యం 47 లక్షల టన్నులు

### వానకాలం పంటల్లో గణనీయంగా పెరిగిన దిగుబడి • ముగిసిన కొనుగోళ్లు

### రైతుల ఖాతాల్లోకి రూ.8,625 కోట్లు • యాసంగికి సిద్ధమవుతున్న పౌరసరఫరాల సంస్థ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ ఏడాది వానకాలం పంటల ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పౌరసరఫరాల సంస్థ, ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని కొనుగోళ్లను దిగ్విజయంగా పూర్తిచేసింది. ధాన్యం కొనుగోళ్ల కోసం తొలిసారిగా రాష్ట్రస్థాయిలో ఓ సమన్వయ కమిటీని ఏర్పాటుచేశారు. ధాన్యం రవాణా, పర్యవేక్షణ, కనీస మద్దతు ధర అమలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ఏర్పాటుచేసిన ఈ కమిటీలో వ్యవసాయశాఖ

మిగతా 4వ పేజీలో

### రాజ్యసభ ఎన్నికలు

# మార్చి 26న

తెలంగాణలోని రెండు సీట్లు సహా 55 స్థానాలకు ఎన్నికల షెడ్యూల్

వచ్చేనెల 6న నోటిఫికేషన్: ఈసీ వెల్లడి 4

## బీఎస్6 వాహనాలకే ఏప్రిల్ నుంచి రిజిస్ట్రేషన్

పాత బండ్ల రిజిస్ట్రేషన్లకు మార్చి 31 గడువు 4


మంగళవారం న్యూఢిల్లీలోని చాంద్‌బాగ్‌లో తగులబడుతున్న దుకాణం

# రాజధాని రావణకాష్టం

- ఈశాన్య ఢిల్లీలో కొనసాగుతున్న హింసాకాండ
- 13కు చేరిన మృతుల సంఖ్య.. 200 మందికి గాయాలు
- మత ఘర్షణల స్థాయికి చేరుకున్న సీఏఏ అల్లర్లు
- మీడియా ప్రతినిధులపై అల్లరిమూకల దాడులు

4



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన యాదాద్రి పుణ్యక్షేత్రం

# నేటినుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు

- 4న శ్రీవారి తిరుకల్యాణమహోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం కేసీఆర్ దంపతులు
- పాల్గొననున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు తలమానికమై ఆధ్యాత్మిక రాజధానిగా రూపుదిద్దుకుంటున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభంకానున్నాయి. మార్చి 7 వరకు నిర్వహించనున్న ఉత్సవాల కోసం సర్వంసిద్ధమయ్యాయి. బుధవారం ఉదయం 11గంటలకు స్వస్తీవాచనంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతారు. ఆలయ విస్తరణ పనులు జరుగుతున్నందున బాలాలయంలోనే శ్రీవారి ఉత్సవ కైంకర్యాలు నిర్వహించనున్నారు. వేలమంది భక్తులు తిలకించేలా కొండ కింద జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కల్యాణోత్సవం నిర్వహించేందుకు భారీఎత్తున ఏర్పాట్లు చేయనున్నారు. మొత్తం 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టాలు మార్చి 3న జరిగే ఎదుర్కోలు మహోత్సవంతో ప్రారంభంకానున్నాయి. మార్చి 4న జరుగనున్న శ్రీవారి తిరుకల్యాణమహోత్సవానికి సీఎం కేసీఆర్ దంపతులు హాజరై.. పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సైతం హాజరుకానున్నారు. 5న శ్రీవారి దివ్యవిమాన రథోత్సవం, 6న చక్రతీర్థ స్నానం, పూర్ణాహుతి శ్రీపుష్పయాగం దీపోత్సవం జరుగుతాయి. 7న జరిగే అష్టోత్తర శత ఘటాభిషేకం, రాత్రి శృంగారడోలోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి. ఉత్సవాల కోసం రూ.40 లక్షలు వెచ్చించి భారీగా ఏర్పాట్లుచేస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం అలంకారసేవలు, రాత్రి శ్రీవారి వాహనసేవలు జరుగుతాయి. భక్తులకు వినోదం అందించేలా మార్చి 2 నుంచి 6 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


### మత్స్యావతారంతో అలంకార సేవలు ప్రారంభం

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం వేళల్లో అలంకారసేవలు, రాత్రి శ్రీవారి వాహనసేవలు జరుగుతాయి. ఈ నెల 28న మత్స్యావతారం అలంకారంతో అలంకార సేవలు ప్రారంభమవుతాయి. 7న అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శృంగారడోలోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

- ఎన్ లక్ష్మీనరసింహాచార్యులు, యాదాద్రి ఆలయ ప్రధానార్చకులు

# కందుల కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్

- 56 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనున్న మార్క్‌ఫెడ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** కందుల కొనుగోళ్లకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మార్క్‌ఫెడ్ ద్వారా 56వేల మెట్రిక్‌టన్నుల కందులు కొనుగోలు చేసేందుకు అనుమతిస్తూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికే కేంద్రం 47,500 మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేసింది. ఈ ఏడాది కందుల కొనుగోలుకు అనుమతించాలని కోరుతూ ఇటీవల మార్క్‌ఫెడ్ ఎండీ లేఖ రాయడంతో వానకాలం సీజన్‌లో రాష్ట్రవాటా కింద 56వేల మెట్రిక్ టన్నుల కందులను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మొక్కజొన్న కొనుగోళ్లకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ మంజూరు చేసిన రూ.1500 కోట్ల రుణాలలో మిగిలిపోయిన రూ.381 కోట్లను కందుల కొనుగోలుకు వినియోగించాలని తెలిపింది. కందుల కొనుగోళ్లలో ఎలాంటి నష్టాలు వచ్చినా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని మార్క్‌ఫెడ్‌కు హామీ ఇచ్చింది. కొనుగోలు చేసిన కందుల విక్రయాలు పూర్తయిన నెలలోగా మార్క్‌ఫెడ్ క్లెయిమ్ సబ్‌మిట్ చేయాలని ఆదేశించింది. కందుల కొనుగోళ్లు నేరుగా రైతుల నుంచే చేపట్టాలని, మధ్య దళారులు, వ్యాపారులను ప్రోత్సహించరాదని స్పష్టంచేసింది.

# పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

62 మంది గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు ప్రమోషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 62 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-5లో 40 మంది, జోన్-6 పరిధిలో 22 మందికి గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు ఇస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. త్వరలో గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు కూడా ప్రమోషన్లు ఇవ్వనున్నట్టు సమాచారం. పంచాయతీకార్యదర్శులకు పదోన్నతులు కల్పించడంపై తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రమేశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గ్రేడ్ -3 నుంచి కూడా త్వరగా పదోన్నతులు కల్పించాలని కోరారు. జూనియర్‌పంచాయతీ కార్యదర్శులపై కొన్నిజిల్లాల్లో అధికారులు ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెడుతున్నారని, సాయంత్రం 6 గంటలకు కూడా వీడియోకాల్‌లో మాట్లాడాలని ఆదేశాలిస్తున్నారని వాపోయారు. పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు చొరువతీసుకుని వారి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.



కల్వకుర్తి పట్టణప్రగతిలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ తదితరులున్నారు.



దేవరకొండలో సీసా నీటిని తిరస్కరించి 'భగీరథ' నీటితో దాహం తీర్చుకొంటున్న మంత్రి కేటీఆర్



దేవరకొండ 10వ వార్డులో మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కూడా ఉన్నారు.

# ..పట్టణాన్ని మార్చుకొందాం

మొదటిపేజీ తరువాయి...

సరికాదు. మనమందరం మారి.. కలిసికట్టుగా పట్టణాన్ని అభివృద్ధిచేసుకోవాలి' అని మంత్రి కేటీఆర్ చెప్పారు. పట్టణప్రగతి రెండోరోజు కార్యక్రమంలో భాగంగా ముందుగా నల్లగొండ జిల్లా దేవరకొండలో పర్యటించారు. హనుమాన్‌నగర్, అయ్యప్పనగర్‌లో దాదాపు రెండుగంటలపాటు కాలినడకన పర్యటించి కాలనీవాసులతో మాట్లాడారు. చాలాచోట్ల చెత్తచెదారం బాధ్యతారహితంగా వేసిఉండటాన్ని గమనించి శుభ్రంగా ఉంచుకోవాలని హితవుచెప్పారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తాను పట్టణంలో పర్యటించినప్పుడు చెత్త కుప్పలు కనిపించడాన్ని ప్రస్తావించారు. దేవరకొండ పట్టణాన్ని అభివృద్ధిచేసేందుకు ఎవరూ రారని.. ప్రజలే బాధ్యతగా తీసుకొని పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ భూముల్లో పట్టాలు ఇప్పించాలని ప్రజలు కోరారని.. ఆ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

### నాగమ్మా... నీ ఇంటికి చెత్తు వేయిస్తా..

వృద్ధురాలికి భరోసా ఇచ్చిన మంత్రి కేటీఆర్



పానగంటి నాగమ్మతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

**దేవరకొండ, నమస్తేతెలంగాణ:** రేకుల ఇల్లుతో తాను పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టిన ఓ వృద్ధురాలికి ఇంటికి చెత్తు (పై కప్పు) వేయిస్తానని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. పట్టణప్రగతిలో భాగంగా దేవరకొండ పట్టణంలోని తొమ్మిదోవార్డులో పర్యటించిన మంత్రికి, నాగమ్మ అనే వృద్ధురాలికి మధ్య జరిగిన సంభాషణ ఇదీ..

**కేటీఆర్: అవ్వా నీ పేరేమిటి?**
**వృద్ధురాలు:** పానగంటి నాగమ్మ సార్
**పెన్షన్ వస్తున్నదా?**
**వృద్ధురాలు:** వస్తున్నది సార్
**మిషన్ భగీరథ నల్లా వస్తున్నదా ?**
**వృద్ధురాలు:** వస్తున్నది సార్
**చెత్త బండి వస్తున్నదా?**
**వృద్ధురాలు:** నిత్యం వస్తున్నది
**చెత్త బుట్టలు ఉన్నాయా?**
**వృద్ధురాలు:** లేవు సార్
**పంపిస్తాలే గాని.. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా?**
**వృద్ధురాలు:** ఒంటరిగా ఉంటున్నా.. రేకుల ఇల్లు కావడంతో వర్షాలకు, ఎండలకు ఇబ్బంది పడుతున్న. దయుంచి చెత్తు పోయించండి సార్
**తప్పకుండా నీ ఇంటికి చెత్తు వేసేందుకు సాయం చేస్తా.**

### చెత్తను వేరుచేయాలి

తడి చెత్త, పొడి చెత్తపై ప్రజల్లో కనీస అవగాహనలేదని.. నాలుగైదు రోజుల్లో ఇంటికి రెండు బుట్టలు పంపిణీచేసి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని కలెక్టర్‌ను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. తన సొంత నియోజకవర్గం సిరిసిల్లలో చేపట్టిన తడి చెత్త, పొడి చెత్త విధానంతో నెలకు రూ.3 లక్షల ఆదాయం సమకూరుతున్నదని.. ఒకసారి ఆ విధానాన్ని పరిశీలించాలని మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు సూచించారు. శ్రమను గౌరవించే విధానం రావాలని.. ఇందుకోసం మున్సిపాలిటీల్లో పనిచేసే సఫాయి, మున్సిపల్ కార్మికుల పరిచయ కార్యక్రమం మొదలుపెట్టామని చెప్పారు. ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లుగానే.. రోడ్డు, వీధి, పట్టణం సైతం మనదేననే భావనతో అందరూ కలసికట్టుగా పట్టణాలను అభివృద్ధి చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. మనం మారుదాం.. మన పట్టణాన్ని మార్చుకుందామని అన్నారు. దేవరకొండలో వంద పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వార్డు కమిటీ సభ్యులు వార్డు సభలు నిర్వహించాలని.. ప్రతి వార్డులో శానిటేషన్ ప్లాన్, గ్రీన్ యాక్షన్ ప్లాన్, వాటర్ ఆడిట్ ప్లాన్లను రూపొందించాలని వివరించారు. మున్సిపాలిటీ బడ్జెట్‌లో పదిశాతం పచ్చదనంకోసం వెచ్చించాలని.. 85 శాతం మొక్కలు సంరక్షించకుంటే కౌన్సిలర్ల ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. ఇంటి నిర్మాణం కోసం ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పనిలేదని స్పష్టంచేశారు. కొత్త చట్టం పౌరుల పక్షాన ఉంటుందని.. అతిక్రమించిన వారికి శిక్షలు సైతం అంతే కఠినంగా ఉంటాయని చెప్పారు. అభివృద్ధి కోసం ప్రజలంతా తమ తమ బాధ్యతలు నిర్వహించి ఆర్నెళ్లలో దేవరకొండ రూపురేఖలు మారిస్తేనే ఎమ్మెల్యే రవీందర్‌కుమార్ కోరిన సుమారు రూ.25 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరుచేస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఖబ్రస్థాన్, ఖననవాటిక, వైకుంఠధామాలతోపాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పార్కుల అభివృద్ధి, డంపింగ్‌యార్డ్ అభివృద్ధి వంటి పనులు చేపడతామని తెలిపారు. ఒక్కొక్క కౌన్సిలర్ ఒక్కో కేసీఆర్‌గా మారి తమ వార్డులను అభివృద్ధి చేయాలన్నారు. అంతకుముందు పట్టణంలో రూ.48 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, పార్క్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రితోపాటు ఎమ్మెల్యే రవీందర్‌కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, మండలి విప్ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్‌చైర్మన్ రహత్ అలీ పాల్గొన్నారు.

### సీసా నీళ్లు తాగొద్దు

దేవరకొండ నుంచి కల్వకుర్తిలో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్.. రూ.2.70కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్, రూ.50లక్షలతో చేపట్టనున్న వీధి దీపాల పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీసా నీళ్లను తాగే దుస్థితిపోవాలని.. మిషన్ భగీరథ నీటిని తాగే అలవాటును చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని అమలుచేస్తున్నదని, ఆ నీటిని తాగడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో మాట్లాడుతూనే తనకు మంచినీళ్లు కావాలని కార్యకర్తలను అడుగటంతో వారు ప్లాస్టిక్ సీసాలో నీళ్లు తెచ్చిచ్చారు. ఈ విధంగా సీసానీళ్లు తాగడం మానేయాలని, భగీరథ నీటిని అలవర్చుకోవాలని సూచించారు. పల్లెప్రగతి స్ఫూర్తితో పట్టణాలను అభివృద్ధిచేసుకోవటానికి కదులుదామన్నారు. ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేకుంటే సంబంధిత యజమానులకు నోటీసులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. పదిరోజుల్లో ప్రతివార్డుకూ హరిత ప్రణాళిక తయారుచేయాలని, మొత్తంబడ్జెట్‌లో 10 శాతం నిధులు హరిత ప్రణాళికకు కేటాయించాలని తెలిపారు. కల్వకుర్తి పట్టణాన్ని రాబోయే నాలుగేండ్లలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడంలో రాజకీయాలు, పార్టీలకతీతంగా అందరు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. మిషన్ భగీరథ కింద నల్లా కనెక్షన్లు ఇవ్వనివారికి రాబోయే రెండుమూడు రోజుల్లో రూపాయికే ఇస్తామని మంత్రి తెలిపారు. వార్డులవారీగా వాటర్ ఆడిట్ రూపొందించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. నెల వ్యవధిలో 75 పబ్లి క్ టాయిలెట్లను నిర్మించాలని మున్సిపల్ చైర్మన్‌కు సూచించారు. అత్యాధునిక సౌకర్యాలతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి స్థలం ఇస్తే వెంటనే చేపడ్తామన్నారు. వైకుంఠధామాలు, క్రీడాప్రాంగణాలు, పార్కులకు స్థలాలు ఇవ్వాలని సూచించారు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు 'పరిచయం' అనే కార్యక్రమం ద్వారా సఫాయి కార్మికులు, చెత్త బండి కార్మికుల మొబైల్ నంబర్లను గోడలకు పెయింట్ చేయిస్తామన్నారు. కాలనీలోని ప్రజలకు అందుబాటులోఉండేలా కౌన్సిలర్లు కార్యాలయాలు ప్రారంభించుకోవాలన్నారు. పట్టణ, పల్లెల అభివృద్ధి కోసమే సీఎం కేసీఆర్ అడిషనల్ కలెక్టర్లను నియమించినట్టు వివరించారు. తడి, పొడి చెత్తను ప్రత్యేకంగా సేకరించాలని, ఇందుకోసం రాబోయేకాలంలో వార్డు స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జపాన్, సింగపూర్‌లలో రోడ్లపై చెత్తవేసే అలవాటు లేదన్నారు. రెండునెలలకు సరిపడా రాష్ట్రంలో అన్ని మున్సిపాల్టీలకు నిధులు మంజూరయ్యాయని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు జైపాల్‌యాదవ్, మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ పెద్దపల్లి పద్మావతి, అడిషనల్ కలెక్టర్ మనుచౌదరి, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజిసింగ్, మాజీ ఎంపీ మందా జగన్నాథం, మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్, మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి, మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# రాజన్న ఆదాయం 1.25 కోట్లు

**వేములవాడ కల్చరల్:** వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామికి హుండీల ద్వారా రూ.1.25 కోట్ల నగదు ఆదాయం, 291 గ్రాముల బంగారం, 14 కిలోల వెండి సమకూరిందని ఆలయ ఈవో కృష్ణవేణి మంగళవారం తెలిపారు. 13 రోజులకు సంబంధించిన హుండీల లెక్కింపు బుధవారం కూడా కొనసాగుతుందని చెప్పారు.

# ఏప్రిల్ నుంచి జీఎస్టీ రిటర్న్‌లు సులభం

- హైదరాబాద్ చీఫ్ కమిషనర్ శేషగిరిరావు వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా 'మీ వద్దకు జీఎస్టీ' షురూ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏప్రిల్ నుంచి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రిటర్న్‌ల దాఖలు ప్రక్రియను సులభతరం చేస్తున్నట్లు కేంద్ర జీఎస్టీ హైదరాబాద్ చీఫ్ కమిషనర్ వాసా శేషగిరిరావు వెల్లడించారు. జీఎస్టీ రిటర్న్‌ల దాఖలులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను పూర్తిగా తొలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేసిందన్నారు. పన్ను చెల్లింపుదారుల సందేహాలను నివృత్తిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు 'మీ వద్దకు జీఎస్టీ' పేరుతో ఈ నెల 25 నుంచి వచ్చేనెల 7 వరకు అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అవుట్‌రీచ్ కార్యక్రమంలో శేషగిరిరావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 'మీ వద్దకు జీఎస్టీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రిటర్న్‌ల దాఖలులో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను, ఇతర సమస్యలను వ్యాపారులు, ట్యాక్స్ కన్సల్టెంట్లు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. జీఎస్టీ మొత్తం బకాయిలపై వడ్డీవేయకుండా తమకు చెల్లించాల్సిన ఇన్‌పుట్ ట్యాక్స్‌ను మినహాయించి వడ్డీవేయాలని పలువురు వ్యాపారులు కోరగా.. ఈ అంశం తమ పరిధిలో లేదని, కేంద్రానికి నివేదిస్తామని శేషగిరిరావు చెప్పారు. ఎల్బీనగర్‌లోని గోటేటి కల్యాణమండపంలో జరిగిన అవుట్‌రీచ్ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జీఎస్టీ కమిషనర్ కేసీ జానీ పాల్గొని సందేహాలను నివృత్తిచేశారు.

### వాణిజ్యపన్నులశాఖ అధికారులతో నేడు సీఎస్ టెలికాన్ఫరెన్స్

రాష్ట్ర వాణిజ్యపన్నులశాఖలోని అన్నిస్థాయిల అధికారులతో సీఎస్ సోమేశ్‌కుమార్ బుధవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 124 సర్కిళ్లు, 12 డివిజన్లు, 9 ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్లతోపాటు ఎకనమిక్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులతో సీఎస్ ప్రత్యేకంగా మాట్లాడి ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి వసూలు చేయాల్సిన పన్నులపై స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించనున్నారు.

### ముహూర్తం

**సూర్యోదయం:** 6.37 గంటలకు

**సూర్యాస్తమయం:** 6.15 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం తదియ గురువారం తెల్లవారుజాము 4.12 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: ఉత్తరాభాద్ర రాత్రి 10.08 వరకు, తదుపరి రేవతి, అమృతఘడియలు: సాయంత్రం 4.45 నుంచి 6.33 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.26 నుంచి 1.52 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.03 నుంచి 12.49 వరకు, వర్జ్యం: ఉదయం 8.39 నుంచి 10.28 వరకు.

### లోకం పోకడ




# రేవంత్ భూదందా

మొదటిపేజీ తరువాయి...

భూములన్నీ గజాల చొప్పునే క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఇక్కడ గజం ధర రూ. 85 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది. ఈ ప్రకారం ఈ ఏడెకరాల విలువ బహిరంగమార్కెట్‌లో దాదాపు రూ.150 కోట్లకు పైగానే ఉంటుంది.

### నకిలీ డాక్యుమెంట్లతో..

గోపనపల్లిలోని సర్వేనంబరు 127లో 10.21 ఎకరాల భూమి ఉన్నది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఈ భూమి క్రయవిక్రయాలు జరిగినట్టు కొందరు కోర్టును ఆశ్రయించారు. సర్వేనంబర్ 127లోని భూమిలో తమకు హక్కుఉన్నదని, రేవంత్‌రెడ్డి ఆ భూములను అమ్ముకోకుండా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ కొల్లా అరుణ 2017లో హైకోర్టులో 17542,17637 నంబర్లతో రిట్‌పిటిషన్ వేశారు. అలాగే అనుముల కొండల్‌రెడ్డి ఈ భూములు అమ్ముకోకుండా ఆదేశాలు జారీచేయాలని అనిల్‌కుమార్ అనేవ్యక్తి 2015లో రంగారెడ్డి జిల్లా సివిల్ కోర్టులో 780/2015 నంబర్‌తో పిటిషన్ దాఖలుచేశారు. వీటిపై నిజానిజాలు తెలుసుకునేందుకు అధికారులు విచారణ చేపట్టారు. నకిలీ డాక్యుమెంట్ల ద్వారా ముందుగా ఈ భూమిని వేరేవారి పేరుమీద రాయించి.. తర్వాత వారినుంచి రేవంత్‌రెడ్డి, అతడి సోదరుడు కొనుగోలు చేసినట్టు గుర్తించారు. 6 ఎకరాల 39.5 గుంటలను ఎంపీ రేవంత్‌రెడ్డి, సోదరుడు కొండల్‌రెడ్డి తమ పేరు మీద రాయించుకున్నట్టు తేల్చారు. 2.20 ఎకరాలను కళావతి నుంచి అనుముల కొండల్‌రెడ్డి పేరుమీద.. అలీసలీమ్ బిన్, హబీబ్ అబ్దుల్‌రహీమ్, ఈ లక్ష్మయ్య, ఏ వెంకట్రావు నుంచి 1 ఎకరం 29.5 గుంటలు,13.5 గుంటలు, అలీసలీమ్ బిన్, హబీబ్ అబ్దుల్ రహీమ్, ఏ వెంకట్రావు అండ్ అదర్స్ నుంచి 1.24 ఎకరాలు, ఈ లక్ష్మయ్య నుంచి 31.5 గుంటలను అనుముల రేవంత్ రెడ్డి పేరుమీద రెవెన్యూ అధికారులు వివిధ మ్యుటేషన్ల ద్వారా బదిలీచేసి ప్రొసీడింగ్స్ ఇచ్చినట్టు విచారణలో తేలింది. నకిలీ డాక్యుమెంట్ల ద్వారానే ఈ మ్యుటేషన్లు జరిగినట్టు అధికారులు నిర్ధారించారు. 127 సర్వేనంబర్‌లోని భూమికి నకిలీ డాక్యుమెంట్లతో మ్యుటేషన్లు చేయడంతోపాటు, రికార్డుల్లో తప్పుగా నమోదు చేసిన నాటి శేరిలింగంపల్లి తాసిల్దార్ శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లాకలెక్టర్.. రాష్ట్ర ప్రభుత్వప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు నివేదిక పంపించారు. దీంతో డిప్యూటీ కలెక్టర్/తాసిల్దార్ డీ శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ సీఎస్ సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.



సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన రెవెన్యూ మ్యాప్‌లో వివాదాస్పద సర్వే నెం.127 భూమి



రేవంత్ సోదరుడు కొండల్‌రెడ్డి పేరిట 2.20 ఎకరాల భూమిని మ్యుటేషన్ చేసిన ప్రొసీడింగ్ కాపీ

### పట్టాదారులేదని పక్కా ప్లాన్..

**రంగారెడ్డి** జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలోని సర్వేనంబర్ 127లో 10.21 ఎకరాల భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు ఎక్కడా సక్రమంగా లేవు. 1977 వరకు ఈ భూమి వడ్డె హనుమ, ఆయన వారసుడు వడ్డె మల్లయ్య పేరుమీద ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉన్నది. 1978 నుంచి పహాణీలో మల్లయ్య పేరుమీద నమోదవుతూ వచ్చింది. మల్లయ్య పేరు ఉన్నప్పటికీ.. ఆయన ఇంటిపేరు మాత్రం లేదు. 1993-94 నుంచి మల్లయ్యపేరు వద్ద.. దబ్బ మల్లయ్య అని రికార్డుల్లో ఎంటరయింది. అయితే, ఈ పేరును ఎక్కించడానికి ఎలాంటి ఆధారాలు మాత్రం లేవు. 2001-02 నుంచి పహాణీల్లో దబ్బ మల్లయ్య పేరు కూడా కన్పించకుండాపోయింది.

- 2005లో అప్పటి శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్/తాసిల్దార్ ఈ మల్లయ్యకు వారసుడిగా పేర్కొంటూ ఈ లక్ష్మయ్య పేరుమీద 2. 21 ఎకరాలు రాసి.. కాస్తులో ఉన్నట్టు పేర్కొన్నారు. అదే తాసిల్దార్ ఆ వివరాలను సవరిస్తూ.. లక్ష్మయ్య 31 గుంటల్లో మాత్రమే కాస్తులో ఉన్నట్టు రాశారు. లక్ష్మయ్య పేరుమీద ముందుగా 2.21 ఎకరాలను రాయడం, మళ్లీ సవరించి 31 గుంటలకు మార్చడం రెండూ తాసిల్దార్ తన అధికార పరిధిని అతిక్రమించే చేశారు.
- అక్రమంగా లక్ష్మయ్య పేరుమీద రికార్డుల్లో నమోదయిన 31 గుంటల భూమిని అనుముల రేవంత్‌రెడ్డి కొనుగోలు చేసినట్టు సేల్ డీడ్ తయారుచేశారు. ఈ లక్ష్మయ్యకు ఎలాంటి పట్టదారుహక్కులు లేనప్పటికీ.. అతడి నుంచి భూమిని కొనుగోలుచేసినట్టు తాసిల్దార్.. రేవంత్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది.
- ఈ లక్ష్మయ్య అనే వ్యక్తే ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండానే ఎకరం 29.5 గుంటల భూమిని రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి అమ్మాడు. ఆ కొనుగోలు ప్రకారం 2015లో నాటి తాసిల్దార్ కొండల్‌రెడ్డి పేరిట మ్యుటేషన్ చేశారు.
- ఎలాంటి ఆధారాలు లేకున్నప్పటికీ తనపేరు మీదఉన్న డాక్యుమెంట్ల ద్వారా డీ మల్లయ్య 2.20 ఎకరాలను కళావతికి అమ్మాడు. రెవెన్యూ అధికారులు కళావతి పేరు మీద మ్యుటేషన్ చేయగా.. తర్వాత ఆమె అదే భూమిని ఏ కొండల్‌రెడ్డి పేరు మీదకు బదిలీచేశారు.
- 1989లో ఏ వెంకటరెడ్డి అనేవ్యక్తి దబ్బ మల్లయ్య నుంచి ఎకరం పదిన్నర గుంటల భూమి కొనుగోలు చేసినట్టు రికార్డుల్లో నమోదయింది. అయితే నాటికి దబ్బ మల్లయ్య పేరుమీద భూమి ఉన్నట్టు రికార్డుల్లో లేదు. వెంకట్రావు అనేవ్యక్తి ఈ భూమిలోని పదమూడున్నర గుంటల భూమిని తర్వాత ఏ కొండల్‌రెడ్డి పేరు మీదకు బదలాయించారు. ఇదిలా ఉండగా గోపన్‌పల్లిలోని సర్వేనంబర్ 127లో గల భూమికి హక్కుదారులెవరు అనే విషయంలో స్పష్టత లేదని అధికారులు తమ విచారణలో తేల్చారు.

# టీఆర్‌ఎస్ హవా

మొదటిపేజీ తరువాయి...

పదవులకు ఆయా అభ్యర్థులు లేకపోవడంతో ఒక్క నామిషనేషన్ కూడా దాఖలుకాలేదు. దీంతో డీసీఎంఎస్‌లలో 74 డైరెక్టర్ పదవులు ఏకగ్రీవమైనట్టు అధికారులు ప్రకటించారు.

### 29న ఆఫీస్ బేరర్ల ఎన్నిక


డీసీసీబీ, డీసీఎంఎస్‌లలో ఆఫీస్‌బేరర్లు, చైర్మన్లు, వైస్‌చైర్మన్ల పదవుల భర్తీకి ఈ నెల 29వ తేదీన నోటిఫికేషన్ విడుదలచేసి, అదేరోజు ఎన్నిక నిర్వహించనున్నారు. కొద్దిరోజుల క్రితం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నిర్వహించిన ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులు మెజార్టీ స్థానాల్లో విజయం సాధించడంతో డీసీసీబీ, డీసీఎంఎస్‌ల డైరెక్టర్ పదవులను ఆ పార్టీ ఏకపక్షంగా గెలుచుకున్నది. డైరెక్టర్ పదవులు ఏకగ్రీవం కావడంలో సంబంధిత జిల్లా మంత్రి, అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రచించిన వ్యూహాలు ఫలించాయి. కేవలం నల్లగొండ జిల్లాలో మాత్రమే ఒకేఒక్క డైరెక్టర్ స్థానం కాంగ్రెస్‌పార్టీకి దక్కింది. తొమ్మిది డీసీసీబీలలోని మొత్తం 33 రిజర్వ్‌డ్ స్థానాల్లో (ఆదిలాబాద్ -2, కరీంనగర్ -3, నిజామాబాద్ - 4, నల్లగొండ -3, ఖమ్మం-4, మహబూబ్‌నగర్ -5, వరంగల్ -3, రంగారెడ్డి - 6, మెదక్ - 3) ఒక్క నామినేషన్ కూడా దాఖలుకాలేదని అధికారులు వివరించారు. ఆయా డైరెక్టర్ల ఎన్నికలను వాయిదావేసినట్టు ప్రకటించారు.

# పొడతురుపు, వనరాజాకు జాతీయగుర్తింపు

- తెలంగాణ జాతులను గుర్తించిన నేషనల్ వెటర్నరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
- దేశవ్యాప్తంగా 13 జంతువులకు కొత్తగా చోటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ర్టానికి చెందిన పొడతురుపు జాతి పశువు, వనరాజా కోడికి జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ప్రత్యేక బ్రీడ్స్‌కు జాతీయస్థాయి గుర్తింపునిస్తూ నేషనల్ వెటర్నరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించిన జాబితాలో తెలంగాణకు చెందిన ఈ రెండింటికి చోటు దక్కింది. పొడతురుపు ఆవులు, ఎద్దులు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉండే అరుదైన జాతి కాగా.. వనరాజా కోళ్ల బ్రీడ్‌ను హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ పౌల్ట్రీ రిసెర్చ్ సెంటర్ అభివృద్ధి చేసింది. నేషనల్ వెటర్నరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ దేశవ్యాప్తంగా 13 జంతువులను కొత్తగా గుర్తించగా.. అందులో 7 రకాల ఆవులు, 2 రకాల పందులు, బర్రె, మేక, గాడిద, బాతులు, ఒక పౌల్ట్రీ జాతికి గుర్తింపు లభించాయి. ఈ జాబితాను ఈ నెల 20న కర్నాల్‌లోని భారత వ్యవసాయ పరిశోధనామండలి ఆధ్వర్యంలోని జాతీయ పశు జెనెటిక్స్ రిసోర్సెస్ బ్యూరో విడుదలచేసింది. వీటి నమోదుతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన జంతువుల సంఖ్య 197కు చేరింది. అందులో 50 రకాల ఆవులు, 17 బర్రెలు, 34 మేకలు, 44 గొర్రెలు, 7 గుర్రాలు, 9 ఒంటెలు, 10 పందులు, 3 గాడిదలు, ఒక జడలబర్రె, 19 కోళ్ల జాతులు, 2 రకాల బాతులు, గీస్ ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఒంగోలు పశుజాతికి జాతీయగుర్తింపు ఉండేది. ఇప్పుడు ప్రత్యేకంగా తెలంగాణకే చెందిన పశువు, కోడికి ఆ గుర్తింపు లభించింది.

### కరువు పరిస్థితిని తట్టుకునే పొడతురుపు



**నాగర్‌కర్నూల్** జిల్లా అమ్రాబాద్ పరిధిలో కనిపించే జాతి పొడతురుపు పశువులు ఎరుపు, గోధుమ రంగులో ఉండి శరీరంపై తెలుపు మచ్చలు ఉంటా యి. ఈ ఎద్దుల్లో కరువు పరిస్థితులను కూడా తట్టుకునే శారీరక సామర్థ్యం ఉంటుంది. బురద, మెట్ట నేలల్లో వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటాయి. ఈ జాతి ఆవులు రోజుకు 2 నుంచి 3 లీటర్ల పాలు ఇస్తాయి. ఈ జాతి ఆవులు రాష్ట్రంలో దాదాపు 15 వేలు ఉన్నట్టు గుర్తించారు.


### ఐకార్ పౌల్ట్రీ బ్రీడ్ వనరాజా



**తెలంగాణకు** చెందిన స్థానిక కోళ్ల బ్రీడ్ ద్వారా ఐకార్ పౌల్ట్రీ రిసెర్చ్ సెంటర్ వనరాజా కోళ్ల బ్రీడ్‌ను అభివృద్ధి చేసింది. తక్కువ సమయంలో మాంసం ఉత్పత్తికి అనుకూలమైన రకం. ఆడకోడి 40 వారాల్లో 2.8 కేజీల వరకు, మగ కోడి 3.5 కేజీల వరకు పెరుగుతాయి. ఈ జాతి కోళ్లు ఏటా 180 నుంచి 215 వరకు గుడ్లు పెడతాయి. ఇండ్లలో పెంపకానికి వీలుగా ఉంటాయి. బరువు ఎక్కువగా ఉండటంతో గాలిలోకి సరిగా ఎగురలేవు. మేలు రకమైన ఈ జాతులను ప్రోత్సహించడానికి త్వరలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ నిర్ణయించింది.

# ఆర్టీఐ కమిషనర్లుగా ఐదుగురు ప్రమాణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సమాచార హక్కుచట్టం (ఆర్టీఐ) కమిషనర్లుగా ఇటీవల నియమితులైన ఐదుగురు సభ్యులు తమ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉదయం ఆర్టీఐ కమిషనర్ కార్యాలయంలో 'నమస్తే తెలంగాణ' మాజీ సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి, 'టీ న్యూస్' చానెల్ మాజీ సీఈవో మైద నారాయణరెడ్డి, విద్యార్థి నాయకుడు గుగులోత్ శంకర్‌నాయక్, సోషల్‌వర్కర్లు సయ్యద్ ఖలీలుల్లా, డాక్టర్ మహ్మద్ అమీర్ హుస్సేన్ ప్రమాణం చేశారు. ఆర్టీఐ చీఫ్ కమిషనర్ రాజాసదారాం వారితో ప్రమాణం చేయించారు. వీరు మూడేండ్లపాటు పదవిలో కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ బుద్దా మురళి, జీఏడీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, జీఏడీ డిప్యూటీ కార్యదర్శి లలిత, ఆర్టీఐ కమిషన్ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి టీఎస్ఐఐసీ చైర్మన్ బాలమల్లు తదితరులు హాజరయ్యారు.



రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషనర్లుగా ప్రమాణం చేసిన 'నమస్తే తెలంగాణ' మాజీ సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి, 'టీ న్యూస్' చానెల్ మాజీ సీఈవో మైద నారాయణరెడ్డి, విద్యార్థి నాయకుడు గుగులోత్ శంకర్‌నాయక్, సోషల్ వర్కర్లు సయ్యద్ ఖలీలుల్లా, డాక్టర్ మహ్మద్ అమీర్ హుస్సేన్. చిత్రంలో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ రాజాసదారాం ఆర్టీఐ కమిషనర్ బుద్దా మురళి, జీఏడీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ కూడా ఉన్నారు.

## రేపు ఓయూలో ఉద్యోగ మేళా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఓయూ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో అండ్ మోడల్ కెరియర్ సెంటర్ (యూఈఐ అండ్ జీబీ/ఎంసీసీ) డిప్యూటీ చీఫ్ టీ రాము తెలిపారు. రిలయన్స్ జియో, పేటీఎం, కాలిబ్ హెచ్‌ఆర్, ఇన్నోవా స్టోర్స్ అండ్ సర్వీసెస్ వంటి కంపెనీల్లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ ఎంబీఏ చదివిన.. 19 నుంచి 30 ఏండ్లలోపు వారు ఓయూలోని చీఫ్ వార్డెన్ కార్యాలయం ఎదుట నిర్వహించే జాబ్‌మేళాకు అన్నిరకాల సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. నెలకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వేతనం ఉంటుందని చెప్పారు.

# బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

- ఇంజినీరింగ్‌లో ఏఐసీటీఈ నిబంధనలు పాటించాల్సిందే
- లేదంటే అఫిలియేషన్ నిలిపివేత: జేఎన్టీయూహెచ్ వీసీ
- అఫిలియేషన్ నోటిఫికేషన్ విడుదలచేసిన వర్సిటీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరిచేస్తూ జేఎన్టీయూహెచ్ నిర్ణయం తీసుకున్నది. అన్ని కాలేజీలు ఈ నిబంధనను పాటించాలని.. లేకుంటే అఫిలియేషన్‌కు అవకాశం ఉండదని పేర్కొన్నది. మంగళవారం జేఎన్టీయూహెచ్ ఇంచార్జి వీసీ జయేశ్‌రంజన్ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐసీటీఈ నిబంధనలపై చర్చించారు. ఇప్పటికే బీటెక్, బీఫార్మసీ కాలేజీల్లో టీచింగ్ ఫ్యాకల్టీకి, పీజీ కాలేజీల్లో ఫ్యాకల్టీతోపాటు విద్యార్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలుపరుస్తున్నామని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి బీటెక్, బీఫార్మసీ కాలేజీ విద్యార్థులకూ ఈ విధానాన్ని అమలుచేయాలని నిర్ణయించామని, యాజమాన్యాలు సుముఖత వ్యక్తంచేశాయని తెలిపారు. కళాశాలకు అఫిలియేషన్ రావాలంటే బయోమెట్రిక్ విధానాన్ని తప్పకపాటించాలని వర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్దన్ అన్నారు. 2020-21 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల అఫిలియేషన్ నోటిఫికేషన్ మంగళవారం జారీచేశారు. ఆన్‌లైన్ ద్వారా అఫిలియేషన్ కోసం దరఖాస్తుల చేసుకోవడానికి మార్చి 10 వరకు గడువు విధించారు. అధికారులు మార్చి 16 నుంచి కాలేజీల్లో తనిఖీలు ప్రారంభించి.. నెలలో పూర్తిచేస్తారు. మే 31 నాటికి అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిచేస్తారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై బోధన**

కంప్యూటర్ సైన్స్ వంటి రెగ్యులర్ కోర్సులతోపాటు.. సైబర్‌క్రైమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సబ్జెక్టులను తప్పనిసరిగా అందుబాటులోకి తీసుకురావాలని జేఎన్టీయూహెచ్ అధికారులు యాజమాన్యాలను ఆదేశించారు. ఐదు కొత్తకోర్సుల ఏర్పాటుపైనా వర్సిటీ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు.

## ఏప్రిల్ 20 నుంచి డీపీఎస్ఈ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) మొదటి సంవత్సరం పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 29 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఏప్రిల్ 21 నుంచి 30 వరకు నిర్వహిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

## ఎంసెట్ ప్రక్రియపై వీడియోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఎంసెట్-2020 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఎలా ఉంటుంది? కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కు ఎలా హాజరుకావాలి? వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఎంసెట్ అధికారులు ప్రత్యేక వీడియోలను రూపొందించి ఎంసెట్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు.

# ముంపు బాధితులకు భరోసా

- అనంతగిరి నిర్వాసితులకు తక్షణ ఆర్థికసాయం
- ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు అందజేత
- ఇండ్లను ఖాళీచేస్తున్న గ్రామస్థులు

**ఇల్లంతకుంట:** కాళేశ్వరం పదో ప్యాకేజీలో భాగంగా రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరిలో నిర్మించిన అన్నపూర్ణ ప్రాజెక్టు ముంపు బాధితులకు రాష్ట్ర సర్కారు అన్నివిధాలా భరోసా ఇస్తున్నది. ఒక్కో కుటుంబానికి తక్షణ ఆర్థికసాయంగా రూ.50వేలను అందజేసింది. రాజరాజేశ్వర జలాశయం నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని తరలించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లుచేస్తున్నారు. అందులో భాగంగా ముంపు బాధితులు ఇండ్లను ఖాళీచేయాలని విజ్ఞప్తిచేశారు. ఇదే విషయమై ఎమ్మెల్యే రసమయి, ఆర్డీవో శ్రీనివాస్‌రావు వారితో చర్చలు జరుపడం, అవి సఫలం కావడం తెలిసిందే. ప్రస్తుతం ముంపునకు గురవుతున్న 118 ఇండ్లను ఖాళీచేసేందుకు బాధితులు సమ్మతించారు. మంగళవారం 40 కుటుంబాలు తమ ఇండ్లను ఖాళీచేశాయి. గురువారం సాయంత్రంలోగా అందరూ ఖాళీచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలో ఇంకా పలువురికి కేటాయించిన ఇండ్లు పూర్తికాకపోవడంతో వారికి ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం తరపున అధికారులు రూ.50 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. నివాసాలు పూర్తయ్యే వరకూ ఆ మొత్తాన్ని అద్దె చెల్లింపునకు ఉపయోగించుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి భరోసా ఇవ్వడంతో ముంపు బాధితులు ఇండ్లను ఖాళీ చేస్తున్నారు. ఆయా పనులను ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తాసిల్దార్ రాజిరెడ్డి, డీఈ దేవేందర్, ఏఈ సమరసేన పర్యవేక్షించారు.



ముంపు బాధితులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న తాసిల్దార్ రాజిరెడ్డి

# ఆన్‌లైన్‌లో కల్తీ మద్యం

## మోసం చేస్తున్న వ్యక్తి అరెస్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటూ.. కల్తీవైన్‌ను విక్రయిస్తున్న మోసగాడిని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, సరూర్‌నగర్ ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేశారు. ద్రాక్షరసం, కొద్దిగా చక్కెర, కొన్ని నీళ్లు కలిపి పులియబెట్టి దాన్నే వైన్‌గా ఖరీదైన సీసాల్లో నింపి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. వినియోగదారులను నమ్మించి ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుంటూ అమెజాన్ ద్వారా డెలివరీ చేస్తున్నట్టు నిర్ధారించుకున్నారు. ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్ నేతృత్వంలో బృందం రంగంలోకి దిగింది. సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి కొత్తపేట సరస్వతినగర్ కాలనీలోని మహేశ్వరం శివప్రసాద్ ఇంటిపై దాడిచేసింది. సోదాల్లో 20 లీటర్ల ద్రాక్షరసం, 60 కల్తీవైన్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నది. ఆన్‌లైన్‌లో మార్కెట్ చేస్తూ.. ఇన్‌స్టాగ్రాం, వాట్సప్ ద్వారా ఆర్డర్లు తెప్పించుకుని బాటిళ్లను అమెజాన్‌లో పంపుతున్నట్టు నిందితుడు అంగీకరించాడు.






*ఎంపికచేయబడిన ఔట్‌లెట్స్‌లో CT110 KS యొక్క BS4 మోడల్‌కి నగదు డిస్కౌంట్ వర్తిస్తుంది. ఎంపికచేయబడిన ఔట్‌లెట్స్‌లో సిటి/ప్లాటినా యొక్క ఇతర BS4 మోడల్స్‌కి కూడా డిస్కౌంట్ వర్తించవచ్చు. ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి ఆఫర్‌లో మార్పు ఉండవచ్చు. **సూచించిన అంకెలు CT110 KS యొక్క BS4 మరియు BS6 రకాల ధరలోని తేడా. BS4 స్టాక్స్ ఉన్నంత వరకు ఇతర బజాజ్ మోడల్స్‌కి కూడా ధర తేడా వర్తిస్తుంది. *ప్లాటినా 110 హెచ్-గేయర్ డిస్క్ మరియు CT110 KSలకు తెలంగాణ ఎక్స్-షోరూమ్ ధర. **తక్కువ డౌన్ పేమెంట్‌ని CT110 KS BS4కి తెలంగాణ ఆన్ రోడ్ ధర ప్రకారం లెక్కించడం జరిగింది. వర్తించే విధంగా ప్రాసెసింగ్ ఫీజు, డిసిసి చార్జీలు మొదలగునవి అదనంగా ఉంటాయి. క్రెడిట్ ప్రమాణాలకు లోబడి. ఋణాన్ని అందించేవారి విచక్షణ మేరకు ఋణసదుపాయం ఉంటుంది. ముందు సూచన ఇవ్వకుండానే ఏదైనా లేదా అన్ని ఆఫర్స్‌ని సవరించే లేదా విరమించుకునే హక్కు బజాజ్ ఆటోకు ఉంటుంది. నియమాలు మరియు నిబంధనలు వర్తిస్తాయి.

**Authorised Dealers For Bajaj Auto Ltd.:** Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545, VENKAT BAJAJ 9703614888, 8008796695 • Mancherial MAHI BAJAJ 08736-259088 ,9912278641 • Adilabad SRR MOTORS 9491249451,9491159452. **Authorised Service Centre:** JAGITIAL 8522038460, **9949565692**, SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849362096, ARMOOR 9866669181, Balkonda 9059412880, Banswada 6305184613, Nandipet 9493021116, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, Kamarpally 9010686085, BHEEMGAL 9912334501, RAMAGUDAM 9912278650, JANNARAM 9440004495, BELLAMPALLI 9849686258, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208 CHENNUR 9949993645, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, NIRMAL 9491777000, GAJWEL 9848347349, MEDAK 7702014433, SIDDIPET 7702015577.

# మార్చి 26న రాజ్యసభకు ఎన్నికలు

- తెలంగాణలో రెండు సీట్లు సహా 55 స్థానాలకు షెడ్యూల్
- మార్చి 6న నోటిఫికేషన్.. 13 వరకు నామినేషన్లు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ న్యూఢిల్లీ:** తెలంగాణలో రెండు స్థానాలు సహా దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లోని 55 రాజ్యసభ స్థానాలకు వచ్చే నెల 26న ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. 17 రాష్ట్రాల్లోని 51 స్థానాలు ఏప్రిల్‌లో ఖాళీ కానున్నాయి. మరో నలుగురు సభ్యుల రాజీనామాతో ఖాళీలు ఏర్పడ్డాయి. వారి పదవీ కాలం కూడా ఏప్రిల్‌తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు మార్చి 5న నోటిఫికేషన్ జారీ చేయనున్నది. మార్చి 13 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 18 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. మార్చి 26న ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. తెలంగాణలో ఏప్రిల్ 9 నాటికి రెండు స్థానాలు ఖాళీ కానున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత కేవీపీ రామచంద్రరావు (కాంగ్రెస్), గరికపాటి మోహన్‌రావు (టీడీపీ) తెలంగాణకు ఎంపికయ్యారు. ఏప్రిల్‌లో పదవీ విరమణ చేసే ప్రముఖుల్లో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌నారాయణ్‌సింగ్, కేంద్రమంత్రి రాందాస్ అథావలే తదితరులున్నారు. మహారాష్ట్ర నుంచి ఏడు, తమిళనాడులో ఆరు, బెంగాల్, బీహార్‌ల్లో ఐదేసి, ఒడిశా, గుజరాత్, ఏపీల్లో నాలుగేసి, అసోం,మధ్యప్రదేశ్,రాజస్థాన్‌ల్లో మూడేసి, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జార్ఖండ్‌ల్లో రెండేసి, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయలలో ఒక్కో స్థానం ఖాళీ కానున్నాయి.

# రాజధాని.. రావణకాష్టం

- ఈశాన్య ఢిల్లీలో కొనసాగుతున్న హింసాకాండ
- 13కు చేరిన మృతుల సంఖ్య.. 200 మందికి గాయాలు
- మత ఘర్షణల స్థాయికి చేరుకున్న ఘర్షణలు
- మీడియా ప్రతినిధులపై అల్లరి మూకల దాడులు
- ఉన్నతాధికారులతో అమిత్‌షా సమీక్ష సమావేశం



మంగళవారం ఢిల్లీలో విధ్వంసం సృష్టిస్తున్న అల్లరి మూకలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వ్యతిరేక, అనుకూల ఆందోళనలతో మొదలైన హింసాకాండ మరింత ముదిరి ఢిల్లీని రావణకాష్టంగా మార్చింది. సీఏఏ నిరసనలతో మొదలైన ఆందోళనలు.. మత ఘర్షణల స్థాయి రూపును సంతరించుకొని మంగళవారం తీవ్రరూపం దాల్చాయి. ఈ ఘటనల్లో మరణించిన వారి సంఖ్య పదమూడుకు చేరింది. 200 మందికి పైగా గాయాలయ్యాయి.

ఒకవైపు దుకాణాల విధ్వంసం, మరోవైపు వీధుల్లో దుండగుల వీరంగం.. ఈశాన్య ఢిల్లీలోని జాఫ్రాబాద్, మౌజ్‌పూర్ తదితర ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు మంగళవారం కూడా కొనసాగాయి. ఉద్రిక్తతలు ప్రారంభమైన మౌజ్‌పూర్‌లో కొందరు అల్లరి మూకలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ.. తమ దారికి అడ్డొచ్చిన పండ్ల బండ్లు, రిక్షాలకు నిప్పు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నగరంలో ఉన్న నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. రాళ్లు, రాడ్లు, కత్తులను చేబూని.. హెల్మెట్లను ధరించి బీభత్సం సృష్టిస్తున్న అల్లరి మూకల్ని చెదరగొట్టేందుకు భాష్పవాయు గోళాల్ని ప్రయోగించారు. జాఫ్రాబాద్, మౌజ్‌పూర్, చాంద్‌బాగ్, ఖురేజీ ఖాస్, భజన్పుర తదితర ప్రాంతాల్లో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో మొత్తం 13 మంది చనిపోయినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. వీరిలో ఒక హెడ్ కానిస్టేబుల్ కూడా ఉన్నారు. మరో 200 మందికి పైగా గాయాలయ్యాయని, వీరిలో సగం మందికి బుల్లెట్ గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. దాడుల్లో గాయాలపాలైన బాధితుల్ని దవాఖానలకు తీసుకొస్తున్న అంబులెన్సులను కూడా దుండగులు అడ్డుకున్నారని, దీంతో పలువురు క్షతగాత్రుల్ని ద్విచక్ర వాహనాలు, వ్యానుల్లో తరలించినట్టు అధికారులు తెలిపారు. మీడియా ప్రతినిధులపై కూడా అల్లరి మూకలు దాడులకు పాల్పడ్డాయి. దీంతో జేకే 24X7 మీడియా సంస్థకు చెందిన ప్రతినిధి, ఎన్డీటీవీకి చెందిన ఇద్దరు ప్రతినిధులు గాయపడ్డారు. ఈశాన్య ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర హోంశాఖ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించింది. హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్, సీఎం కేజ్రీవాల్, ఢిల్లీ పోలీసు కమిషనర్ అమూల్య పట్నాయక్‌తో పాటు పలువురు రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉద్రిక్త ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి అన్ని రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు చేయి చేయి కలుపాలని సమావేశంలో నిర్ణయించారు. మరోవైపు, ఢిల్లీ ఘటనల నేపథ్యంలో ఎవరూ వదంతులను ప్రచారం చేయొద్దని.. శాంతి భద్రతలకు సహకరించాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఢిల్లీ గోకుల్‌పురిలో దుకాణానికి నిప్పపెట్టిన దుండగులు

### వెయ్యి మంది పోలీసుల మోహరింపు


తగినంత పోలీసు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోనే ఈశాన్య ఢిల్లీలో రేగిన హింసాత్మక ఘటనలను వెంటనే అదుపు చేయలేకపోయామని ఢిల్లీ పోలీసు కమిషనర్ అమూల్య పట్నాయక్ తెలిపారు. మరోవైపు, దాదాపు వెయ్యి మంది పోలీసులతో కూడిన ఓ బెటాలియన్‌ను ఉద్రిక్త ప్రాంతాల్లో మోహరించామని మరో అధికారి తెలిపారు.

### నగరంలోకి రానివ్వొద్దు

బయటి శక్తులు నగరంలోకి రాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అధికారులను ఆదేశించారు. అన్ని సమస్యలు చర్చల ద్వారానే పరిష్కారం అవుతాయని, ప్రజలు హింసాత్మక ఘటనలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. 1984లో సిక్కులకు వ్యతిరేకంగా జరిగిన అల్లర్ల తర్వాత.. ఆ స్థాయి హింసాత్మక పరిస్థితులను మళ్లీ ఇప్పుడే చూస్తున్నామని పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హింసాకాండ బాధాకరం

భేదాభిప్రాయాలను హుందాగా పరిష్కరించుకుందాం: కేటీఆర్



**హైదరాబాద్:** దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్న హింసాకాండపై రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కే తారక రామారావు (కేటీఆర్) మంగళవారం తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. 'ఢిల్లీలో జరుగుతున్న హింసాకాండ.. ఒక జాతిగా మనమెంత సున్నితంగా ఉన్నామో మనందరికీ గుర్తుచేసే ఓ బాధాకర పరిణామం. భారతదేశ ప్రతిష్ఠ, భారతీయుల జీవితాలు ప్రమాదంలో ఉన్నాయి. ప్రపంచం మనల్ని గమనిస్తున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని మరింత బలోపేతం చేసేలా.. మన భేదాభిప్రాయాలను హుందా గా పరిష్కరించుకుందాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కేటీఆర్ ట్విట్టర్‌లో స్పందించారు.

## పక్షపాత రాజకీయాలు వీడండి

**న్యూఢిల్లీ:** అల్లర్లతో దేశ రాజధాని అట్టుడకడంపై కాం గ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. పక్షపాత రాజకీయాలు వీడి ఢిల్లీలో శాంతిని పునరుద్ధరించాలని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా సూచించారు. 'ప్రధాని, హోంమంత్రి, ఢిల్లీ సీఎంకు మా విన్నపం. మీ రాజకీయ పక్షపాతాన్ని పక్కనబెట్టి, మీ పార్టీల నేతలుగా కాక సామాజిక నేతలుగా వ్యవహరించండి. ఢిల్లీ హింసపై తక్షణం స్పందించండి' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం స్పందిస్తూ అసమర్థులకు అధికారం కట్టబెట్టిన ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. 'అసమర్థ నేతలకు అధికారం కట్టబెట్టిన ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. పౌరసత్వ చట్టానికి సవరణ ఇప్పుడు ఎందుకు? ఇప్పటికీ మించిపోలేదు. సీఏఏ వ్యతిరేక నిరసనకారుల గొంతును ప్రభుత్వం వినాలి. చట్టం చెల్లుబాటుపై సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చే వరకు సీఏఏను అమలును నిలిపివేయాలి' అని పేర్కొన్నారు.

## కోరేగావ్-భీమాపై పవార్‌కు సమన్లు

**పుణె:** ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు సమన్లు జారీ చేయాలని కోరేగావ్-భీమా విచారణ కమిషన్ నిర్ణయించింది. 2018లో జరిగిన కోరేగావ్-భీమా అల్లర్లపై బీజేపీ సారథ్యంలోని నాటి రాష్ట్ర ప్రభుత్వం బాంబే హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ జేఎన్ పటేల్ సారథ్యంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అదే ఏడాది అక్టోబర్ 8న కమిషన్ ముందు శరద్ పవార్ అఫిడవిట్ దాఖలు చేశారు. అయితే ఇటీవల మీడియాలో పవార్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన్ను విచారించాలని వివేక్ విచార్‌మంచ్ సభ్యుడు సాగర్ షిండే.. కమిషన్ ముందు పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 18న పవార్ మీడియాతో మాట్లాడుతూ.. నాటి అల్లర్లలో హిందూత్వ సంస్థల పాత్రను కొట్టి పారేయలేమని, అయితే దీనిపై దర్యాప్తు సంస్థలే నిగ్గు తేల్చాలని స్పష్టం చేశారు.

## సాహిత్య అకాడమీ అవార్డుల ప్రదానం

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని కామని ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 24 మంది రచయితలకు సాహిత్య అకాడమీ అవార్డులను ప్రదానం చేశారు. అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కంబర్, ప్రముఖ పాటల రచయిత, సినీ నిర్మాత గుల్జార్ కలిసి అవార్డు గ్రహీతలకు పురస్కారాలను అందజేశారు. బండి నారాయణ స్వామి (శప్తభూమి), కాంగ్రెస్ సీనియర్ నేత, ఆంగ్ల రచయిత శశి థరూర్, ప్రముఖ హిందీ కవి నందకిషోర్ తదితరులు అవార్డును స్వీకరించారు.



అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బండి నారాయణస్వామి

## టిక్కెట్ల రద్దు చార్జీలతో రైల్వేకు తొమ్మిదివేల కోట్ల ఆదాయం

**కోట:** రైల్వే టిక్కెట్ల రద్దు, వెయిటింగ్ లిస్ట్‌లోని టిక్కెట్లను ప్రయాణికులు రద్దు చేసుకోకపోవడం వల్ల 2017-20లో రైల్వేకు రూ.9వేలకోట్ల ఆదాయం వచ్చింది. రాజస్థాన్‌లోని కోట ఆర్టీఐ కార్యకర్త సుజిత్ స్వామి దరఖాస్తుపై 'ది సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్' సమాధానమిచ్చింది. 9.5 కోట్ల మంది ప్రయాణికులు తమ టిక్కెట్లను రద్దు చేసుకోలేదని చెప్పింది.

## పెన్షన్ కమ్యుటేషన్ పునరుద్ధరణ

కేంద్ర కార్మిక శాఖ ఆమోదం.. 6.3 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం

**న్యూఢిల్లీ:** ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ లబ్ధిదారులకు కేంద్రం శుభవార్త అందించింది. పెన్షన్ కమ్యుటేషన్ విధానాన్ని పునరుద్ధరిస్తూ 'ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో)' తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర కార్మిక శాఖ అమలుచేసింది. దీన్ని వల్ల 6.3 లక్షల మంది పెన్షనర్లకు లబ్ది చేకూరనుంది. ఈ ఆప్షన్‌ను ఎంచుకున్న ఉద్యోగికి పదవీవిరమణ సమయంలో పెన్షన్ మొత్తంలో కొంత మొత్తాన్ని ఒకేసారి విత్‌డ్రా చేసుకునే వీలుంటుంది. అయితే ఆ వ్యక్తికి 15 ఏండ్లు ఆ మేరకు పెన్షన్ తగ్గుతుంది. 15 ఏండ్ల తర్వాత మళ్లీ పూర్తి పెన్షన్ లభిస్తుంది. 2008 సెప్టెంబర్ 25, అంతకంటే ముందు ఈ ఆప్షన్‌ను ఎంచుకున్న వారికి ఇది వర్తిస్తుంది. ఈపీఎఫ్‌వో నిర్ణయాన్ని ఈ నెల 20న కేంద్ర కార్మిక శాఖ నోటిఫై చేసింది. గతంలో పెన్షన్ కమ్యుటేషన్ ఆప్షన్‌ను రద్దు చేసిన ఈపీఎఫ్‌వో.. దాన్ని పునరుద్ధరిస్తూ గతేడాది ఆగస్టులో నిర్ణయం తీసుకున్నది.

## ఈజిప్టు మాజీ అధ్యక్షుడు ముబారక్ మృతి



**కైరో:** ఈజిప్టు మాజీ అధ్యక్షుడు హోస్నీ ముబారక్ (91) మంగళవారం మరణించారని ఆ దేశ ప్రభుత్వ టీవీ ప్రకటించింది. అనారోగ్య సమస్యలతో దవాఖానలో చేరిన ఆయన కన్నుమూశారని తెలిపింది. ముబారక్ 30 ఏండ్లు ఈజిప్టు దేశాధ్యక్షుడిగా ఉన్నారు. 2011లో ముబారక్‌కు వ్యతిరేకంగా వేల మంది యువత 18 రోజుల పాటు ఆందోళనలు జరుపగా సైన్యం ఒత్తిడి మేరకు అదే ఏడాది ఫిబ్రవరి 11న అధ్యక్ష పదవి నుంచి వైదొలిగారు. 900 మంది మరణానికి కారణమయ్యారన్న అభియోగాలపై ఏప్రిల్‌లో అరెస్ట్ చేయగా 2012 జూన్‌లో దిగువ న్యాయస్థానం దోషిగా నిర్ధారించి యావజ్జీవ ఖైదు విధించింది. 2014లో ఉన్నత న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది. అవినీతి ఆరోపణల కేసులో ముబారక్, ఆయన ఇద్దరు కొడుకులకు మూడేండ్ల జైలు శిక్ష పడగా 2017లో విడుదలయ్యారు.

## హస్తినలో హింసపై నేడు సుప్రీంకోర్టు విచారణ

**న్యూఢిల్లీ:** ఈశాన్య ఢిల్లీలో హింసపై బుధవారం సుప్రీంకోర్టు విచారణ జరుపనున్నది. హింసాత్మక ఘటనలకు కారణమైన దుండగులపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఢిల్లీ పోలీసులకు ఆదేశాలివ్వాలని మాజీ సమాచార కమిషనర్ వాజాహత్ హబీబుల్లా, భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్‌ఆజాద్ తదితరులు పిటిషన్ దాఖలు చేశారు.



## విజయ డెయిరీ పాల సేకరణ పెంచాలి

మంత్రి తలసాని ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విజయ డెయిరీకి పాల సేకరణను మరింత పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధిశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మాసాబ్ ట్యాంక్‌లోని తన చాంబర్‌లో విజయ డెయిరీ ఎండీ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాల సేకరణను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. విజయ డెయిరీ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రతి విక్రయకేంద్రంలో విజయ ఉత్పత్తులతోపాటు విజయ ఐస్‌క్రీం అందుబాటులో ఉంచాలని చెప్పారు. హైదరాబాద్‌లోని జూపార్క్, రవీంద్రభారతి, చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం, గోల్కొండ వంటి ప్రాంతాల్లో నూతనంగా విజయ ఔట్‌లెట్లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. జంటనగరాలతోపాటు జిల్లాల్లో విజయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని ఆదేశించారు.

# ఆరు లక్షల ఎకరాలు!

- సాగునీటిశాఖ ఆధీనంలోని భూమి లెక్క ఇదీ
- తెలంగాణలో పాత, కొత్త ప్రాజెక్టుల కోసం సేకరించిన విస్తీర్ణమిది
- సమగ్ర సమాచార సేకరణ
- నీటిపారుదలశాఖ ఆస్తులపై వెబ్‌సైట్ రూపకల్పనకు కసరత్తు
- సీఎం కేసీఆర్ సూచనతో దశాబ్దాల గందరగోళానికి తెర



నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒక సాగునీటి ప్రాజెక్టు కోసం 20వేల ఎకరాలు సేకరించారు.. మరో ప్రాజెక్టు కోసం 50వేల ఎకరాలు సేకరించారు. ఇలా తెలంగాణలోని పాత, కొత్త సాగునీటి ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమి నీటిపారుదలశాఖ వద్ద ఉన్న వివరాల ప్రకారం ఆరులక్షల ఎకరాలు! ఈ భూమి మొత్తం ప్రభుత్వం పేరిట మారిందా.. నీటిపారుదల శాఖ ఆధీనంలోనే ఉన్నదా.. సేకరించిన భూముల్లో ఏ ప్రాజెక్టు కింద ఎంత వినియోగంలో ఉన్నది.. ఎంత ఖాళీగా ఉన్నది.. ఖాళీ భూములకు రక్షణ ఉన్నదా.. ఈ ప్రశ్నలన్నింటికీ ఇప్పటివరకు నీటిపారుదలశాఖ వద్ద సరైన సమాచారం లేదు. దశాబ్దాలనాటి ఈ గందరగోళానికి తెరదించేందుకు నీటిపారుదలశాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా దాని ఆస్తుల జాబితాను కూడా రూపొందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించడంతో నీటిపారుదల శాఖ యంత్రాంగం ప్రస్తుతం ఈ పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే దాదాపు 90 శాతం వరకు వివరాల సేకరణ పూర్తవగా.. సంపూర్ణ సమాచారంతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా రూపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నిజాంకాలం నుంచి సమైక్య ఆంధ్రప్రదేశ్.. ఆపై తెలంగాణ రాష్ట్రంలో నిర్మించినవాటితో భారీ, మధ్యతరహా, చిన్ననీటిపారుదల ప్రాజెక్టులు పాతవి, కొత్తవి వందల సంఖ్యలో ఉన్నాయి. వీటి నిర్మాణ సమయంలో అవసరానికనుగుణంగా ప్రభుత్వాలు భూసేకరణ చేపట్టాయి. సేకరించిన భూమిలో ప్రాజెక్టు డిజైన్ ప్రకారం పంపుహౌజ్‌లు, రిజర్వాయర్లు, కాల్వలు తదితర నిర్మాణాలను చేపట్టాయి. వీటినిర్వహణకు కొంతభూమిని కేటాయించడంతోపాటు, అధికారులు, సిబ్బంది కోసం భవనాలు, కార్యాలయాల నిర్మాణం కూడా జరిగింది. నీటిపారుదలశాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇంజినీర్లు, కార్యాలయాలు, సిబ్బంది మాత్రమే కాకుండా అసలు తెలంగాణ సాగునీటిరంగం ఆస్తుల వివరాల జాబితాను సమగ్రంగా రూపొందించాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీని నియమించిన నీటిపారుదలశాఖ గత కొన్నిరోజులుగా ఈ జాబితా రూపకల్పనపై ముమ్మర కసరత్తు చేస్తున్నది. ఈ మేరకు మంగళవారం నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్.. ఈఎన్సీలు మురళీధర్ రావు, నాగేంద్రరావు, ఎన్ వెంకటేశ్వర్లు, హరిరాం, సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సీఈలు, ఎస్ఈలతో సమీక్ష నిర్వహించారు. వచ్చేనెల 2వ తేదీలోగా పూర్తి వివరాలు సేకరించి.. 15వ తేదీలోగా వాటిని కంప్యూటరీకరించాలని నిర్ణయించారు. వీటన్నింటిపై తుదిజాబితా రూపొందించాక ప్రత్యేకంగా 'ఇన్వెంటరీ ఆఫ్ తెలంగాణ ఇరిగేషన్ అసెట్స్' వెబ్‌సైట్ రూపకల్పనకు కసరత్తు చేస్తున్నారు.

### భూ వివరాల చిక్కులకూ విముక్తి

నీటిపారుదలశాఖ ఆస్తుల వివరాల సేకరణలో భాగంగా అధికారులు క్రోడీకరించిన వివరాల్లో.. రాష్ట్రంలోని పాత, కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు ఆరులక్షల ఎకరాలు సేకరించినట్టు తేలింది. ఇందులో చాలామేరకు నీటిపారుదలశాఖ పేరిట మారకపోవడాన్ని అధికారులు గుర్తించారు. కొన్ని మ్యుటేషన్ కూడా కాలేదు. సీఎం కేసీఆర్ సూచన మేరకు అధికారులు చేస్తున్న కసరత్తులో ఇలాంటి చిక్కుముళ్లకూ పరిష్కారం దొరుకనున్నది. కొన్నిచోట్ల నిర్వహణ పేరిట ఖాళీగా ఉన్న భూములకు రక్షణ చర్యలు చేపట్టేందుకు కూడా వీలవుతుందని అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల వద్ద పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టవచ్చని చెప్తున్నారు. ఇక.. ప్రాజెక్టుల నిర్వహణ అంశంలోనూ ఏకీకృతమైన వివరాలేమీ ఇప్పటివరకు లేవు. తాజా కసరత్తులో వివరాలన్నీ ఒకేచోట ఉండటం వల్ల మోటర్లు, కాల్వలు, రిజర్వాయర్ల నిర్వహణకు ఏటా ఎంత వెచ్చించాలనే దానిపై ఒక స్పష్టత రానున్నది.



సాగునీటిశాఖ అంతర్రాష్ట్ర విభాగం వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న సీఎస్ సోమేశ్‌కుమార్

## సాగునీటి అంతర్రాష్ట్ర నివేదిక విడుదల


ఆవిష్కరించిన సీఎస్ సోమేశ్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సాగునీటిరంగానికి సంబంధించిన కీలకమైన సమాచారంతో రూపొందించిన సాగునీటిశాఖ అంతర్రాష్ట్ర విభాగం వార్షిక నివేదికను మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంతర్రాష్ట్ర విభాగం చీఫ్‌ఇంజినీర్ నరసింహారావు, మైనర్ ఇరిగేషన్ చీఫ్‌ఇంజినీర్ వీరయ్య, క్వాలిటీ కంట్రోల్ సీఈ అజయ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ నరహరి బాబు, చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్ సుధాకర్ పాల్గొన్నారు. కృష్ణా, గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులు, అంతర్రాష్ట్ర అంశాలు.. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సీఎం కేసీఆర్ చాకచక్యంగా అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకోవడం, ప్రాజెక్టు నిర్మాణాన్నిసైతం రికార్డు సమయంలోనే పూర్తి చేయడం తదితర అంశాలను నివేదికలో పొందుపర్చారు. ట్రిబ్యునళ్ల వివరాలను కూడా పొందుపరిచిన ఈ నివేదికలో.. తాజాగా తెలుగురాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీపై కొనసాగుతున్న బ్రిజేష్ ట్రిబ్యునల్ క్రాస్ ఎగ్జామినేషన్ వివరాలను అందించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణలో ముంపు వివరాలపై రూర్కీ ఐఐటీ ఇచ్చిన నివేదిక వివరాలను ప్రస్తావించారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిపుణులు పరిశీలించిన క్షేత్రస్థాయి వివరాలు, మిషన్ కాకతీయ ఫలితాల వంటి అంశాలను కూడా నివేదికలో పొందుపరిచారు.

## నేడు ఎన్‌డబ్ల్యూడీఏ భేటీ

గోదావరి- కావేరి అనుసంధానంపై స్పష్టత వచ్చేనా?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలోని పలు నదుల అనుసంధానంపై జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) మరోసారి భేటీ అవుతున్నది. కేంద్ర జలశక్తి సహాయమంత్రి అధ్యక్షతన బుధవారం ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో ప్రత్యేక కమిటీ సమావేశం జరుగనున్నది. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల అధికారులు పాల్గొననున్నారు. గోదావరి- కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టును కూడా ఎజెండా అంశాల్లో చేర్చారు. దీనిపై గతంలోనే ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదనలు రూపొందించడగా.. తెలంగాణ తన అభిప్రాయాలను, ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్లను కూడా సూచించిన విషయం తెలిసిందే. గోదావరిలో వినియోగం పోను మిగులుజలాలను తరలించడంలో తమకెలాంటి అభ్యంతరంలేదని తెలంగాణ స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో గోదావరిలో మిగులుపై ఎన్‌డబ్ల్యూడీఏ తాజాగా ఏమైనా వివరాలు అందిస్తుందా? అనేది చూడాలి.




## దళితుల ప్రగతి లక్ష్యంగా బడ్జెట్ ప్రతిపాదనలు

- నోడల్ ఏజెన్సీ సమావేశంలో మంత్రి కొప్పుల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో దళితుల సామాజిక, ఆర్థిక ప్రగతి లక్ష్యంగా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. ప్రతిజిల్లాలో ఎస్సీ ఎస్‌డీఎఫ్ సమావేశాలను జిల్లా కలెక్టర్లు ఏర్పాటుచేసి బడ్జెట్ ప్రతిపాదనలు ప్రణాళికాబద్ధంగా రూపొందించాలని, విడుదలైన నిధులను కచ్చితంగా ఖర్చుచేయాలని సూచించారు. మంగళవారం సంక్షేమభవన్‌లో ఆయన అధ్యక్షతన తెలంగాణ షెడ్యూల్డు కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి నోడల్ ఏజెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ అభివృద్ధిశాఖ ద్వారా చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణకు బడ్జెట్ రూపొందించడంపై మంత్రి చర్చించారు.

# బీఎస్ 6 వాహనాలకే ఏప్రిల్ నుంచి రిజిస్ట్రేషన్

పాతబండ్ల రిజిస్ట్రేషన్‌కు మార్చి 31 గడువు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రవాణా శాఖలో మరో కీలక ప్రక్రియ మొదలైంది. పాత వాహనాల రిజిస్ట్రేషన్లకు మార్చి 31వ తేదీ వరకు గడువు విధించారు. అప్పట్లోగా బీఎస్-4 వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేదంటే అవి పాత సామగ్రిగా అమ్మేందుకే పనికొస్తాయని అధికారులు చెప్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కేంద్ర రవాణాశాఖ ఆదేశాలు జారీచేయగా, వాటిని వర్తింపజేస్తూ రాష్ట్ర రవాణాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆర్టీవోలకు ఆదేశాలిచ్చింది. తెలంగాణలో ఇప్పటివరకు ఆయా షోరూంల నుంచి కొనుగోలు చేసిన 2.96 లక్షల వాహనాలు రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉన్నట్టు రవాణాశాఖ గుర్తించింది. ఇవన్నీ వినియోగంలో ఉన్నా.. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం లేదని, పలు రోడ్డు ప్రమాదాల్లో బీమా కూడా రాకపోవడానికి ఇదే ప్రధాన కారణమని తేల్చింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మార్చి 31 వరకు బీఎస్-4 వాహనాలను విక్రయించుకోవాలని కేంద్రం ఆదేశించింది. ఈ వాహనాలకు ఏప్రిల్ 1 నుంచి రిజిస్ట్రేషన్లు చేయించే అవకాశం ఉండదని, ఆన్‌లైన్‌లో వాటి వివరాలు తొలగిస్తామని స్పష్టంచేసింది. ఏప్రిల్ 1 నుంచి బీఎస్-6 వాహనాలకే రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నది. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా ఈ ప్రక్రియను అమల్లోకి తీసుకొస్తున్నట్టు వివరించింది. రాష్ట్రంలో కూడా ఇది వర్తిస్తుందని రవాణా శాఖ జేటీసీ రమేశ్ వెల్లడించారు. దీనిపై అన్ని కార్యాలయాలకు సమాచారం పంపించామని చెప్పారు. ఇప్పటికే షోరూంలలో కొన్ని లక్షల బీఎస్-4 వాహనాలు ఉన్నాయి.

# సేకరించిన ధాన్యం 47 లక్షల టన్నులు

మొదటిపేజీ తరువాయి...

కమిషనర్, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్, ఒక పోలీసు అధికారి, సీడబ్ల్యూసీ రీజినల్ మేనేజర్, ఎస్‌డబ్ల్యూసీ ఎండీ, సెర్ప్ సీఈవో, ఎఫ్‌సీఐ జీఎం సభ్యులుగా ఉన్నారు.

### రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడి

సీఎం కేసీఆర్ దూరదృష్టితో అమలుచేస్తున్న రైతు సంక్షేమ చర్యలు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల విద్యుత్, రైతుబంధు వంటి పథకాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో ఈ వానకాలంలో రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014-15నాటికి 14.15 లక్షల హెక్టార్లలో వరిని సాగుచేస్తుండగా, 2018-19 నాటికి అది 24 లక్షల హెక్టార్లకు చేరింది. ధాన్యం దిగుబడులు కూడా గణనీయంగా పెరిగాయి. గతేడాది వానకాలంలో 41 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరుగగా, ఈ ఏడాది అదనంగా మరో ఆరు లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

### రైతుల ఖాతాల్లో రూ.8,625 కోట్లు

గతేడాది కంటే ఈ ఏడాది ధాన్యం కనీస మద్దతు ధర పెరిగింది. సాధారణ రకం ధరను క్వింటాకు రూ.1750 నుంచి రూ.1815కు, గ్రేడ్ ఏ రకం ధరను క్వింటాల్‌కు రూ.1770 నుంచి రూ.1835కు పెంచారు. ధాన్యం విక్రయించే రైతులకు కనీస మద్దతు ధరను తప్పనిసరిగా అందిస్తూ, కొనుగోళ్లలో దళారుల ప్రమేయం లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో 9.20 లక్షల మంది రైతుల నుంచి 47 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు వారి ఖాతాల్లో రూ. 8,625 కోట్లను జమచేశారు.

### యాసంగి కోసం కార్యాచరణ

వానకాలం పంటల కొనుగోళ్లను పకడ్బందీగా పూర్తిచేసిన పౌరసరఫరాలశాఖ యాసంగి కొనుగోళ్లకు సిద్ధమవుతున్నది. ఏప్రిల్ మొదటివారం నుంచి యాసంగి సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటినుంచే కార్యాచరణను రూపొందించే పనిలో పడ్డారు. గతేడాది యాసంగిలో 37లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేయగా, ఈ ఏడా ది 50 లక్షల మెట్రిక్‌టన్నుల వరకు ఉత్పత్తి కావొచ్చని ప్రాథమికంగా అంచనావేస్తున్నారు.

## మూడు కిలోల బంగారం పట్టివేత

బస్సు, క్యాబ్‌లో అక్రమంగా తరలిస్తున్న నలుగురి అరెస్టు

**హైదరాబాద్/ షాద్‌నగర్, నమస్తే తెలంగాణ:** బస్సు, క్యాబ్‌లో 3.09 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు పట్టుకున్నారు. కొందరు వ్యక్తులు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బంగారం తరలిస్తున్నారన్న సమాచారంతో రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద ఓ ప్రైవేటు బస్సును మంగళవారం తనిఖీచేశారు. అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని, అతడిచ్చిన సమాచారంతో బస్సు వెనుక క్యాబ్‌లో వస్తున్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురి వద్ద రూ.1.38 కోట్ల విలువైన 3.09 కిలోల (31 బిస్కెట్లు) బంగారం స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్టు చేసినట్టు డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అడిషనల్ డీజీ డీపీ నాయుడు తెలిపారు.



డీఆర్ఎస్ అధికారులు పట్టుకున్న బంగారం



**మహాత్ముడికి నివాళి**

ట్రంప్, మెలానియా దంపతులు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. గాంధీజీ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించి, ప్రాంగణంలో మొక్కను నాటారు. 'మహాత్ముడి ఆలోచనల నుంచి ఉద్భవించిన అద్భుతమైన భారత్‌కు అమెరికా ప్రజలు అండగా ఉంటారు. ఇది నాకు దక్కిన అద్భుతమైన గౌరవం' అని సందర్శకుల పుస్తకంలో ట్రంప్ రాశారు.



రాష్ట్రపతి భవన్‌లో ట్రంప్ దంపతులను ఆహ్వానిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ



**బై బై ఇండియా**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల భారత పర్యటన ముగిసింది. ట్రంప్, మెలానియా దంపతులు, వారి కూతురు ఇవాంకా, అల్లుడు కుష్నర్ మంగళవారం రాత్రి ఢిల్లీలోని పాలమ్ విమానాశ్రయం నుంచి ఎయిర్‌ఫోర్స్ వన్‌లో అమెరికాకు తిరుగు ప్రయాణమయ్యారు. భారత పర్యటన ఫలప్రదమైందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# రక్షణబంధం బలోపేతం

### 300 కోట్ల డాలర్ల ఒప్పందంపై అమెరికా, భారత్ సంతకాలు
### భారత్‌కు అత్యాధునిక అపాచీ, ఎంహెచ్-60 రోమియో హెలికాప్టర్లు
### మరో మూడు ఎంవోయూలపైనా సంతకాలు

- సీఏఏ భారత్ అంతర్గత అంశం
- అందరికీ మతస్వేచ్ఛ ఉండాలి అని కోరుకుంటున్న మోదీ
- ఉగ్రవాదంపై పోరుకు కట్టుబడి ఉన్నాం: ట్రంప్
- భారత్‌లో ఎఫ్‌డీసీ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** రక్షణ రంగంలో అమెరికా, భారత్ మధ్య బంధం మరింత బలోపేతమైంది. ఇరు దేశాల మధ్య 300 కోట్ల డాలర్ల (దాదాపు రూ.21,549 కోట్ల) ఒప్పందం కుదిరింది. దీంట్లో భాగంగా అత్యాధునిక అపాచీ, ఎంహెచ్-60 రోమియో హెలికాప్టర్లు, ఇతర ఆయుధ సామగ్రిని భారత్‌కు అమెరికా అందించనున్నది. దీంతోపాటు రెండు దేశాల మధ్య మరో మూడు అవగాహనా ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరాయి. మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శిఖరాగ్రస్థాయి చర్చలు జరిపారు. అనంతరం వారిద్దరూ సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. భారత్ అద్భుతమైన దేశమని, మోదీ గొప్ప నేత అని మరోమారు కొనియాడారు. భారత్‌లో తన రెండు రోజుల పర్యటన అద్భుతంగా సాగిందన్నారు. 'మొతెరాలో నాకు గొప్ప గౌరవం దక్కింది. దాదాపు 1.25 లక్షల మంది ప్రజలు స్టేడియంలో ఉన్నారు. వారు నాకన్నా మిమ్మల్ని (మోదీ) చూడటానికే వచ్చారని భావిస్తున్నా. నేను మీ (మోదీ) పేరును ఉచ్ఛరించినప్పుడల్లా స్టేడియం హోరెత్తింది. ప్రజలు అంతలా మిమ్మల్ని ప్రేమిస్తున్నారు' అని మోదీతో ట్రంప్ అన్నారు. రెండు దేశాల మధ్య 300 కోట్ల డాలర్ల (దాదాపు రూ.21,549 కోట్ల) రక్షణ ఒప్పందం కుదిరిందని ట్రంప్ చెప్పారు. ఇందులో భాగంగా ప్రపంచంలోనే అత్యాధునిక ఎంహెచ్-60 రోమియో, అపాచీ హెలికాప్టర్లు, ఆధునిక ఆయుధసామగ్రిని అందిస్తామని తెలిపారు. ఇస్లామిక్ ఉగ్రవాదం నుంచి పౌరులను రక్షించేందుకు రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయని పునరుద్ఘాటించారు.

**సమగ్ర వాణిజ్య ఒప్పందంపై దృష్టి**

భారత్‌తో సమగ్ర వాణిజ్య ఒప్పందంపైనా దృష్టి సారించామని ట్రంప్ చెప్పారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక సుంకాలను విధిస్తుందని, ఈ విషయంలో పునరాలోచించాలని కోరారు. భారత్-అమెరికా మధ్య ఇప్పుడు దృఢమైన బంధం ఉన్నదని, అద్భుతమైన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌కు అమెరికా ఎగుమతులు 60 శాతం మేర, ఇంధన రంగ ఎగుమతులు 500 శాతం మేర పెరిగినట్టు చెప్పారు. వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్‌లో 'అమెరికా అంతర్జాతీయ ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ' శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటుచేయబోతున్నట్టు ప్రకటించారు. అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, జపాన్ మధ్య సంబంధాల పునరుద్ధరణపై మోదీతో కలిసి పనిచేస్తున్నట్టు చెప్పారు.

**మోదీ మతస్వేచ్ఛ కోరుకుంటున్నారు**

భారత్‌లో మతస్వేచ్ఛపై మోదీతో చర్చించానని ట్రంప్ తెలిపారు. 'మా చర్చల సందర్భంగా మతస్వేచ్ఛ గురించి మాట్లాడుకున్నాం. దేశంలోని ప్రజలందరికీ మతస్వేచ్ఛ ఉండాలని మోదీ కోరుకుంటున్నారు. తమ ప్రభుత్వం ముస్లింలతో సన్నిహితంగా పనిచేస్తున్నదని ఆయన చెప్పారు. ఒకసారి గతాన్ని పరిశీలిస్తే మత స్వేచ్ఛ గురించి భారత్ ఎంతో పోరాడింది' అని ట్రంప్ పేర్కొన్నారు. సీఏఏ వ్యతిరేక ఆందోళనలు హింసాత్మకంగా మారడంపై చర్చించారా అన్న విలేకరుల ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఇది భారత అంతర్గత విషయం. దీని గురించి మాట్లాడను' అని చెప్పారు. ప్రజల కోసం ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. 'ఎలాంటి వివాదాస్పద అంశాలపైనా స్పందించదలుచుకోలేదు. ఒక్క జవాబుతో నా రెండు రోజుల పర్యటన, రెండు రోజుల ప్రయాణాన్ని వ్యర్థం చేయలేను. ఏదైనా మాట్లాడితే మీరు నా పర్యటన గురించి పూర్తిగా పక్కన పెట్టేస్తారు' అని వ్యాఖ్యానించారు. తాలిబన్లతో కుదుర్చుకోనున్న శాంతి ఒప్పందంపైనా మోదీతో చర్చించానన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు రష్యా ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలను ట్రంప్ తోసిపుచ్చారు. ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి తనకు అలాంటి సమాచారం ఏమీ లేదన్నారు.

### కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం వహిస్తా

కశ్మీర్ అంశం భారత్-పాకిస్థాన్ మధ్య అతిపెద్ద సమస్యగా మారిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇది ఎంతోమంది ప్రజలను వేధిస్తున్నదని చెప్పారు. ఈ అంశంపై అవసరమైతే మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నానని పునరుద్ఘాటించారు. మోదీతో చర్చల సందర్భంగా పాకిస్థాన్ అంశం కూడా వచ్చిందని తెలిపారు. 'నాకు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. సీమాంతర ఉగ్రవాదాన్ని నియంత్రించడానికి వారు చర్యలు చేపట్టారు' అని పేర్కొన్నారు.

# శతాబ్దపు మైత్రి





హైదరాబాద్ హౌజ్‌లో మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్, మోదీ

- ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలే మన ప్రాతిపదిక
- ప్రపంచ ప్రయోజనాల దృష్ట్యా అడుగులేద్దాం
- భారీ వాణిజ్య ఒప్పందానికి చర్చలు ప్రారంభం
- సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** భారత్, అమెరికా మైత్రి 21వ శతాబ్దంలో 'అతి ముఖ్యమైన భాగస్వామ్యాలలో ఒకటని' ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. పెరుగుతున్న ద్వైపాక్షిక, రక్షణ, భద్రత సహకారం ఈ వ్యూహాత్మక బంధంలో కీలకమని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌లో విస్తృత స్థాయి చర్చల అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మాట్లాడారు. ద్వైపాక్షిక వాణిజ్యానికి సంబంధించి రెండు దేశాల వాణిజ్య మంత్రుల మధ్య సానుకూల చర్చలు జరిగాయని మోదీ తెలిపారు. 'మంత్రులు అంగీకారానికి వచ్చిన అవగాహన ఒప్పందానికి చట్టరూపు ఇవ్వాలని అధ్యక్షుడు ట్రంప్, నేను నిర్ణయించాం. భారీ వాణిజ్య ఒప్పందానికి చర్చలు ప్రారంభించాలని కూడా నిర్ణయం తీసుకున్నాం. రెండు దేశాలకు ఇది మంచి ఫలితాలు అందిస్తుందని మేం భావిస్తున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు. రెండు దేశాల సంబంధాలను విస్తృత ప్రపంచ భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రపంచంలో కనెక్టివిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో సుస్థిర, పారదర్శక నిధుల వినియోగం ఉండాలని అంగీకారానికి వచ్చామని, ప్రపంచ ప్రయోజనాల దృష్టానే ఈ పరస్పర అవగాహన అని పేర్కొన్నారు. మునుపెన్నడూ లేని విధంగా అధ్యక్షుడు ట్రంప్‌కు భారత్‌లో లభించిన అపూర్వ స్వాగతం ఎన్నటికీ గుర్తుండి పోతుందని చెప్పారు. రెండు దేశాల మధ్య సంబంధాలు ప్రభుత్వాల వరకే పరిమితం కాదని, ప్రజలు కేంద్రంగానే బంధం బలోపేతమైందన్నారు. గత ఎనిమిది నెలల్లో ట్రంప్‌ను ఐదుసార్లు కలిసిన విషయాన్ని ప్రధాని గుర్తుచేశారు.

**డ్రగ్స్, నార్కో టెర్రరిజం కట్టడికి నూతన యంత్రాంగం**

రక్షణ, భద్రత, ఇంధన, సాంకేతికత, గ్లోబల్ కనెక్టివిటీ, వాణిజ్యం తదితర అంశాల్లో అధ్యక్షుడు ట్రంప్‌తో విస్తృత స్థాయి చర్చలు జరిపినట్లు ప్రధాని మోదీ తెలిపారు. డ్రగ్స్ సరఫరా, నార్కో టెర్రరిజం తదితర వ్యవస్థీకృత నేరాల కట్టడికి నూతన యంత్రాంగం ఏర్పాటుచేసేందుకు రెండు దేశాలు నిర్ణయించాయని చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో పారదర్శకతకు భారత్, అమెరికా కట్టుబడి ఉన్నాయని, గత మూడేండ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెండంకెల వృద్ధిని సాధించిందని వివరించారు. సమావేశానికిముందు ప్రధాని మాట్లాడుతూ.. ట్రంప్‌కు మరోసారి స్వాగతమని చెప్పారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను ఈ స్థాయికి తీసుకొచ్చేందుకు ట్రంప్ విశేష కృషి చేశారని పేర్కొన్నారు.

### మూడు ఎంవోయూలు

మోదీ-ట్రంప్ ద్వైపాక్షిక చర్చల్లో భారత్-అమెరికా మధ్య ఆరోగ్యం, ఇంధన రంగాలకు సంబంధించి మూడు ఎంవోయూలు కుదిరాయి. మానసిక ఆరోగ్యంపై రెండు దేశాల ఆరోగ్యశాఖల మధ్య, సురక్షిత ఔషధాల ఉత్పత్తికి భారత్‌కు చెందిన సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్, అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ మధ్య, ఇంధన రంగంలో సహకారానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), ఎక్సాన్ మొబిల్ ఇండియా ఎల్ఎన్‌జీ లిమిటెడ్, చార్ట్ ఇండస్ట్రీస్ మధ్య ఎంవోయూలు కుదిరాయి. వీటిపై ఆయా విభాగాలు, సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు.

## రాష్ట్రపతి భవన్‌లో ఘనస్వాగతం

**న్యూఢిల్లీ:** డొనాల్డ్ ట్రంప్‌కు మంగళవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో ఘనస్వాగతం లభించింది. ట్రంప్‌తోపాటు ఆయన భార్య మెలానియాకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు, ప్రధాని మోదీ స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి భవన్ ఆవరణలో ట్రంప్‌కు త్రివిధ దళాలు గౌరవవందనం సమర్పించాయి. ఈ కార్యక్రమానికి ట్రంప్‌కుమార్తె ఇవాంక,అల్లుడు కుష్నర్, రక్షణమంత్రి రాజ్‌నాథ్, విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ తదితరులుహాజరయ్యారు.

## సీఎన్ఎన్ జర్నలిస్ట్‌తో ట్రంప్ వాగ్వాదం

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్, సీఎన్ఎన్ జర్నలిస్ట్ జిమ్ అకోస్టా మధ్య మంగళవారం తీవ్ర వాగ్వాదం నడిచింది. వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో విదేశీ జోక్యాన్ని తిరస్కరిస్తానని ప్రతిజ్ఞ చేయగలరా? అని ట్రంప్‌ను అకోస్టా ప్రశ్నించగా.. ఏ దేశం సాయం తనకు అక్కర్లేదంటూ ట్రంప్ బదులిచ్చారు. సీఎన్ఎన్ ఇటీవల క్షమాపణలు కోరిన విషయాన్ని ట్రంప్ ప్రస్తావించగా..మీకంటే మా రికార్డు ఉత్తమమని అకోస్టా బదులిచ్చారు.

# ట్రంప్‌కు రాష్ట్రపతి ప్రత్యేక విందు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ మంగళవారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక విందును ఏర్పాటుచేశారు. రాష్ట్రపతి భవన్‌కు విచ్చేసిన ట్రంప్ దంపతులకు రాష్ట్రపతి కోవింద్, ఆయన సతీమణి సవిత సాదర స్వాగతం పలికారు. విందుకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, ఆయన మంత్రివర్గ సహచరులు, తెలంగాణ, అసోం, కర్ణాటక, హర్యానా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డే, రక్షణ బలగాల అధిపతి జనరల్ బిపిన్ రావత్, విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీ, బ్యాంకర్ కొటక్ మహీంద్రా, సంగీత దర్శకులు ఏఆర్ రెహమాన్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. దర్బార్ హాల్‌లోని ఐదో శతాబ్దంనాటి గౌతమ బుద్ధ విగ్రహం ఎదుట ట్రంప్ దంపతులు, కోవింద్ దంపతులు ఫొటోలు దిగారు. అనంతరం ట్రంప్, కోవింద్ కొద్దిసేపు సమావేశమయ్యారు. భారత్‌కు అమెరికా విలువైన మిత్రదేశమని, ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారత్ అధిక ప్రాధాన్యమిస్తున్నదని కోవింద్ తెలిపారు. ట్రంప్ మాట్లాడుతూ.. రెండు రోజుల భారత పర్యటన ఫలప్రదంగా సాగిందని చెప్పారు. వాణిజ్య, రక్షణ ఒప్పందాలపై రెండు దేశాలు కసరత్తు చేస్తున్నాయని పేర్కొన్నారు. విందు సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. రెండు రోజుల పర్యటన అద్భుతంగా సాగిందని చెప్పారు. 'ఈ రెండు రోజులు చాలా ప్రత్యేకం. ఐ లవ్ ఇండియా. ఐ లవ్ ఇండియన్స్. మేం మళ్లీ తిరిగి వస్తాం' అని పేర్కొన్నారు. రాష్ట్రపతి కోవింద్ మాట్లాడుతూ.. భారత్‌కు అమెరికా సహజ భాగస్వామి అని చెప్పారు. దాదాపు 40 లక్షల మందికిపైగా భారతీయులు అమెరికాను తమ నివాసంగా చేసుకున్నారని, నవభారత విజన్‌కు, అమెరికన్ డ్రీమ్‌కు వారు వారధిలా ఉన్నారని చెప్పారు.



రాష్ట్రపతి భవన్‌లో ట్రంప్ దంపతులతో రాష్ట్రపతి కోవింద్ దంపతులు

### విందుకు హాజరైన సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం రాష్ట్రపతి కోవింద్ ఇచ్చిన విందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హాజరయ్యారు. ఈ విందుకు కేవలం తొమ్మిది రాష్ట్రాల ముఖ్యమంత్రులను మాత్రమే ఆహ్వానించారు. రాష్ట్రపతి ఆహ్వానం మేరకు విందులో పాల్గొనడానికి సీఎం కేసీఆర్ మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లారు. ఆయన వెంట ఎంపీ కే కేశవరావు తదితరులున్నారు. ఢిల్లీకి వచ్చిన సీఎంకు తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు స్వాగతం పలికారు. రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చిన విందులో కేసీఆర్ పాల్గొన్నారు. విందు సందర్భంగా రాష్ట్రపతి కోవింద్ సీఎం కేసీఆర్‌ను ట్రంప్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ట్రంప్‌తో ముచ్చటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం హైదరాబాద్‌కు తిరిగి వచ్చే అవకాశం ఉన్నది.

# సీఏఏపై ప్రస్తావించలేదు

- మతస్వేచ్ఛపై ట్రంప్-మోదీ సానుకూలంగా మాట్లాడారు
- ప్రధానంగా ఐదు అంశాలపై చర్చ జరిగింది
- భారత విదేశాంగ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ వెల్లడి



**న్యూఢిల్లీ:** ట్రంప్-మోదీ ద్వైపాక్షిక చర్చల సందర్భంగా పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గురించి ప్రస్తావనే రాలేదని భారత విదేశాంగ కార్యదర్శి హర్షవర్ధన్ శృంగ్లా తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ట్రంప్, మోదీ ఐదుగంటలకుపైగా చర్చలు జరిపారన్నారు. ఈ సందర్భంగా మత స్వేచ్ఛ అంశంపై ఇద్దరు నేతలు సానుకూల వాతావరణంలో మాట్లాడుకున్నారని చెప్పారు. 'బహుళత్వం, వైవిధ్యం' అనేవి రెండు దేశాలను కలిపి ఉంచుతున్న అంశాలని పేర్కొంటూ ఒకరినొకరు అభినందించుకున్నారని వెల్లడించారు. భారత్, అమెరికా మధ్య ప్రధానంగా భద్రత, రక్షణ, శక్తి, టెక్నాలజీ, రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలపై చర్చ జరిగిందన్నారు. రక్షణ రంగంలో భారత్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని ట్రంప్ చెప్పారన్నారు. వాణిజ్య పరంగా త్వరలో భారీ ఒప్పందం కుదుర్చుకోవాలని మోదీ, ట్రంప్ నిర్ణయించారన్నారు. పరస్పర సహకారానికి సంబంధించి ఇంధన రంగం ప్రాధాన్య అంశంగా మారిందని, ఈ ఏడాది అమెరికా నుంచి 900 కోట్ల డాలర్ల (దాదాపు రూ.64.7 వేల కోట్లు) పెట్టుబడులు ఆశిస్తున్నామన్నారు. ట్రంప్, మోదీ మధ్య పాకిస్థాన్ అంశం చర్చకు వచ్చిందని, ఈ సందర్భంగా సీమాంతర ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను మోదీ ప్రస్తావించారన్నారు. హెచ్-1బీ వీసా అంశాన్ని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారని, అమెరికా ఐటీ రంగానికి భారతీయ టెకీలు అందిస్తున్న సేవల గురించి గుర్తుచేశారని శృంగ్లా తెలిపారు.

# 'హ్యాపీ క్లాసెస్' స్ఫూర్తిదాయకం

- ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులపట్ల మెలానియా హర్షం
- మేళతాళాలతో, నుదట తిలకం దిద్ది స్వాగతం పలికిన బాలలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** దేశరాజధాని ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం నిర్వహిస్తున్న 'సంతోషకర తరగతులు (హ్యాపీ క్లాసెస్)' స్ఫూర్తిదాయకమని అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ తెలిపారు. తన భర్త, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి సోమవారం భారత పర్యటనకు వచ్చిన ఆమె, మంగళవారం దక్షిణ ఢిల్లీ మోతీ బాగ్‌లోని సర్వోదయ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మెలానియా రాకపట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తమ చేతుల్లోని భారతీయ, అమెరికా జెండాలను రెపరెపలాడించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన కొందరు విద్యార్థినులు మెలానియా నుదుట తిలకం దిద్ది, పుష్పగుచ్ఛం ఇచ్చి బ్యాండుమేళంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసిన ఆమె, పాఠశాలలో ప్రత్యేకంగా అమలు చేస్తున్న 'సంతోషకర తరగతుల' తీరును పరిశీలించారు. 'అమెరికా ఎంత పెద్దది? చాలా దూరమా? ప్రథమ మహిళగా మీరు ఏం చేస్తారు?' అంటూ బాలలు అడిగిన చిలిపి ప్రశ్నలకు చిరునవ్వుతో సమాధానమిచ్చారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. 'నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. భారత్‌లో ఇది నా తొలి పర్యటన. ఇక్కడి ప్రజలు ఎంతో ఆత్మీయంగా స్వాగతం పలికారు. ప్రకృతితో మమేకమవుతూ విద్యార్థులు తమ దినచర్యను ప్రారంభించడం చాలా స్ఫూర్తిదాయకం. సానుకూల దృక్పథంతో విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులు తీర్చిదిద్దడం హర్షనీయం' అని మెలానియా ప్రశంసించారు.



సర్వోదయ ప్రభుత్వ పాఠశాలలో మెలానియా ట్రంప్ సందడి

**ఢిల్లీ వాసులు, విద్యార్థులకు గొప్ప రోజు: కేజ్రీవాల్**

మెలానియా పాఠశాల సందర్శన నేపథ్యంలో సీఎం అరవింద్ కేజ్రీవాల్ ట్విట్టర్ ద్వారా ఆమెకు స్వాగతం పలికారు. 'అమెరికా ప్రథమ మహిళ ఇవాళ మన పాఠశాలలోని 'హ్యాపీనెస్ తరగతులను' తిలకిస్తారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఢిల్లీ వాసులకు ఇది గొప్ప రోజు. శతాబ్దాలుగా ప్రపంచానికి భారతదేశం ఆధ్యాత్మికతను నేర్పింది. ఇప్పుడు అదే ఆనందకర సందేశాన్ని ఆమె మన పాఠశాల నుంచి తీసుకెళ్లనుండటం నాకు సంతోషంగా ఉన్నది' అని ట్వీట్ చేశారు.

## 'తాజ్'కు ట్రంప్ ఫిదా

### గైడ్ నితిన్‌కుమార్ వెల్లడి

**ఆగ్రా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అమెరికా మొదటి మహిళ మెలానియా తాజ్‌మహల్ అందాలను చూసి ఫిదా అయ్యారు. ట్రంప్ దంపతులను తాజ్‌మహల్ ఆకట్టుకున్నదని వారికి గైడ్‌గా వ్యవహరించిన ఆగ్రాకు చెందిన నితిన్‌కుమార్ పేర్కొన్నారు. పాలరాతి కట్టడం అందాలను చూడగానే 'అద్భుతం' అని ట్రంప్ పేర్కొన్నట్టు చెప్పారు. ట్రంప్, మెలానియాతో కలిసి తాజ్‌ను సోమవారం సందర్శించడం తెలిసిందే. 'తాజ్‌మహల్ చరిత్రను, నిర్మాణం, దాని వెనుక ఉన్న కథను ట్రంప్ దంపతులకు తెలియజేశా. మొఘల్ చక్రవర్తి షాజహాన్, ఆయన భార్య ముంతాజ్ మహల్ కథను చెప్పాను. సొంత కుమారుడు ఔరంగాజేబు.. షాజహాన్‌ను ఎలా నిర్బంధించారు, అతను మరణించాక ముంతాజ్ సమాధి పక్కనే ఆయనను ఖననం చేసిన విషయాలు తెలుసుకొన్న తర్వాత ట్రంప్ ఉద్వేగానికి గురయ్యారు' అని నితిన్‌కుమార్ తెలిపారు. స్మారక చిహ్నం కట్టడాన్ని చూడగానే ట్రంప్ దంపతుల నోటమాట రాలేదని చెప్పారు. తాజ్ నిర్మాణం గురించి చెప్తున్నప్పుడు ఆసక్తి కనబర్చారని పేర్కొన్నారు.

# షేర్వానీలో మెరిసిన ఇవాంకా!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** భారత పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా తన వస్త్రధారణ విషయంలో ప్రథమ మహిళ మెలానియా ట్రంప్‌ను అనుసరించారు. భారతీయత ఉట్టిపడేలా తెలుపు రంగు షేర్వాణీ ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఇవాంకా.. ప్రముఖ భారతీయ డిజైనర్ అనితా డోంగ్రే రూపొందించిన డ్రెస్‌ను ధరించారు. పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ పట్టుతో ఈ షేర్వానీని రూపొందించారు. ఈ షేర్వానీ డిజైన్ కాలాతీతమైనదని, 20 ఏండ్ల కిందట ఈ స్టైల్ రూపొందినా, ఇప్పటికీ అంతే అద్భుతంగా అనిపిస్తున్నదని అనితా డోంగ్రే పేర్కొన్నారు. సోమవారం మెలానియా 20వ శతాబ్దపు భారతీయ వస్త్రధారణలో కనిపించిన సంగతి తెలిసిందే. తెల్లటి జంప్‌సూట్ వేసుకుని మధ్యలో నడుముకు ఆకుపచ్చటి కండువాను ధరించారు. దీన్ని ఫ్రెంచ్ అమెరికన్ డిజైనర్ హెర్వ్ పియరీ రూపొందించారు.



1955 పౌరసత్వ చట్టంతో దేశం సుభిక్షంగా, ప్రశాంతంగా ఉన్నది. ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టం ఎందుకు? దీన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం సీఏఏ వ్యతిరేక నిరసనకారుల అభ్యంతరాలు వినాలి. సుప్రీంకోర్టు అభిప్రాయం చెప్పేదాకానైనా దాన్ని పక్కనపెట్టాలి.

**పి.చిదంబరం, కాంగ్రెస్ సీనియర్ నేత**

పై అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవటంతో ఢిల్లీ పోలీసులు అల్లర్లను అదుపు చేయలేకపోతున్నారు. బయటి నుంచి వచ్చినవారితోనే అల్లర్లు జరుగుతున్నాయని అంటున్నారు. కొంతకాలం ఢిల్లీ సరిహద్దులను మూసేస్తేనే మంచిది.

**అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1910**

దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ఆఫ్రికా సంస్థలకు మద్దతు తెలిపిన మహాత్మాగాంధీ. వేల్స్ రాణి పర్యటనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు.

**1935**

'రాడార్'ను కనుగొన్న రాబర్ట్ వాట్సన్ వాట్.





**1952**

బ్రిటన్ అణుబాంబు కలిగి ఉన్నదని ప్రకటించిన చర్చిల్.

తమిళనాడులోని శ్రీలంక శరణార్థుల ద్వంద్వ పౌరసత్వ సమస్య మళ్లీ తెరమీదికి వచ్చింది. నిజానికి ద్వంద్వ పౌరసత్వ విషయం 2016 ఎన్నికల సందర్భంగా జయలలిత తెరమీదికి తెచ్చారు. విదేశీ పౌరసత్వం ఉన్న భారతీయులకు కూడా దేశంలో రాజకీయ హక్కులతోపాటు, వ్యవసాయ భూములను కొనుగోలు చేసే హక్కు లేదు. అలాంటిది ఎలాంటి చట్టబద్ధత లేకుండా దేశంలో ఉన్న శ్రీలంక శరణార్థులకు ద్వంద్వ పౌరసత్వం సందేహాస్పదమే. ఈ మధ్యనే రాజ్యసభలో కేంద్రం కూడా ద్వంద్వ పౌరసత్వం ఇచ్చే సమస్యే లేదని తేల్చిచెప్పటం గమనార్హం.

**ది హిందూ**

దేశంలో తలపెట్టిన డిజిటలీకరణ సానుకూల ఫలితాలను ఇస్తున్నది. గత కొంతకాలంగా దేశంలో డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. నందన్ నీలేకని నేతృత్వంలో రిజర్వ్‌బ్యాంకు ఏర్పాటుచేసిన కమిటీ అధ్యయనం ప్రకారం కూడా డిజిటల్ లావాదేవీలు 2.4 నుంచి 22 శాతానికి పెరిగాయి. ఈ క్రమంలో గతేడాది ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను ఎత్తేయాలని చెప్పటం ప్రతికూల ప్రభావం చూపుతుందని అంటున్నారు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# ట్రంప్ స్నేహబంధం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత పర్యటన గతంతో పోలిస్తే విశేషమైనదిగా నిలుస్తుంది. ఇప్పటివరకు అమెరికా అధ్యక్షులు విదేశీ యాత్రలో భాగంగా ఇతర దేశాలతో పాటు భారత సందర్శనకు వచ్చారు. విధాన నిర్ణయాలు తీసుకునే సందర్భంలో భారత, పాకిస్థాన్ దేశాలను కలిపి ఆలోచించేవారు. కానీ ఇప్పుడు ట్రంప్ ప్రత్యేకించి భారత పర్యటన కోసమే రావడం అమెరికా విధానకర్తల దృక్కోణంలో మన దేశానికి పెరిగిన ప్రాధాన్యాన్ని సూచిస్తున్నది. ప్రధాని మోదీ కూడా తదనుగుణమైన స్వాగత ఏర్పాట్లుచేశారు. రహదారులకు ఇరువైపులా ప్రజలు స్వాగతం పలుకుతుండగా ప్రయాణించిన ట్రంప్, మోతెరా స్టేడియంలో లక్షకు పైగా జనాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఆ మరుసటి రోజు పరిశ్రమల ప్రతినిధులతోనూ సమావేశమై వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. సాధారణంగా విదేశీ నాయకులు అధికారిక చర్చలతో పాటు అదనంగా పౌర కార్యక్రమాలలోనూ పాల్గొనడం పరిపాటి. కానీ ట్రంప్ పర్యటనలో ద్వైపాక్షిక చర్చలతో పాటు, ప్రజలతో కలిసిపోవడానికీ విశేష ప్రాధాన్యం ఉన్నది. ఈ ప్రజా కార్యక్రమాన్ని అమెరికాలో ట్రంప్ ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడేదనే స్థాయికి కుదించి చూడకూడదు. రెండుదేశాల మధ్య భిన్న రంగాలలో సంబంధాలు బలపడుతూనే ఉన్నాయి. ఇందుకు రెండు దేశాల మధ్య కుదిరిన తాజా ఒప్పందాలే నిదర్శనం. అయితే దేశాల మధ్య అధికారిక సంబంధాలను నెరపడంతో పాటు, ఆ స్ఫూర్తిని ప్రజలకు చేర్చడం కూడా అవసరం. ఈ కోణంలో భారత్, అమెరికా సంబంధాలు మరింత ఉన్నత స్థాయికి చేరుకున్నాయనే సందేశాన్ని ట్రంప్ పర్యటన ఇవ్వగలిగింది.

ట్రంప్ పర్యటన సందర్భంగా రక్షణ, ఇంధన రంగాలలో భారీ ఒప్పందాలు కుదిరాయి. ఇస్లామిక్ ఉగ్రవాదంపై పోరుకు సహకరించుకోవాలనే అవగాహన కుదిరింది. వాణిజ్య చర్చలు ఇంకా సాగుతున్నాయి. ప్రధాని మోదీ చెప్పినట్టు– రెండు దేశాల సంబంధాలు ప్రపంచస్థాయి సమగ్ర భాగస్వామ్యం స్థాయికి చేరుకున్నాయి. అయితే ద్వైపాక్షిక సంబంధాలు ప్రభుత్వాలకు మాత్రమే పరిమితం కాదని, వాటిని ప్రజలే నడిపిస్తున్నారని కూడా ఆయన అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో భారత్‌కు సోవియెట్ యూనియన్‌తో సాన్నిహిత్యం ఎక్కువగా ఉండేది. సోవియెట్ యూనియన్ భద్రతా మండలిలో భారత్‌కు బాసటగా ఉండేది. అనేకరంగాలలో భారత్ పురోభివృద్ధికి సహకరించింది. రక్షణరంగంలో ప్రధాన భాగస్వామి. అయినా భారత ప్రజలకు మాత్రం అమెరికా సమాజంతోనే సంబంధాలు ఎక్కువ. స్వాతంత్ర్యోద్యమ కాలంలో భారత మేధోవర్గానికి బ్రిటన్‌తో సంబంధాలు బలంగా ఉండేవి. ఆ తర్వాత అమెరికా సమాజంతో అల్లుకుపోయారు. ఇప్పుడు కొత్త అంతర్జాతీయ వ్యవస్థలో భారత్ అమెరికాకు అతి సులభంగా దగ్గర కాగలిగిందీ అంటే అందుకు ఈ సామాజిక సంబంధాలే కారణం. సోవియెట్ యూనియన్‌తో ఈ సామాజిక సంబంధాలు లేనప్పటికీ, ప్రజలలో అదొక మిత్ర దేశమనే భావన పాతుకుపోయింది. కానీ ఇప్పుడు అమెరికా సమాజంతో ఇక్కడి ప్రజలకు సాన్నిహిత్యం ఉన్నప్పటికీ, అమెరికాను పూర్తిస్థాయి మిత్రదేశంగా చూసే పరిస్థితి లేదు. అమెరికా ఆధిపత్యశక్తి అనే భావనే ఎక్కువ. ఇందుకు ప్రచ్ఛన్న యుద్ధకాలపు పరిస్థితులు ఒక కారణమైతే, అమెరికా వ్యవహరిస్తున్న తీరు మరో కారణం. రెండూ ప్రజాస్వామ్య దేశాలు. రెండు సమాజాల మధ్య భావసారూప్యం కూడా ఉన్నది. అయినా ఈ అనుకూలతను ద్వైపాక్షిక సంబంధాల పటిష్ఠతకు అమెరికా ఉపయోగించుకోలేకపోతున్నది. రెండుదేశాల నాయకులు ఈ అంశంపై దృష్టిసారించినట్టు కనబడుతున్నది. కానీ అమెరికా వైఖరిలో చాలా మార్పు అవసరం.

> **అమెరికా విదేశాంగ విధానంలోనూ భారత్ ప్రాధాన్యం పెరిగిపోయింది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో వాణిజ్య మార్గాల రక్షణకు, చైనా ప్రభావాన్ని కట్టడి చేయడానికి భారత్‌తో మైత్రి అవసరమని అమెరికా భావిస్తున్నది. అయితే అమెరికా దీనిని భౌగోళిక రాజకీయ అవసరంగా మాత్రమే భావించకూడదు. ప్రజాస్వామ్య దేశంగా భారత్ సుస్థిరంగా ఉండటం అంతర్జాతీయ శాంతికి, అభివృద్ధికి దోహదపడుతుంది. అందువల్ల భారత్‌తో మైత్రిని వాణిజ్య, భద్రతా ప్రయోజనాల కోణంలోనే చూడకూడదు.**

భారత అమెరికా సంబంధాలు పటిష్ఠపడటం రెండు దేశాలకూ అవసరమే. పొరుగునే ఉన్న చైనా ప్రభావాన్ని కట్టడి చేయడానికి అమెరికాతో స్నేహం భారత్‌కు అవసరం. అభివృద్ధి చెందిన దేశంతో అనుబంధాన్ని అన్నిరంగాలకూ విస్తరించుకోవచ్చు. భారత విదేశాంగ విధానంలో వచ్చిన మౌలిక మార్పు మూలంగా అమెరికా ప్రాధాన్యం విస్మరించలేనిది. అమెరికా విదేశాంగ విధానంలోనూ భారత్ ప్రాధాన్యం పెరిగిపోయింది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో వాణిజ్య మార్గాల రక్షణ కు, చైనా ప్రభావాన్ని కట్టడి చేయడానికి భారత్‌తో మైత్రి అవసరమని అమెరికా భావిస్తున్నది. అయితే అమెరికా దీనిని భౌగోళిక రాజకీయ అవసరంగా మాత్రమే భావించకూడదు. ప్రజాస్వామ్య దేశంగా భారత్ సుస్థిరంగా ఉండటం అంతర్జాతీయ శాంతికి, అభివృద్ధికి దోహదపడుతుంది. అందువల్ల భారత్‌తో మైత్రిని వాణిజ్య, భద్రతా ప్రయోజనాల కోణంలోనే చూడకూడదు. అమెరికాకు ఉపగ్రహంగా ఉండకుండా భారత్ స్వతంత్రతను కోరుకుంటుంది. యూరేషియా తదితర ప్రాంతాల్లో భారత విధానాలను గౌరవించాలి. వాణిజ్యరంగంలోనూ భారత్ వాదనలు కాదనలేనివి. నాలుగో పారిశ్రామిక విప్లవంగా భావిస్తున్న డిజిటల్ ఆర్థికవ్యవస్థలో భారత్ తన స్థానాన్ని పదిలపరచుకోవాలనుకోవడంలో తప్పేమీ లేదు. వాణిజ్య సుంకాలు, డేటా స్థానికీకరణ వంటి వివాదాలలో భారత్‌పై ఒత్తిడి తేకూడదు. భారత్ వంటి పెద్ద దేశం తన మార్కెట్‌ను, సమాజాన్ని అమెరికా కంపెనీల ప్రయోజనాలకు వదిలిపెట్టదు. భారత్‌తో స్నేహాన్ని పటిష్ఠపరచుకోవాలని భావిస్తున్న అమెరికా కొంత ఉదారంగా వ్యవహరించడం తప్పనిసరి. అవసరమైతే ఒక మెట్టు దిగడానికి కూడా అది సిద్ధపడాలి.

**జనగళం**

### మైత్రి బంధం బలపడాలె

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పర్యటన ఘనంగా ముగిసింది. మొదటిరోజు పర్యటనలో భాగంగా అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి మోతెరా స్టేడియం వరకు 22 కిలోమీటర్ల దూరం రోడ్ షోలో ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. భారత సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సాంస్కృతిక ప్రదర్శనలతో స్వాగతం పలుకటం ప్రత్యేకతను సంతరించుకున్నది. ఆ తర్వాత మోతెరా స్టేడియంలో ట్రంప్, మోదీ ఇద్దరూ ఇరుదేశాల మైత్రిబంధం ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు. ప్రపంచ ఆర్థికగమనానికి, శాంతికి ఇరుదేశాల స్నేహసంబంధం ఎంతో మేలు చేస్తుందని ఇరువురూ పేర్కొన్నారు. ఆర్థికవ్యవస్థ, శాస్త్ర సాంకేతికరంగాల్లో అమెరికా అగ్రరాజ్యంగా ఎదురులేని శక్తిగా ఉన్నది. మరోవైపు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా శాంతియుత జీవనానికి, సహజీవనానికి ప్రతీకగా భారత్ ఉన్నది. ఈ రెండుదేశాలు అర్థవంతమైన స్నేహసంబంధాలతో ప్రపంచానికి శాంతిమార్గం చూపాలి. వాణిజ్య సంబంధాల్లో ఆధిపత్యాలకు చోటులేకుండా పరస్పర గౌరవపూర్వక, ప్రయోజనకర ఒప్పందాలతో ఇరు దేశాలూ ముందుకుపోవాలి. అప్పుడే అమెరికా, భారత్ మైత్రి ప్రపంచ గమనానికే మార్గదర్శకంగా ఉంటుంది. ఆ దిశగా ఇరుదేశాల దేశాధినేతలు విధాన నిర్ణయాలు తీసుకుంటారని ఆశిద్దాం.

**- ఏడు కొండలు, నల్లగొండ టౌన్**

### అవగాహన కల్పించాలె

ఒకవైపు కరోనా వైరస్ భయం ఉండగానే, స్వైన్‌ఫ్లూ ఈ మధ్యకాలంలో విజృంభిస్తున్న పరిస్థితి ఉన్నది. ఇటీవలనే ఓ మహిళ ఓ బిడ్డకు జన్మనిచ్చి ఆమె స్వైన్‌ఫ్లూ కారణంగా చనిపోవటం పట్ల సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. గత రెండు మూడు నెలలుగా తెలంగాణ వ్యాప్తంగా స్వైన్‌ఫ్లూ జ్వరాలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. వాటి నివారణ కోసం వేలకు వేలు వెచ్చించాల్సి వస్తున్నది. స్వైన్‌ఫ్లూ బాధితులను గుర్తిస్తే, అలాంటివారికి ప్రభుత్వ దవాఖానాల్లోనే వైద్యం అందించి రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. జలుబు, జ్వరం వచ్చినా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అలాగే స్వైన్‌ఫ్లూ రోగ లక్షణాలు, దాని నివారణ వైద్యం గురించి ప్రజల్లో చైతన్యం కలిగించాలి. ప్రభుత్వ దవాఖా నల్లో మంచి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

**- రాయపురం మనీష, బోయినపల్లి**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

పట్టణ ప్రగతి



**కింగ్ జాన్సన్ కొయ్యడ**

# పట్టణాభిషేకం

రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన పట్టణాలు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందితేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయి. ఈ విషయానికి గల ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టణ ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రజల విస్తృత భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. వాస్తవానికి, మన దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికీ ఇంత దూరదృష్టి లేదనే విషయాన్ని ఘంటాపథంగా చెప్పవచ్చు.

తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలవాలి. పల్లెలు, పట్టణ ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడాలి. ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా జీవనాన్ని కొనసాగించాలి. భవిష్యత్తులో తెలంగాణ పట్టణాలన్నీ వెలుగుజిలుగులతో నిండిపోవాలి. ఇలాంటి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి కేవలం ఆలోచనలుంటే సరిపోదు. అందుకు తగిన కార్యాచరణను సిద్ధం చేయాల్సిన అవసరం ఉన్నది. భవిష్యత్తులో పట్టణ తెలంగాణను అద్భుతంగా ఆవిష్కరించాలన్న ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టణప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అభివృద్ధికి నోచుకోక మురికి కూపాలుగా మారిన పట్టణాలకు శస్త్రచికిత్స చేయడానికి సంకల్పించారు. 'పల్లె ప్రగతి' కార్యక్రమంలో పల్లెలను మెరుగుపర్చినట్లే, పట్టణాలను సమీకృతంగా అభివృద్ధి చేసేందుకు నడుం బిగించారు. ప్రస్తుతం పట్టణాల్లో నెలకొన్న వాస్తవిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి, దేశంలోనే ఆధునిక పట్టణాలున్న ప్రాంతంగా తెలంగాణను ఆవిష్కరించాలన్న బృహత్ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను భాగస్వామ్యులను చేస్తున్నారు.

పట్టణ ప్రజల జీవితాలు కాంతులీనాలంటే ఏం చేయాలి? ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తే పట్టణ ప్రజలు ఆనందంగా జీవనాన్ని కొనసాగిస్తారు? ఇప్పటివరకూ ఏయే అంశాలు వీరికి అందుబాటులో లేకుండాపోయాయి? స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి పట్టణాల్లో నెలకొన్న దుర్భరమైన పరిస్థితులేమిటి? వాటిని ఎలా పరిష్కరించాలి? అనే అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేశాకే.. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పట్టణ ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో తెలంగాణ పట్టణాలకు పలు విశిష్టమైన లక్షణాలుండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావించినట్లు అర్థమవుతున్నది. ప్రతి పట్టణంలో పచ్చటి చెట్లు, పరిసరాలతో ఆహ్లాదకర వాతావరణం, తాగడానికి స్వచ్ఛమైన నీరు, మెరిసే రహదారులు, పటిష్ఠమైన డ్రైనేజీ వ్యవస్థ, నాణ్యమైన విద్యుత్తు సరఫరా విధానం, ప్రణాళికాబద్ధమైన పార్కింగ్ సదుపాయం.. ఇలాంటివన్నీ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉన్నది. ఈ క్రమంలో పట్టణాలు ప్రగతిపథం వైపు అడుగులు వేసేందుకు అవసరమయ్యే ప్రతి పనికి ఇందులో ప్రాధాన్యం ఇస్తారు. ఉదాహరణకు, ప్రస్తుతం మన పట్టణాలను గమనిస్తే.. వేలాడే విద్యుత్తు వైర్లు కనిపిస్తుంటాయి. వీటివల్ల ప్రజలు దుర్మరణం చెందుతున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. వీటికి పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా అడ్డుకట్ట వేసేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటారు. వంగిన స్తంభాలు, తుప్పుపట్టిన స్తంభాలు, రోడ్డు మధ్యలోని స్తంభాలు వంటివి మచ్చుకైనా కనిపించకుండా చేస్తారు. ఫుట్‌పాత్‌లపైన ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చివేస్తారు. మొత్తానికి, ప్రమాదరహిత విద్యుత్తు వ్యవస్థ అతిత్వరలో మన పట్టణాల్లో దర్శనమివ్వడం ఖాయమనిస్తున్నది. పట్టణాల్లో విద్యుత్తు సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఆధునిక పద్ధతులను అవలంబించబోతు న్నారు.

రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన పట్టణాలు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందితేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఈ విషయానికి గల ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టణ ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రజల విస్తృ త భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. వాస్తవానికి, మన దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇంత దూరదృష్టి లేదనే విషయాన్ని ఘంటాపథంగా చెప్పవచ్చు. తెలంగాణలో భవిష్యత్ తరా లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి అవరోధాల్లేకుండా నివసించాలనీ, వారి జీవితాలు బంగారుమయం కావాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యం. ఇందుకోసం పలు ముఖ్యమైన అంశాలపై దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు. ఈ బృహత్ కార్యక్రమంలో మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, కమిషనర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లంతా క్షేత్రస్థాయిలో అడుగుపెట్టి ప్రజలందరినీ భాగస్వాములను చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గజ్వేల్ పట్టణంలో పర్యటించి, అక్కడ జరిగిన క్రమబద్ధమైన అభివృద్ధిని కళ్లారా చూసి ఆశ్చర్యపోయారు.

ప్రతి పట్టణం ఎలా అభివృద్ధి చేయాలనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉన్నది. పట్టణప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి వార్డును యూనిట్‌గా తీసుకొని ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించారు. వార్డులవారీగా చేయాల్సిన పనులతో పాటు మొత్తం పట్టణంలో చేయాల్సిన పనులను గుర్తించి వాటిని అభివృద్ధి చేస్తారు. ప్రతి పట్టణంలో కేవలం అక్షరాస్యులనే కాకుండా నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో వార్డులవారీగా నాలుగు చొప్పున ప్రజాసంఘాలను ఏర్పాటుచేస్తారు. ఇవన్నీ ఏర్పాటు చేయడంతోనే ఆగిపోకుండా అందులో అభివృద్ధి జరుగాలంటే నిధులు అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ జీహెచ్ఎంసీకి నెలకు రూ.78 కోట్లు, ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రూ.79 కోట్ల చొప్పున నిధులను విడుదల చేయడానికి ఆదేశించారు. ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన నిధులను ఆయా పట్టణాలకు అందజేయాలని ఆదేశించడం గమనార్హం. అంటే, రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలకు నెలకు రూ.148 కోట్ల చొప్పున నిధులు సమకూరుతాయన్నమాట. ఫలితంగా, పట్టణ ప్రగతిలో భాగంగా చేపట్టే పనులకు నిధుల కొరత ఉండనే ఉండదు. ఇదొక్కటే కాకుండా, పద్నాలుగో ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన రూ.811 కోట్ల రూపాయల్లో 500 కోట్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీకి 311కోట్లను కేటాయిస్తారు. వీటితో పట్టణాల్లో పచ్చదనం, పారిశుద్ధ్య పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. పట్టణప్రగతిలో భాగంగా ఇంకా ఏమేం చేస్తారంటే.. డ్రైనేజీలు శుభ్రం చేస్తారు. మురికిగుంతలను పూడ్చేస్తారు. విరివిగా మొక్కలను నాటడానికి హరిత ప్రణాళికను రూపొందిస్తారు. వార్డుల్లో నర్సరీలను ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను ఎంపిక చేస్తారు. ఒకవేళ నగరాలు, పట్టణాల్లో భూములు అందుబాటులో లేకపోతే సమీప గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటుచేస్తారు. అక్కడా స్థలం లేకపోతే, చెరువులో ఉన్న గ్రామాల్లోనైనా ఏర్పాటుచేస్తారు.

కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య పనుల కోసం సుమారు 3,100 వాహనాలను సమకూర్చాలన్న నిర్ణయం ప్రభుత్వం తీసుకున్నది. వీటిలో ఇప్పటికే ఆరు వందల వాహనాలు పట్టణాల్లో రాగా, మిగతా 2500 వాహనాలను అతిత్వరలో పట్టణాలకు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇవి కాకుండా, పట్టణాలకు ఎన్ని వాహనాలు అవసరమో గుర్తించి, వాటిని అంచనా వేసి సమకూర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే మిషన్ భగీరథను చేపట్టింది.అధిక శాతం పట్టణాలకు స్వచ్ఛమైన తాగునీరు లభిస్తున్నది. ఇంకా, పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా అందాల్సి ఉండగా అక్కడి మంచినీటి సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠపరుస్తారు.

> ప్రతి పట్టణం ఎలా అభివృద్ధి చేయాలనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉన్నది. పట్టణప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి వార్డును యూనిట్‌గా తీసుకొని ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించారు. వార్డులవారీగా చేయాల్సిన పనులతో పాటు మొత్తం పట్టణంలో చేయాల్సిన పనులను గుర్తించి వాటిని అభివృద్ధి చేస్తారు. ప్రతి పట్టణంలో కేవలం అక్షరాస్యులనే కాకుండా నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తారు.

పట్టణాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల పరిస్థితిని మెరుగుపరుస్తారు. గుంతలను పూర్తిగా పూడ్చేస్తారు. పట్టణాల్లో దహన వాటికలు, ఖనన వాటికల ఏర్పాటుకు అవసరమయ్యే ఖాళీ స్థలాల్ని పట్టణ ప్రగతి కార్యక్రమంలో గుర్తిస్తారు. పొదలు, మురికి తుమ్మలుంటే శుభ్రపరుస్తారు. పట్టణ ప్రజలకు ఉపయోకరంగా ఉండేలా వెజ్/నాన్‌వెజ్ మార్కెట్లను నిర్మిస్తారు. క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేస్తారు. డంప్‌యార్డుల కోసం స్థలాలను గుర్తించడంతో పాటు పబ్లిక్ టాయిలెట్లు, మహిళల కోసం ప్రత్యేకంగా షీ టాయిలెట్లను నిర్మిస్తారు. ఇందుకోసం తగిన స్థలాలను గుర్తిస్తారు. అవసరమైతే ప్రభుత్వ స్థలాల్లోనే నిర్మిస్తారు. పట్టణాల్లో సర్వసాధారణమైన వీధి వ్యాపారులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలను తీసుకుంటారు. వీరికి ప్రత్యామ్నాయ స్థలం చూపించేవరకూ ఇబ్బంది పెట్టకూడదనే నిర్ణయం తీసుకోవటం గమనించదగినది. వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలపకుండా, ఒక క్రమపద్ధతిలో నిలిపి ఉంచటం కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను గుర్తిస్తారు. అవసరమైతే ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పార్కింగ్ కోసం కేటాయిస్తారు. ఈ విధంగా పట్టణాల్లో అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన పరిసరాలు అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నది. ఆ దిశగా రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలి.

**(వ్యాసకర్త: నమస్తే తెలంగాణ చీఫ్ రిపోర్టర్)**

# ఆంగ్ల మాధ్యమం అవసరమే

విశ్లేషణ



**డాక్టర్ కాలువ మల్లయ్య**

పాఠశాలస్థాయి విద్యాభ్యాసం మాతృభాషలో చేయడం వల్ల బోధించే విషయం పసివానికి సులభంగా అర్థమవుతుంది. వివిధ సబ్జెక్టుల్లో కాన్సెప్ట్ అర్థం కావడమే కాకుండా చదువుకోవాలనే అభిలాష పెరుగుతుంది. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. తమ భాషపై, జాతిపై ప్రేమ పెరుగుతుంది. స్థానికతను ప్రేమించే పౌరులుగా ఎదుగుతారు. కళాకారులు, రచయితలు, కవులుగా ఎదిగేవారు తమ మాతృభాషలో భావవ్యక్తీకరణ పెరిగి ఎదిగే అవకాశం ఉన్నది. మాట్లాడటమైనా, రాయడమైనా, ఉపన్యాసాలు ఇవ్వడం లాంటివైనా భావవ్యక్తీకరణ చేయడమైనా మాతృభాష ద్వారానే సమర్థవంతంగా చేయవచ్చు. ఇంట్లో మాట్లాడే భాష, ఇరుగుపొరుగు వారితో మాట్లాడే భాష, బడిలో చదువుకునే భాష ఒకటే కావడం వల్ల ప్రతి విషయమూ తేలికగా అర్థమై మానసిక వికాసం కలుగుతుంది. మహాత్మా గాంధీ లాంటివారు, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి నోబెల్ ప్రైజ్ విజేతలు, గురజాడ లాంటి గొప్ప రచయితలు కూడా మాతృభాషలోనే విద్యాబోధన, మాతృ భాషలోనే రచయితలు, కవులు రాయాలని బల్లగుద్ది మరీ చెప్పారు. పాఠశాల విద్య తెలుగు మాధ్యమంలో చదివి, కళాశాల విద్య ఇంగ్లిష్ మాధ్యమంలో చదవడం వల్ల అటు ఇంగ్లిష్, ఇటు తెలుగూ రెండూ బాగా వస్తాయన్న వాదమూ ఉన్నది.

ఇదంతా ఒకప్పటి మాట. సమాజం స్టాటిక్‌గా ఉన్నప్పటి మాట. ఎక్కడివాళ్లక్కడే ఉండి సమాజంలో చలనశీలత తక్కువగా ఉన్నప్పటి మాట. ఇతర భాషల గురించి, ప్రపంచం గురించి అంతగా పరిచయం లేని సమయంలోని మాట. ఇదివరకట్లా ఇప్పుడున్న తల్లిదండ్రులు పూర్తి నిరక్షరాస్యులు కారు. నిరక్షరాస్య తల్లిదండ్రులైనా ఒక్క తెలుగు (మాతృభాష) మాత్రమే మాట్లాడటం లేదు. కారణలేవైనా ఇంగ్లీషు ప్రపంచ భాషయింది. ప్రపంచీకరణ ప్రవేశం తర్వాత ఈ ధోరణి మరీ ఎక్కువైంది. ప్రపంచం ఓ కుగ్రామం అయిందనడం సరైంది కాదు కానీ, ఇంగ్లిష్ ద్వారా ప్రపంచమంతా పరిచయం అవుతుంది. దేశవిదేశాలను కలుపుతుంది. గర్భస్థ శిశువు కూడా మహాభారతంలో అభిమన్యుడిలా మీడియా ద్వారా తల్లిదండ్రుల ద్వారా ఇంగ్లిష్ పదాలను నేర్చుకుంటున్నాడు. ఇంకా అనేక కారణాల వల్ల ఇంగ్లిష్ చదువడం, నేర్చుకోవడం, తప్పనిసరైంది. రాష్ట్రం నుంచి దేశం, ప్రపంచదేశాల్లో ఎక్కడైనా బతుకాలంటే మాతృభాష సరిపోదు. ఇంగ్లిష్ వచ్చితీరాలి. ఇవన్నీ కావాలంటే ఒక్క భాషగా ఇంగ్లిష్ చదువుకుంటే సరిపోదు. పదవ తరగతి వరకు చదువుకున్నవాళ్లు కూడా బయటకెళ్లి బతుకాలంటే చదువుకున్న ఒక సబ్జెక్టుగా ఇంగ్లిష్ సరిపోదు. మారిన పరిస్థితుల్లో, ప్రపంచీకరణ యుగంలో అన్నిట్లా ఇంగ్లిష్ అవసరం పెరిగింది.

తెలుగు మాధ్యమంలో చదువుకున్న అతి కొద్దిమంది తప్ప ఉన్నత స్థానాల్లోకెళ్లడానికి, ప్రపంచంతో పోటీ పడటానికి ఇంగ్లిష్ మాధ్యమం అనివార్యమవుతున్నది. మాతృభాష మాధ్యమమే మేలన్న గాంధీ ఇంగ్లిష్‌లోనే విదేశాల్లో బారిస్టర్ చదివాడు. ఇంగ్లీషువారిని ఎదిరించడానికి ఆ భాషే ఉపయోగపడింది. రవీంద్రనాథ్ ఠాకూర్ విశ్వకవి, నోబెల్ విజేత అవడానికి ఇంగ్లిష్ చదువే కారణం. శంభుచంద్ర ముఖర్జీ మాటలు విని గురజాడ తెలుగులో రాసినా ఇంగ్లిష్ బాగా వచ్చినవాడే. ఇంగ్లిష్ భాషాజ్ఞానంతోనే సంస్కరణవాదాన్ని అర్థం చేసుకోగలిగాడు, సొంతం చేసుకోగలిగాడు. తెలుగులోనూ, ఇంగ్లిష్‌లోనూ రాయగలిగాడు. గురజాడ తెలుగుతో పాటు ఇంగ్లిష్‌లోనూ రాయడం కొనసాగించి ఉంటే నోబెల్ విజేత అయ్యుండేవాడు. ప్రాంతీయభాషల్లో అద్భుతమైన రచనలు వస్తున్నా ఇంగ్లిష్‌లోకి పోకపోవడం వల్ల వాటికి న్యాయం జరుగడం లేదు. ఆయా రచయితలకు ఇంగ్లిష్ వచ్చినా సృజనాత్మక సాహిత్యాన్ని ఇంగ్లిష్‌లో రాయగలిగే నిపుణత రాదు. సాటనిక్ వర్సెస్ రచయిత, లజ్జ రచయిత్రి , అరుంధతీరాయ్ ఇంగ్లిష్ మీడియంలో చదువడం వల్లనే ఇంగ్లిష్‌లో రాసి అంతర్జాతీయ ఖ్యాతి పొందగలిగారు.

చిన్నస్థాయి నుంచి, పెద్దస్థాయి వరకు ప్రపంచంలో ఎక్కడైనా బతుకడానికి ఇంగ్లిష్ అవసరం. అది ఒక్క సబ్జెక్టుగా చదివితే రాదు. మీడియం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్‌గా చదివితేనే సాధ్యమవుతుంది. తెలుగు (మాతృభాష) రావడానికి అన్నీ సబ్జెక్టులు తెలుగులో ఉండాల్సిన అవసరం లేదు. ఇంగ్లిష్ అర్థం కాదన్న ప్రశ్న లేదు. ఎందుకంటే పసిపిల్లల వయసు నుంచే ఇంగ్లిష్ నేర్పిస్తున్నాం కాబట్టి, ఇంగ్లిష్ భాషలో నైపుణ్యం పెరుగుతుంది.

గత ఇరువై ఏండ్ల నుంచి ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థులు మాతృభాషకు దూరమయ్యారన్న మాటలో పాక్షిక సత్యముంది. ఇందుక్కారణం అనేక ఇంగ్లిష్ మాధ్యమ పాఠశాలల్లో ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల్లో మాతృభాష ఒక్క సబ్జెక్టుగానూ లేకపోవడం ఉన్నత పాఠశాలల్లోనూ మాతృభాషను పూర్తిస్థాయిలో బోధించడానికి ఏ మాత్రం ఆసక్తి చూపకపోవడం అసలు కారణం. మాతృభాషను మొక్కుబడిగా మాత్రమే చదువడం అతి తక్కువ ప్రాధాన్యం ఇవ్వడం, ఇండ్లలోనూ తల్లిదండ్రులు పిల్లల తెలుగు చదువు గురించి పట్టించుకోకపోవడం, ఇంటర్ స్థాయిలోనైతే తెలుగు అసలే లేకపోవడం పెద్ద విషాదం.

ప్రభుత్వరంగంలో ఇంగ్లిష్ మీడియం పెట్టడం వల్ల మాతృభాషలు అంతరించిపోతాయనడం సరైంది కాదు. వేల ఏండ్లుగా సంస్కృతం రాజభాష గా కొందరికే పరిమితమైన చదువుల భాషగా ఉన్నపుడు మాతృభాషలు నశించిపోయాయా? ముస్లిం రాజులు ఉర్దూ మీడియం చేసినపుడు 800 ఏండ్లు ఈ దేశాన్ని పాలించినా దేశంలోని మాతృభాషలు చావలేదు కదా? బ్రిటిష్‌వారు రాజభాషగా, బోధనా భాషగా ఇంగ్లిష్‌ను పెట్టి 200 ఏండ్లు పాలించినా తెలుగు మాయమైపోలేదు కదా! ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం పెడితే పోతుం దా? కోట్లాదిమంది తెలుగువారు నిత్య వ్యవహారాల్లో మాతృభాష మాట్లా డుతుంటే తెలుగెలా పోతుంది? పోగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడి యం పెట్టి ఒక్క సబ్జెక్టుగా తెలుగును పూర్తిస్థాయిలో చదివింపజేయడంవల్ల చదువుల్లో తెలుగు బతుకుతుంది. కేజీ నుంచి పీజీ వరకు ప్రొఫెషన ల్ కోర్సులైనా సరే ఉంచడం వల్ల మాతృభాషలు బతుకుతాయి. శాశ్వతం గా బతుకుతాయి. తెలుగు సమాజంలో పనిచేసే ఉద్యోగులు ఎవరైనా సరే ఆ రాష్ట్ర భాషను నేర్చుకోవాలన్న విషయాన్ని కచ్చితంగా అమలుచేస్తే పాలన ప్రజలకు చేరుతుంది. మాతృభాషలూ బతుకుతాయి.

> ఏ భాషయినా ఎప్పుడు మృతభాషవుతుంది? చదువుల నుంచి దూరమై అధికార భాషగానూ ప్రభుత్వం నుంచి దూరమైనప్పుడు. ఈ రెండింటి నుంచి దూరమైనా ప్రజల వాడుకలో బతికిన అనేక భాషలున్నాయి. కానీ, అధికార భాష నుంచి, చదువుల నుంచి, ఉపాధినిచ్చే స్థాయి నుంచి దూరమైన భాష క్రమక్రమంగా జనం వాడుకలోంచి దూరమై మృతభాషవుతుంది. అందువల్ల మాతృభాషను ఆయా రాష్ట్రాల్లో చదువుల్లోనూ, పాలనారంగంలోనూ బతికుండేటట్టు చూడాలి.

ఏ భాషయినా ఎప్పుడు మృతభాషవుతుంది? చదువుల నుంచి దూరమై అధికార భాషగానూ ప్రభుత్వం నుంచి దూరమైనప్పుడు, ఈ రెండింటి నుంచి దూరమైనా ప్రజల వాడుకలో బతికిన అనేక భాషలున్నాయి. కానీ, అధికార భాష నుంచి, చదువుల నుంచి, ఉపాధినిచ్చే స్థాయి నుంచి దూరమైన భాష క్రమక్రమంగా జనం వాడుకలోంచి దూరమై మృతభాషవుతుంది. అందువల్ల మాతృభాషను ఆయా రాష్ట్రాల్లో చదువుల్లోనూ, పాలనారంగంలోనూ బతికుండేటట్టు చూడాలి. మాధ్యమ భాషగా ఇంగ్లిష్‌ను పెట్టి ఒక్క సబ్జెక్ట్‌గా మాతృభాషలను అన్ని స్థాయిల్లోనూ పూర్తిస్థాయిలో చదివేటట్టు చేయాలి. తద్వారా మాతృభాషలు బతుకుతాయి. నేటి ప్రాపంచిక అవసరాలకు సరిపోయేట్టు, మెజారిటీ తెలుగు ప్రజలు కూడా కోరుకున్నట్టు అందరికీ ఇంగ్లిష్ మాధ్యమ చదువులు ఇవ్వడం న్యాయమే. అందుకే మాతృభాషలు వికసించాలి, ఇంగ్లిష్ మాధ్యమం కావాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.




సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో పట్టణ ప్రగతిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే చింతా

## త్వరలో మళ్లీ వస్తా: మంత్రి హరీశ్‌రావు

**'నాయకులు** ఎన్నికలప్పుడు ఓట్లు అడగడానికి వస్తారు.. కానీ, మేము ఓట్లు అయిపోయినంకా సేవ చేద్దామని మీ ముందుకు వచ్చాం.. పట్టణాలను మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ 'పట్టణ ప్రగతి'ని ప్రారంభించారు.. సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలి.. రెండు నెలల తర్వాత మళ్లీ వార్డుల్లో పర్యటిస్తా'నని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని 15వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ జయమ్మ, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి పట్టణ ప్రగతిలో మంత్రి పాల్గొన్నారు. ఇందులోభాగంగా వార్డుల్లో నడుస్తూ సమస్యలు తెలుసుకున్నారు. 65వ నంబరు జాతీయ రహదారి పక్కన ఖాళీ స్థలాన్ని పరిశీలించి శుభ్రం చేసుకోవాలని భూయజమానికి సూచించారు. ఇండ్ల ముందు నీటిగుంతలు పూడ్చుకోవాలని మహిళలను కోరారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కొత్త మున్సిపల్ చట్టంపై పట్టణవాసులకు అవగాహన కల్పించారు. సదాశివపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.



వరంగల్ అర్బన్ జిల్లా పడమర కోటలో పర్యటిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే నరేందర్, టీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు గుండు సుధారాణి



కరీంనగర్ 40వ డివిజన్‌లోని ఖాళీ స్థలంలో చెత్తను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

# పట్నం మురిసేలా..

రెండోరోజూ ఉత్సాహంగా 'పట్టణ ప్రగతి'.. వార్డుల్లో తిరుగుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

స్వచ్ఛందంగా శ్రమదానాలు .. పరిశుభ్రంగా రోడ్లు, మురుగుకాల్వలు

పలు జిల్లాల్లో పర్యటించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** పట్టణాలు మురిసేలా పట్టణ ప్రగతి పనులు కొనసాగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో 'ప్రగతి' పనులు జోరుగాసాగాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో కలిసి వార్డుల్లో తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు స్వచ్ఛందగా శ్రమదాన కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, మురుగు కాల్వలను పరిశుభ్రం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించారు. ఆయా జిల్లాల్లో మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, చామకూర మల్లారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్ వార్డుల్లో పర్యటించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

### ఖిల్లాను అభివృద్ధి చేస్తాం:ఎర్రబెల్లి

చారిత్రక నేపథ్యం కలిగిన ఖిలావరంగల్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పంచాయతీరాజ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం పట్టణ ప్రగతిలో భాగంగా వరంగల్ అర్బన్ జిల్లా ఖిలావరంగల్‌లో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, టీఆర్ఎస్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు గుండు సుధారాణి, గ్రేటర్ కమిషనర్ పమేలా సత్పతితో కలిసి మంత్రులు పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత వరంగల్ మహానగరంపైనే ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టి సారించారని పేర్కొన్నారు. కాకతీయుల చరిత్రను, పరిపాలన దక్షతను విశ్వవ్యాప్తం చేసేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను ఈ కోటకు తీసుకొస్తామన్నారు. పర్యాటక అభివృద్ధితోనే ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

### మనమే శుభ్రం చేసుకోవాలి: గంగుల

చుట్టూ ఉన్న ప్రాంతాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న ఆలోచన ప్రజల్లో రావాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా మంగళవారం కరీంనగర్‌లోని 17, 40వ డివిజన్లలో మంత్రి పర్యటించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని కోరారు. కాలనీల్లో కలియతిరుగుతూ సమస్యలను గుర్తించిన మంత్రి.. అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఏండ్లతరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డుకమిటీ సభ్యులు ప్రజలతో కలిసి డివిజన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు.

### మురుగు కాల్వలో చెత్త.. రూ.వెయ్యి జరిమానా

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని 27 వార్డు పరిధిలోని ఓ మురుగు కాల్వలో ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ డబ్బాలు, ఇతర వ్యర్థాలను వేసిన ఓ ప్రైవేటు క్లినిక్ యాజమాన్యానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక రూ.వెయ్యి జరిమానా విధించారు. రోడ్లపై చెత్త వేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

### రూపురేఖలు మార్చేందుకే..: మల్లారెడ్డి

పట్టణాల రూపురేఖలను మార్చేందుకే ప్రభుత్వం 'పట్టణ ప్రగతి'కి శ్రీకారం చుట్టిందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీలో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లుతో కలిసి పట్టణ ప్రగతి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. తూంకుంట పరిధిలోని దేవరయాంజాల్, హకీంపేట, సింగాయిపల్లిలో రూ.1.53 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలు పట్టణ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలే స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో మొ క్కలను నాటాలని, వాటిని సంరక్షించాలన్నా రు. వెనుకబడ్డ ప్రాంతాలు, కాలనీల్లో డం పింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పార్కు లు, మార్కెట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

### 'విజన్' ఉన్న నేత కేసీఆర్: సబితారెడ్డి

విజన్ ఉన్న నాయకుడు సీఎం కేసీఆర్ అని, వినూత్న పథకాలకు రూపకల్పన చేసి తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపారని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో నిర్వహించిన 'పట్టణప్రగతి'లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. పలు వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.47 వేల కోట్లను సంక్షేమరంగానికి ఖర్చు చేస్తున్నదన్నారు. 'పట్టణ ప్రగతి'ని దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. పట్టణాల్లో 75 గజాల స్థలంలో ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు అవసరం లేదన్నారు.



రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో చెత్తసేకరణ ట్రాలీ ఆటోను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి . చిత్రంలో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

# బస్టాండ్‌లో భారీ చోరీ

జనగామలో మహిళ చేతిలో నుంచి హ్యాండ్‌బ్యాగ్ తస్కరణ

19 తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్టు బాధితురాలి వెల్లడి

**జనగామ, నమస్తేతెలంగాణ:** జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం భారీచోరీ జరిగింది. ఓ మహిళా ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించారు. అందులో 19 తులాలకుపైగా బంగారు ఆభరణాలున్నాయని బాధితురాలు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. జనగామకు చెందిన మాడిశెట్టి వివేకానంద్ తన భార్య, తల్లి, చెల్లితో కలిసి హైదరాబాద్‌కు పెండ్లికి బయలుదేరారు. మంగళవారం జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కిన వీరు కొద్దిదూరం వెళ్లాక తన భార్య చేతిలోని హ్యాండ్‌బ్యాగ్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురై మధ్యలోనే బస్సు దిగిపోయారు. తిరిగి జనగామకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు హ్యాండ్ బ్యాగ్‌ను అపహరించారని, అందులో 19.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.1,500 నగదు ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెస్ట్ జోన్ (జనగామ) డీసీపీ శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఏసీపీ వినోద్‌కుమార్, అర్బన్ సీఐ మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. బస్టాండ్‌లో విచారణ జరిపి.. చౌరస్తాలోని పోలీసు కంట్రోల్ రూంలో సీసీ ఫుటేజీని పరిశీలించారు. బస్టాండ్‌లో పింక్ కలర్ చీరె ధరించిన ఓ మహిళ అనుమానాస్పదంగా తిరిగినట్టు గుర్తించిన పోలీసులు ఆమె ఫొటోను మీడియాకు విడుదల చేశారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా సదరు మహిళ ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



పోలీసులు విడుదల చేసిన అనుమానితురాలి చిత్రం (పింక్ కలర్ చీరెలో)

# ఉప్పొంగిన గోదారమ్మ

- కాళేశ్వరం లింక్-1, 2లో నడుస్తున్న మోటర్లు
- ఎస్సారార్‌లో 25.22 టీఎంసీల నీరు నిల్వ

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** 'కాళేశ్వరగంగ మురిసిపోతున్నది. చుక్కచుక్కనూ ఒడిసిపట్టి ఎగువకు ఎత్తిపోస్తుండటంతో దిగ్విజయంగా పరవళ్లు తొక్కుతున్నది. భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌజ్‌లో ఎత్తిపోతలు కొనసాగుతుండగా, పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేటలోని సరస్వతి పంప్‌హౌజ్‌లో 1, 2, 3, 5, 7వ మోటర్లు నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ 2,900 క్యూసెక్కుల చొప్పున మొత్తం 14,500 క్యూసెక్కుల నీరు మంథని మండలం సిరిపురంలోని పార్వతి బరాజ్‌లోకి చేరుతున్నది. పార్వతి బరాజ్‌లోకి చేరుతున్న నీటిని అంతర్గాం మండలం గోలివాడలోని పార్వతి పంప్‌హౌజ్ ద్వారా ఎగువన ఎల్లంపల్లి బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఇక్కడ 1, 3, 4, 5, 6, 7వ మోటర్లు నడిపిస్తుండగా, 15,660 క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి బరాజ్‌లోకి చేరుతున్నది. ఇక లింక్-2లో భాగంగా ధర్మారం మండలం నంది మేడారంలోని నందిపంప్‌హౌజ్‌లో 3, 4వ మోటర్లు నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 6,300 క్యూసెక్కులు నంది రిజర్వాయర్‌లోకి తరలుతున్నది. ఇక్కడి నుంచి 8వ ప్యాకేజీ కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్‌కు చేరుతున్నాయి. ఇక్కడా 2, 3వ పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు.గాయత్రి పంప్‌హౌజ్‌లో మంగళవారం సాయంత్రానికి 9.579 టీఎంసీల జలాలను ఎత్తిపోసినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎత్తిపోతల ప్రక్రియను ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వేంకటేశ్వర్లు, ఈఈ నూనె శ్రీధర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్ డెలివరీ సిస్టర్నుల నుంచి వస్తున్న గోదావరి జలాలు

### ఎస్సారార్ నుంచి దిగువకు..

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎల్‌ఎండీకి మంగళవారం 4,555 క్యూసెక్కుల నీటిని పంపించారు. ఎస్సారార్ జలాశయం రివర్స్ స్లూయిస్ ద్వారా దిగువకు నీటిని పంపుతున్నారు. ఎస్సారార్‌లో 25.22 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. లక్ష్మీపూర్ పంప్‌హౌజ్ నుంచి మంగళవారం 8,806 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చినట్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

### ఎల్‌ఎండీలో 10.926 టీఎంసీలు

ఎస్సారార్ జలాశయం స్లూయిస్ నుంచి ఎల్‌ఎండీకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రస్తుతం ఎల్‌ఎండీలోకి మంగళవారం 5,472 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో రాగా, 5,773 క్యూసెక్కుల నీరు బయటికి వెళ్లింది. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 10.926 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## స్కూల్ బస్సు ఢీకొని అన్నదమ్ములు మృతి

**జహీరాబాద్, నమస్తే తెలంగాణ:** పండ్ల కోసం వెళ్లిన ఇద్దరు సోదరులను స్కూల్ బస్సు ఢీకొనడంతో మృతిచెందారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జహీరాబాద్‌లోని హమాలీకాలనీలో నివాసం ఉంటున్న అంబాజీకి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. మంగళవారం అంబాజీ తన ఇద్దరు కొడుకులను పండ్ల కోసం మార్కెట్‌కు పంపించారు. లూనాపై వెళ్లిన వారు పండ్లు తీసుకొని తిరిగి వస్తుండగా.. రాంనగర్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో తుల్జారాం(14), కృష్ణాజీ(10)కి తీవ్రగాయాలు కాగా జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందారు. తుల్జారాం జహీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి, కృష్ణాజీ ఐదో తరగతి చదువుతున్నారు.

## కట్టుకున్నోడినే కడతేర్చింది

వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం

**హవేళిఘనపూర్:** వివాహేతర బంధానికి అడ్డుపడుతున్నాడని ఓ వివాహిత కట్టుకున్న భర్తనే కడతేర్చిన దారుణ ఘటన మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మండలం శమ్నాపూర్‌లో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. శమ్నాపూర్‌కు చెందిన సగపాల్ల మల్లయ్య(40), లక్ష్మి దంపతులు. బతుకుదెరువు కోసం మూడేండ్లపాటు దుబాయ్‌లో ఉన్న మల్లయ్య గతేడాది గ్రామానికి వచ్చాడు. లక్ష్మి కొంతకాలంగా మరో వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న విషయం మల్లయ్యకు తెలియడంతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి కూడా ఇద్దరికీ గొడవ జరిగింది. వివాహేతర సంబంధానికి అడ్డు చెబుతున్నాడనే అక్కసుతో భర్తను హత్య చేయాలని నిర్ణయించుకొన్న లక్ష్మి.. భర్త మెడపట్టి వెనక్కిలాగి గొంతు నులిమేయడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. తన భర్త రాత్రి గొడవకుదిగి దాడిచేశాడని ఇరుగుపొరుగువారికి చెప్పి లక్ష్మి తప్పించుకొనే ప్రయత్నంచేయగా, అప్పటికే మల్లయ్య మృతి చెందిన విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకొని లక్ష్మిని విచారించగా భర్తను తానే హత్య చేసినట్టు అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసులో లక్ష్మితోపాటు మరెవరైనా పాల్గొన్నారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏడుగురికి జీవిత ఖైదు

**నల్లగొండసిటీ:** నల్లగొండ జిల్లా కనగల్ మండలం కురంపల్లిలో మూడేండ్ల క్రితం జరిగిన జంటహత్యల కేసులో ఏడుగురికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి ఎంవీ రమేశ్‌బాబు మంగళవారం తీర్పు చెప్పారు. కురంపల్లి శివారులో దోటి మణెమ్మకు చెందిన 2.25 ఎకరాల భూమిని దాసరి యాదయ్య కొనుగోలు చేశాడు. మణెమ్మ తన భర్త అక్కలయ్యతో విడిపోయి వేరుగా ఉంటుండటంతో అతడిని సంప్రదించకుండానే భూమిని విక్రయించింది. కాగా, అక్కలయ్యకు బంధువైన దోటి పాండరయ్య ఆ పొలాన్ని స్వాధీనం చేసుకోవాలని కుట్రపన్ని తన కుమారులు ఐలయ్య, మల్లేశ్‌తో పాటు అక్కలయ్య కుమారుడు వెంకటేశం, అతడి కుమారులు సైదులు, కిరణ్, భరత్‌లతో కలిసి యాదయ్య కుమారులైన ఆంజనేయులు, అన్నమయ్యలపై 2017 ఆగస్టు 21న కర్రలు, గొడ్డళ్లతో దాడిచేసి నరికి చంపారు. నేరం రుజువుకావడంతో దోషులకు జీవిత ఖైదుతోపాటు రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

# మావోయిస్టుల డంప్ స్వాధీనం

**కొత్తగూడెం క్రైం/చర్ల రూరల్:** ఆపరేషన్ ప్రహార్‌లో భాగంగా దండకారణ్యంలో గాలింపు చేస్తున్న భద్రతా బలగాలు మావోయిస్టుల డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కొండగావ్ జిల్లాలో పోలీస్, ఐటీబీపీ భద్రత బలగాలు సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ప్రహార్'లో భాగంగా మర్దపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదాపాల్ అటవీ ప్రాంతంలో భూమిలో పాతిపెట్టిన డంప్‌ను గుర్తించిన జవాన్లు దాన్ని వెలికితీశారు. అందులో పేలుడు పదార్థాలు, పౌచ్‌లు, మందుపాతరలు అమర్చే టిఫిన్‌బాక్స్‌లు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రి లభించింది.

**డీఆర్‌జీ కానిస్టేబుల్‌కు గాయాలు**

దంతెవాడ-బీజాపూర్ జిల్లాల పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మంగళవారం ఐఈడీ పేలుడులో ఓ డీఆర్‌జీ కానిస్టేబుల్ తీవ్రంగా, ఇద్దరు జవాన్లకు స్వల్పంగా గాయపడ్డారు. ముగ్గురిని హెలికాప్టర్‌లో హుటాహుటిన రాయపూర్ దవాఖానకు తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడుచోట్ల మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగినట్టు సమాచారం. గ్యాంగ్‌లూర్-కిరాండల్ సరిహద్దు ప్రాంతాల్లో రెండు రోజులుగా పోలీసులు గాలిస్తుండగా పేలుడు జరిగిందని దంతెవాడ ఎస్పీ అభిషేక్ పల్లవ్ తెలిపారు.

**వ్యక్తిని హతమార్చిన మావోయిస్టులు**

ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా జోదంబ గ్రామానికి చెందిన దీనబంధు బేపారి అనే యువకుడిని ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్యచేశారు.



డంప్‌లో లభించిన పౌచ్‌లు, మందుపాతరలు అమర్చే టిఫిన్‌బాక్స్‌లు, విప్లవ సాహిత్యం (ఇన్‌సెట్‌లో) భూమిలో పాతిపెట్టిన డంప్

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

వెలిమెలలోని ఓ ప్రైవేట్ కళాశాల హాస్టల్‌లో ఘటన

**పటాన్‌చెరు, నమస్తేతెలంగాణ:** ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమెలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చోటుచేసుకున్నది. బీడీఎల్ భానూర్ పోలీసుల కథనం ప్రకారం.. వెలిమెలలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సంధ్యారాణి(16) మంగళవారం మధ్యాహ్నం హాస్టల్‌లోని బాత్‌రూంలో దుస్తులను ఆరవేసే తాడుతో ఉరివేసుకున్నది. తోటి విద్యార్థినులు గమనించి యాజమాన్యానికి తెలుపడంతో వారు హుటాహుటిన రంగారెడ్డి జిల్లా నలగండ్లలోని ఓ దవాఖానకు తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండకు చెందిన మాజీ సైనికోద్యోగి చంద్రశేఖర్, పద్మ దంపతుల పెద్దకుమార్తె సంధ్యారాణిని ఈ ఏడాదే వెలిమెలలోని ఓ ప్రైవేటు కళాశాలలో చేర్పించారు. కాలేజీ హాస్టల్‌లో ఉంటున్న సంధ్యారాణి వారం రోజులుగా తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుతున్నది. తనకు జ్వరం వచ్చిందని, శనివారం రావాలని కోరింది. ఆ తర్వాత జ్వరం తగ్గుతున్నదని, వచ్చినా నన్ను ఇంటికి తీసుకెళ్లనివ్వరని ఆమె ఫోన్లో చెప్పడంతో తల్లిదండ్రులు శనివారం వెళ్లలేదు. ఈ క్రమంలో ఆమె ఆత్మహత్య చేసుకోవడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. యాజమాన్యం తమ కూతురికి అనారోగ్యంగా ఉన్నా చికిత్సచేయించలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదుచేశారు.



సంధ్యారాణి (ఫైల్)



ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకుడు క్రిష్ గోపాలకృష్ణన్‌తో రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్‌రంజన్

# పెట్టుబడులతో రండి

## భారతీయ పారిశ్రామికవేత్తలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** అమెరికాలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతీయ వ్యాపార, పారిశ్రామికవేత్తలను ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ కోరారు. తమ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి విదేశీ పెట్టుబడుల కోసం చూస్తున్నామన్న ఆయన వ్యాపారానికి అనువైన పరిస్థితులను నెలకొల్పుతామని, అడ్డంకులను తొలగించి.. నిబంధనలను మరింత సరళతరం చేస్తామని హామీ ఇచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు విచ్చేసిన అగ్రరాజ్య అధిపతి డొనాల్డ్ ట్రంప్.. మంగళవారం ఇక్కడ దేశీయ పరిశ్రమ దిగ్గజాలతో సమావేశమయ్యారు. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, ఆదిత్యా బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మీ అందరికీ నా కృతజ్ఞతలు. మీ విజయాలకు నా శుభాకాంక్షలు. మీరు అమెరికాకు వచ్చి మరిన్ని బిలియన్ల పెట్టుబడులు పెడుతారని ఆశిస్తున్నా. మీ పెట్టుబడులు నా దృష్టిలో ఉద్యోగాలు' అన్నారు. ఈ క్రమంలోనే అమెరికాలో వ్యాపార నిర్వహణకు ఎన్నో రెగ్యులేటరీ సవాళ్లు, ముఖ్యంగా పాలనా, చట్టపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఆందోళనలపై ట్రంప్ స్పందిస్తూ వాటన్నిటిని తొలగిస్తామని, తేడాను మీరే గమనిస్తారన్నారు. ఇరు దేశాల సంస్థలు పరస్పరం ఒకరి దేశంలో మరొకరు పెట్టుబడులు పెట్టుకోవాలని పిలుపునిచ్చిన ఆయన ఉద్యోగాల సృష్టికి ప్రభుత్వాలు కేవలం సహాయం చేస్తాయని, నిజానికి ఉద్యోగాలను కల్పించేది ప్రైవేట్ పరిశ్రమలేనని చెప్పారు. తాను భారత్‌లో, మోదీ అమెరికాలో ఉద్యోగాలను సృష్టిస్తున్నామన్న ఆయన మోదీతో చాలా దగ్గరగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మోదీ పనితీరు భేష్ అని కితాబిచ్చారు. ఇక భారత్‌లో అమెరికా పెట్టుబడులు, వ్యాపారంపై దేశీయ పరిశ్రమ ట్రంప్‌ను కొనియాడింది.

**నిబంధనల్ని మరింత సడలిస్తామని హామీ**



భారత సీఈవోలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్. చిత్రంలో ఆర్‌ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ, మహీంద్రా చైర్మన్ ఆనంద్ మహీంద్రా, ఆదిత్యా బిర్లా గ్రూపు చీఫ్ కుమార మంగళం బిర్లా తదితరులు

### వాణిజ్య ఒప్పందం ఉంది కానీ..

భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఉందన్న ట్రంప్.. దానికి సంబంధించిన వివరాలను మాత్రం తెలియజేయలేదు. నిజానికి ఈ పర్యటనకు ముందు నుంచే వాణిజ్య ఒప్పందంపై స్పష్టత ఇవ్వని ట్రంప్.. చివరిదాకా అదే తీరును కనబరిచారు. ఇరు దేశాలు ఓ అద్భుతమైన వాణిజ్య ఒప్పందానికి కృషి చేస్తున్నాయన్న ఆయన ఈ డీల్ రెండు దేశాలకు ఎంతో ప్రతిష్ఠాత్మకం, కీలకమని పేర్కొన్నారు. ట్రంప్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మధ్య చర్చల తర్వాత కూడా ఈ వాణిజ్య ఒప్పందంపై ఎటువంటి ప్రకటన లేకపోవడం గమనార్హం. మరోవైపు అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాతే ఈ డీల్‌కు లైన్ క్లియరవుతుందన్న అంచనాలు వినిపిస్తుండగా, ఈ ఏడాది ఆఖరుదాకా ఆగాల్సిందేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### నేను ఓడితే.. మార్కెట్ మటాషే



**రాబోయే** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తాను ఓడిపోతే స్టాక్ మార్కెట్లు భారీగా పడిపోతాయని ట్రంప్ అన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా స్టాక్ మార్కెట్లు నష్టాలను చవిచూస్తాయని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగనుండగా, మళ్లీ తనదే అధికారమన్న ధీమాను ట్రంప్ వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తాను గెలిస్తే మార్కెట్లకు పండగేనని.. ఓడిపోతే మాత్రం దండగేనన్నారు. తమ ప్రభుత్వం అమెరికా ఆర్థిక, ఆరోగ్య, సైనిక రంగాల కోసం ఎంతో చేసిందని చెప్పుకొచ్చారు. ఇదిలావుంటే కరోనా వైరస్‌పై స్పందిస్తూ పరిస్థితులను గమనిస్తున్నామని, చైనాతో మాట్లాడుతున్నామని చెప్పారు. వైరస్‌ను మట్టుబెట్టేందుకు అమెరికా సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని, దాదాపు 2.5 బిలియన్ డాలర్లను వెచ్చిస్తున్నామన్నారు. వైరస్ అంతానికి చైనా చాలాచాలా శ్రమిస్తున్నదని చెప్పారు. చైనాయేతర దేశాలకూ వైరస్ విస్తరిస్తుండటంతో సోమవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ 807 పాయింట్లు పతనమవగా, అమెరికా స్టాక్ మార్కెట్ డోజోన్స్ సైతం వెయ్యి పాయింట్లకు పైగా క్షీణించింది.

### పదింతలైన చమురు కొనుగోళ్లు

అమెరికా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు గడిచిన రెండేండ్లలో పదింతలు పెరిగాయి. ఇరు దేశాల మధ్య ఇంధన సంబంధాలను ఇది బలపరుస్తుండగా, 2017లో రోజుకు 25 వేల బారెల్స్‌గా ఉన్న చమురు, గ్యాస్ సరఫరా.. ఇప్పుడు 2.5 లక్షల బ్యారెళ్లకు చేరుకుందని అమెరికా ఇంధన శాఖ మంత్రి డాన్ బ్రౌల్లెట్టే తెలిపారు. దీంతో అమెరికా-భారత్ ద్వైపాక్షిక ఇంధన వాణిజ్యంపై సంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్.. డాన్ పనితీరును ప్రశంసించారు. 2017 నుంచే అమెరికా ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తున్నది. ఇక ప్రస్తుతం భారత్‌కు చమురు సరఫరాదారుల్లో అమెరికాది ఆరో స్థానమని దేశ చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. నిరుడు ద్వైపాక్షిక హైడ్రోకార్బన్ వాణిజ్యం 7.7 బిలియన్ డాలర్ల మార్కును తాకిందని చెప్పారు.



# హైదరాబాద్‌లో సీఐఐ సెంటర్

## ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌ల కోసం ఏర్పాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 25:** రాష్ట్రంలో ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి హైదరాబాద్‌లో ప్రత్యేక సెంటర్ అందుబాటులోకి రాబోతున్నది. ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్ లక్ష్యంగా ఏర్పాటు కానున్న ఈ జాతీయ సెంటర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ), ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకుడు క్రిష్ గోపాలకృష్ణన్‌కు చెందిన ప్రతీక్ష ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేయబోతున్నది. నిధులు లేక సతమతమవుతున్న స్టార్టప్‌లకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడంతోపాటు ఇతర అవసరాలను కూడా సీఐఐలో సభ్యత్వం ఉన్న 8 వేల మంది పారిశ్రామికవేత్తలు తీర్చేందుకు ఒక్క ప్లాట్‌ఫాం ఏర్పాటైంది. ఈ సెంటర్ ఏర్పాటునకు సంబంధించి విధివిధానాలు తుది దశకు చేరుకున్నాయని, ఏప్రిల్ నెలలో ప్రారంభించబోతున్నట్లు సీఐఐ స్టార్టప్ కౌన్సిల్ చైర్మన్, యాక్సిలర్ వెంచర్స్ చైర్మన్ గోపాలకృష్ణన్ తెలిపారు. ప్రస్తుతానికి టీ-హబ్‌లోనే ఈ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు ప్రకటించిన ఆయన..ఆర్థికంగా సహాయ సహకారాలు, మార్కెట్‌లో వ్యూహాత్మకంగా అడుగులకు ఈ వేదిక సరైనదన్నారు. ప్రత్యేకంగా రాష్ట్రంలో ఉన్న స్టార్టప్‌ల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న స్టార్టప్‌లకు కూడా అన్ని రకాల సేవలు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ప్రతీక్ష ట్రస్ట్ రూ.7.5 కోట్ల మేర నిధులను ఖర్చు చేయనున్నది. టీ-హబ్‌తో కలిసి సీఐఐ తెలంగాణ-యంగ్ ఇండియన్స్ హైదరాబాద్ ఏర్పాటు చేసిన సీఐఐ స్టార్టప్ కనెక్ట్ కార్యక్రమంలోనే ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ..ఆర్థికంగా, ఇతర ఏదైన సహాయ సహకారాలు కావాల్సిన స్టార్టప్‌లకు ఈ సెంటర్ ప్రత్యేక వేదికని, సీఐఐలో సభ్యత్వం ఉన్నవారు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అన్ని రకాలుగా సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం టీ-హబ్‌లో ఉన్న ఈ సెంటర్ భవిష్యత్తులో రెండో టీ-హబ్ బిల్డింగ్‌కు మార్చనున్నట్లు చెప్పారు.

### రోజుకు రూ.100 లోపే..

20వ శతాబ్దంలోనూ భారత్‌లో రోజుకు రూ.100 కంటే తక్కువ సంపాదిస్తున్న వారు చాలా మంది ఉన్నారని క్రిష్ వ్యాఖ్యానించారు. దేశ జనాభాలో 65 శాతం మంది వంద రూపాయల కంటే తక్కువ సంపాదించి జీవితాన్ని కొనసాగిస్తున్నారని, వీరికి సమానమైన సమాజాన్ని నిర్మించాలంటే స్టార్టప్‌లు ముఖ్య పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే భారత్‌లో ఉన్న 2 ట్రిలియన్ డాలర్ల విలువ కలిగిన ప్రైవేట్ సంపన్నవర్గాల్లో కేవలం ఒక్క శాతం మాత్రమే స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టారని, ఈ నేపథ్యంలో విదేశీ పెట్టుబడులకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

# మారిషస్ మదుపరులూ అర్హులే

## మరింత నిఘా మధ్య కొనసాగనున్న ఎఫ్‌పీఐ నమోదు: సెబీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** మారిషస్‌కు చెందిన విదేశీ మదుపరులూ భారత్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ)గా నమోదు కావచ్చని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ మంగళవారం స్పష్టం చేసింది. అయితే అంతర్జాతీయ నిబంధనల ప్రకారం మరింత నిఘా ఉంటుందని తెలిపింది. మనీ లాండరింగ్ నిరోధక ప్రమాణాలను నిర్దేశించే ద్వంద్వ ప్రభుత్వాల విధాన రూపకల్పన సంఘం ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్టులో పన్ను ఎగవేతదారులకు స్వర్గధామం మారిషస్‌ను పెట్టిన నేపథ్యంలో సెబీ పైవిధంగా ప్రకటించింది. ఎఫ్ఏటీఎఫ్ నోటీసుతో కొందరు ఫండ్ మేనేజర్లు వెంటనే సెబీ తలుపు తట్టారు. మారిషస్ ద్వారా నమోదైన ఎఫ్‌పీఐల కాలపరిమితిపై ఆందోళనల్ని వెలిబుచ్చారు. ఈ క్రమంలోనే ఎఫ్‌పీఐ నమోదు కోసం మారిషస్ నుంచి వచ్చే విదేశీ మదుపరులకూ అవకాశం ఉంటుందని, అయితే ఎఫ్ఏటీఎఫ్ నిబంధనల ప్రకారం వీరిపై నిఘా పెరుగుతుందని సెబీ స్పష్టత ఇచ్చింది. దేశీయ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్న ఎఫ్‌పీఐల్లో మారిషస్‌కు చెందిన వారు ఎక్కువే. అమెరికా తర్వాత మారిషస్ ఎఫ్‌పీఐలదే రెండో స్థానం. జనవరి ఎన్ఎస్‌డీఎల్ గణాంకాల ప్రకారం అమెరికాకు చెందిన ఎఫ్‌పీఐల పెట్టుబడుల విలువ రూ.11,62,579 కోట్లుగా ఉన్నది. మారిషస్ ఎఫ్‌పీఐల విలువ రూ.4,36,745 కోట్లుగా ఉన్నది. కొన్నేండ్లుగా మారిషస్ పెట్టుబడుల చుట్టూ మనీ లాండరింగ్ ఆరోపణలు అలుముకోగా.. మారిషస్ దీనిపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టు. ఈ లిస్టులోని దేశాలపై నిఘా ఎక్కువగా ఉంటుంది.

# విస్తరణ దిశగా బీజీఎల్!

## రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు సీఎన్‌జీ పైప్‌లైన్



**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సంప్రదాయ ఇంధన వనరుల వైపు వాహనదారులు ఆసక్తి కనబరుస్తుండటంతో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) బంకుల విస్తరణ జరుగుతున్నది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని ప్రధాన నగరాలకూ పైపులైను ద్వారా సీఎన్‌జీ సరఫరా చేయాలని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ (బీజీఎల్) భావిస్తున్నది. ఇప్పటివరకు కాకినాడ నుండి విజయవాడ మీదుగా హైదరాబాద్‌లోని శామీర్‌పేట, కొంపల్లి, జీడిమెట్ల ప్రాంతాలకు పైపులైను ద్వారా సీఎన్‌జీ సరఫరా అవుతున్నది. అయితే డిమాండ్ పెరుగుతుండటంతో విస్తరణ బాటపట్టిన బీజీఎల్.. వరంగల్, మెదక్, కరీంనగర్, షాద్‌నగర్ ప్రాంతాలకూ సేవలను అందించాలని నిర్ణయించింది. ముందుగా కరీంనగర్ పట్టణంలో సీఎన్‌జీ అందుబాటులోకి తేవాలని చూస్తున్నది. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారైన తర్వాత పనులు ప్రారంభించాలని యోచిస్తున్నారు. అంతా సజావుగా జరిగితే సంవత్సరంలోగా అందుబాటులోకి రావచ్చని సంస్థ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పెట్రోల్, డీజిల్‌తో పోల్చితే తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజీ ఇవ్వడంతోపాటు, కాలుష్య కారకాలు పరిమితంగా విడుదలై పర్యావరణ పరిరక్షణకూ సీఎన్‌జీ ఎంతో దోహదం చేస్తున్నది. దీంతో సీఎన్‌జీ ఆధారిత వాహనాల వినియోగం క్రమేణా పెరుగుతున్నది. పర్యావరణ పరిరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండటం కూడా కలిసొస్తున్నది. కాగా, కరీంనగర్ మార్గంలో సిద్దిపేట, వంటిమామిడి తదితర ప్రాంతాల్లో ఇటీవలే సీఎన్‌జీ బంకులను ఏర్పాటు చేశారు. మరో మూడు బంకులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలున్నాయి. ఇక వరంగల్ మార్గంలో రెండు బంకులను ఏర్పాటు చేశారు. అయితే ముందుగా కరీంనగర్‌కు పైపులైను ద్వారా సీఎన్‌జీని తరలించి అక్కడి నుండి సమీప ప్రాంతాలకు వాహనాల ద్వారా సరఫరా చేయాలన్న ప్రతిపాదనలున్నాయి. రోజూ లక్ష కిలోలకుపైగా సీఎన్‌జీ అమ్ముడవుతున్నదంటే దీని డిమాండ్ అంచనా వేయవచ్చు. 2015లో 50 వేల కిలోలు ఉన్న సీఎన్‌జీ విక్రయం.. ప్రస్తుతం రెట్టింపైందని సదరు సీనియర్ అధికారి చెప్పారు. 2003లో అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించిన బీజీఎల్.. క్రమేపీ బంకుల సంఖ్యను పెంచుతూ ఇప్పటివరకు కేవలం హైదరాబాద్‌లోనే 48 సీఎన్‌జీ బంకులను ఏర్పాటు చేసింది. మరిన్ని బంకులకు నోటిఫికేషన్ జారీచేసింది. నగరంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా సీఎన్‌జీ బంకులు దర్శనమిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.



### 2020 ఎడిషన్‌గా
# ఎండీవర్

ప్రారంభ ధర రూ.29.55 లక్షలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** ప్రీమియం ఎస్‌యూవీ ఎండీవర్‌ను 2020 ఎడిషన్‌గా దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది ఫోర్డ్ ఇండియా. ప్రత్యేక ఎడిషన్‌గా విడుదల చేసిన ఈ కారు ఢిల్లీ షోరూంలో రూ.29.55 లక్షల ప్రారంభ ధరగా నిర్ణయించింది. ఈ ధరలు ఏప్రిల్ 30 వరకు అమలులో ఉండనున్నాయని, ఆ తర్వాత ఈ కారు ధర రూ.70 వేలు అధికమవనున్నదని కంపెనీ ప్రెసిడెంట్, ఎండీ అనురాగ్ మెహరోత్రా తెలిపారు. ఏప్రిల్ 30 లోపు బుకింగ్ చేసుకున్న వారికి ఈ ఇంట్రడక్షన్ ధర వర్తించనున్నదన్నారు. 170 పీఎస్‌ల శక్తినివ్వనున్న ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 13.90 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. పాతదాంతో పోలిస్తే 14 శాతం అధికం

# మాస్టర్‌కార్డ్‌కు కొత్త సీఈవో

## ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అజయ్ బంగా • వచ్చే జనవరి నుంచి మార్పులు



మైఖేల్ మేబ్యాచ్

**న్యూయార్క్, ఫిబ్రవరి 25:** మాస్టర్‌కార్డ్ భారత సంతతి అధ్యక్షుడు, సీఈవో అజయ్ బంగా.. సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమితులు కానున్నారు. ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడు, సీఈవోగా మైఖేల్ మేబ్యాచ్ రానున్నట్లు ఓ ప్రకటనలో మాస్టర్‌కార్డ్ తెలిపింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మాస్టర్‌కార్డ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా దశాబ్దకాలానికిపైగా సేవలందించిన రిచర్డ్ స్థానంలో బంగా బాధ్యతల్లోకి వస్తారని స్పష్టం చేసింది. అదే రోజు నుంచి సంస్థ ప్రస్తుత చీఫ్ ప్రోడక్ట్ ఆఫీసర్‌గా ఉన్న మేబ్యాచ్.. సీఈవోగా బాధ్యతలు స్వీకరిస్తారన్నది. అయితే ఈ ఏడాది మార్చి 1 నుంచే అధ్యక్షుడిగా ఉంటారని ప్రకటించింది. అధ్యక్షుడిగా సేల్స్, మార్కెటింగ్, ప్రోడక్ట్స్, సర్వీసెస్, టెక్నాలజీ ఆర్గనైజేషన్స్‌ను ఆయన పర్యవేక్షించనున్నారు. మేబ్యాచ్ నియామకాన్ని సంస్థ బోర్డు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఈ సందర్భంగా మాస్టర్‌కార్డ్ వెల్లడించింది. 2010 నుంచి అజయ్ బంగా మాస్టర్‌కార్డ్ సారథిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఆయన నాయకత్వంలో సంస్థ ఆదాయం 5.5 బిలియన్ డాలర్ల నుంచి 16.9 బిలియన్ డాలర్లకు ఎగిసింది. షేర్ల విలువ కూడా 1,600 శాతానికిపైగా ఎగబాకింది. ఈ క్రమంలో తమ ప్రధాన ప్రత్యర్థి సంస్థ వీసాకార్డును మాస్టర్‌కార్డ్ సులభంగానే అధిగమించగలిగింది. 'ఇన్నేండ్లు నాతో కలిసి సంస్థ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు' అని అజయ్ బంగా అన్నారు. ఇకపైనా ఇదే ప్రగతితో ముందుకెళ్లగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అమెరికా బహుళజాతి సంస్థలకు నాయకత్వం వహిస్తున్న భారత సంతతి వ్యక్తుల్లో అజయ్ బంగా మాస్టర్‌కార్డే చిన్న సంస్థ. గత నెల అమెరికా ఐటీ దిగ్గజం ఐబీఎం సీఈవోగా అర్వింద్ కృష్ణ నియమితులైన విషయం తెలిసిందే. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ సీఈవోగా సత్య నాదెళ్ల, ఆల్ఫాబెట్-గూగుల్ సీఈవోగా సుందర్ పిచాయ్, అడోబ్ సీఈవోగా శంతను నారాయణ్ ఉన్నారు. సుదీర్ఘ కాలంపాటు పెప్సీకో సీఈవోగా ఇంద్రా నూయి పనిచేసిన సంగతి విదితమే.

# టెలికం మంత్రితో టాటా చీఫ్ భేటీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ మంగళవారం కమ్యూనికేషన్ మంత్రి రవి శంకర్ ప్రసాద్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏజీఆర్ బకాయిలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఆయన మంత్రితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. 30 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశం వివరాలు వెల్లడించడానికి చంద్రశేఖరన్ నిరాకరించారు. రూ.14 వేల కోట్ల ఏజీఆర్ బకాయిలకుగాను రూ.2,197 కోట్లు మాత్రమే చెల్లించడంతో టాటాకు నోటీసులు జారీ చేయడానికి సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో ఈ కీలక సమావేశం జరుగడం విశేషం. కంపెనీ బకాయిలు చెల్లింపులపై సంస్థ నుంచి ఎలాంటి హామీ రాలేదని, దీంతో వచ్చే రెండు రోజుల్లోగా నోటీసులు జారీ చేయనున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# ఎయిర్ ఇండియా రేసులో అదానీ!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** రుణసంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను కొనుగోలు చేయడానికి దేశీయ కుబేరుల్లో ఒకరైన గౌతమ్ అదానీ కూడా బిడ్డింగ్ దాఖలు చేయనున్నారు. తీవ్ర నష్టాల్లో నడుస్తున్న ఈ సంస్థను పూర్తిగా వదిలించుకోవడానికి 100 శాతం వాటాను విక్రయించనున్నట్లు ఇదివరకే కేంద్రం ప్రకటించింది. అదానీతోపాటు టాటా గ్రూపు, హిందుజాలు, ఇండిగో, న్యూయార్క్‌నకు చెందిన ఫండ్ ఇంటరప్స్ వంటి సంస్థలు కూడా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తున్నది. ఎయిర్ ఇండియాలో వాటా విక్రయానికి గడువు వచ్చే నెల వరకు కేంద్రం పొడిగించింది. ఈ బిడ్డింగ్ దాఖలుపై అదానీ గ్రూపు ప్రతినిధి స్పందించడానికి నిరాకరించారు. కానీ, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సంస్థ..ఎయిర్ ఇండియాతోపాటు విమానాశ్రయాల నిర్వహణపై కూడా దృష్టి సారించినట్లు తెలిసింది. గతేడాది అహ్మదాబాద్, లఖ్నో, జైపూర్, గువాహాటీ, తిరువనంతపురం, మంగళూరు విమానాశ్రయాల ఆధునీకరణకు సంబంధించి నిర్వహించిన బిడ్డింగ్‌లో సంస్థ తక్కువ కోడ్ చేసి వీటిని దక్కించుకున్నది. ప్రస్తుతం ఎయిర్ ఇండియాకు రూ.60 వేల కోట్ల అప్పు ఉండగా, గడిచిన మూడేండ్లుగా నష్టాలతో కాలంవెళ్లదీస్తున్నది. వాటాల విక్రయానికి సంబంధించి వరుసగా రెండేండ్లుగా నిర్వహించిన బిడ్డింగ్‌లో ఒక్కసంస్థ కూడా బిడ్లు దాఖలు చేయలేదు.

### మరోసారి గడువు పెంపు!

ఎయిర్ ఇండియాలో వాటా విక్రయానికి సంబంధించి గతంలో ఇచ్చిన గడువును వచ్చే నెల 17 వరకు పెంచే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో వివిధ శాఖల మంత్రులతో ఏర్పాటైన కమిటీ ఈ వారం చివర్లో ఇందుకు సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇదివరకే గడువును మార్చి 6 నుంచి 11 వరకు పెంచిన విషయం తెలిసిందే. ఈ కమిటీలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, హర్దీప్ సింగ్ పూరి ఉన్నారు.

# అంతే వేగంతో దిగువకు..

రూ.954 తగ్గిన బంగారం ధర

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25:** రికార్డు స్థాయిలో పెరిగిన బంగారం ధరలు అంతే వేగంతో దిగొచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.954 తగ్గి రూ.43,549 వద్ద ముగిసింది. అంతకుముందు రోజు ఈ ధర రూ.44.503గా ఉన్నది. సోమవారం రికార్డు స్థాయిలో దూసుకుపోయిన పసిడి ధరలు..ఆ మరుసటి రోజే భారీగా తగ్గాయి. రూపాయి బలోపేతం కావడం, అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు భారీగా తగ్గడం ఇందుకు కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ విశ్లేషకులు తపన్ పటేల్ తెలిపారు.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

## టీఎస్ ఎడ్‌సెట్

**తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్‌ఎడ్‌సెట్) ప్రకటనను ఓయూ విడుదల చేసింది.**

- **కోర్సు:** బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ), **కాలవ్యవధి:** రెండేండ్లు
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా
- **పరీక్షతేదీ:** మే 23
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** https://edcet.tsche.ac.in

## యూపీఎస్సీలో

**యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 41
- **పోస్టులవారీగా ఖాళీలు:** జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్-2, సైంటిస్ట్-38, ఎకనమిస్ట్-1 ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 12
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

## ఎన్ఐసీలో 495 పోస్టులు



- **పోస్టులు:** సైంటిస్ట్ బీ, సైంటిఫిక్/టెక్నికల్ అసిస్టెంట్ ఏ
- **మొత్తం ఖాళీలు:** 495
- **పోస్టులవారీగా ఖాళీలు:** సైంటిస్ట్ -288, సైంటిఫిక్/ టెక్నికల్ అసిస్టెంట్- 207 ఉన్నాయి.
- **అర్హతలు:** సైంటిస్ట్ బీ పోస్టుకు బీఈ/బీటెక్ (ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ, ఈఐ) లేదా ఎమ్మెస్సీ/ఎంసీఏ లేదా తత్సమానమైన కోర్సు ఉత్తీర్ణత.
- సైంటిఫిక్/ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ/ఎంఎస్ లేదా ఎంసీఏ ఉత్తీర్ణత.
- **వయస్సు:** మార్చి 26 నాటికి 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** సైంటిస్ట్-రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సైంటిఫిక్/ టెక్నికల్ అసిస్టెంట్- రాత పరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** http://nielit.gov.in

## నాల్కోలో

**నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 12
- **పోస్టులవారీగా ఖాళీలు:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఫైనాన్స్)-8, అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్)-4.
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ, చార్టెర్డ్ అకౌంటెంట్ (సీఏ) ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 18
- **వెబ్‌సైట్:** https://nalcoindia.com

## నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో

**నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 307
- **పోస్టులు:** డ్రాగ్‌లైన్ ఆపరేటర్, డోజర్ ఆపరేటర్, గ్రేడర్ ఆపరేటర్, డ్రిల్ ఆపరేటర్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** పదోతరగతి, ఐటీఐ ఉత్తీర్ణత, వ్యాలిడ్ హెవీ మోటార్ వెహికిల్ లైసెన్స్ ఉండాలి.
- **వయస్సు:** 18-30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఉమ్మడి రాతపరీక్ష, అడిషనల్ టెక్నికల్ టెస్ట్ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 16 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** మార్చి 30
- **వెబ్‌సైట్:** http://nclcil.in

నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM
జిందగీ
బుధవారం 26 ఫిబ్రవరి 2020
/nt.zindagi





గులాబీ రంగు చీరలో పద్మిని.. కమలం పువ్వు నుంచి వస్తున్నట్టు చాలా రమ్యంగా కనిపిస్తూ ఉంటుంది. కృష్ణుడిని అలరించే యశోద.. చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తుంటుంది. ప్రకృతి రమణీయత క్యాన్వాస్‌పై నుంచి కళ్లను తిప్పుకోనివ్వవు.. ఇదీ ప్రఖ్యాత చిత్రకారుడు రాజా రవివర్మ చిత్రాల గొప్పదనం. అవి మన భారతదేశ వైవిధ్య సంపద. ఇంతటి అమూల్యమైన కళాత్మక వారసత్వాన్ని కాపాడుకోవడం అవసరం. ఆ సంపదకు సృజనాత్మకతను జోడించి మైమరపింపజేశారు నగరానికి చెందిన ప్రముఖ టెక్స్‌టైల్ డిజైనర్ గౌరంగ్ షా. చీరలపై రవివర్మ చిత్రాలను నేసి వైవిధ్యానికి పట్టం కట్టారాయన.





## చేనేత చీరలపై రవివర్మ చిత్రాలు

# చేనేతకు కొత్త పుంతలు

**హైదరాబాద్** టెక్స్‌టైల్ డిజైనర్లలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి. చేనేతకు పూర్వ వైభవం తీసుకొని రావడానికి గౌరంగ్ షా విశిష్టమైన కృషి చేస్తున్నారు. 'అందరిలా కాకుండా మీ పనిలో వైవిధ్యాన్ని చూపారు. ఆ కలెక్షన్‌ను ఎంతటి సృజనాత్మకంగా ఆవిష్కరించావన్నదే ముఖ్యం' అంటారాయన. అతివ అందానికే అందం తెచ్చే చేనేత చీర సొగసు వర్ణనాతీతం. ఆ సొగసుకు ఇప్పుడు ప్రపంచ ఫేషన్ ప్రియులు సైతం ఫిదా అవుతున్నారని గౌరంగ్‌షా అంటున్నారు. హైదరాబాద్‌కు చెందిన గౌరంగ్ ముప్పై ఏండ్లుగా ఈ రంగంలో ఉన్నారు. ఎప్పటికప్పుడూ టెక్స్‌టైల్ రంగంలో మార్పులను గుర్తించి, తరానికి తగ్గ డిజైన్లను అందిస్తున్నారు. సాదాసీదాగా కాకుండా తమదైన సృజనాత్మకత జోడించడంతో గౌరంగ్ షా డిజైన్లు ప్రత్యేక ఆదరణ పొందుతున్నాయి.



**రాజా రవి వర్మ చిత్రాలతో ఉన్న చేనేత చీరలను కేవలం ప్రదర్శన కోసమే తయారు చేశారు. చేనేత వారసత్వ సంపదకు సృజనాత్మక రీతిలో ప్రజల ముందు ఉంచాలన్నదే ఈ కృషి ముఖ్య ఉద్దేశం అని గౌరంగ్‌షా అంటున్నారు. ఈ చీరలను దేశవ్యాప్తంగా ప్రదర్శిస్తున్నారు గౌరంగ్‌షా. మొదటి ప్రదర్శన 2017లో ముంబైలో నిర్వహించారు. అనంతరం ముంబై, ఢిల్లీలో ప్రదర్శించారు. రాబోయే రోజుల్లో దేశంలోని మేజర్ సిటీల్లో ప్రదర్శనలు పెట్టి అనంతరం వీటిని విదేశాలకు తీసుకెళ్తామని చెప్పారు గౌరంగ్‌షా. ఈ చీరలను అమ్మకానికి ఉంచడం లేదనీ, కేవలం చేనేత వస్త్ర వైభవాన్ని ప్రపంచానికి తెలియజేయడమే లక్ష్యం అని తెలిపారు.**

### చేనేత చీరలపై రవివర్మ చిత్రాలు

ఖాదీ చీరలపై రవివర్మ చిత్రాలు చేనేతను కొత్తపుంతలు తొక్కిస్తున్నాయి. 30 చీరలపై నేసిన ఈ చిత్రాలను హైదరాబాద్‌లోని 'సప్తపర్ణి'లో ప్రదర్శనకు ఉంచారు. ఇందులో దాదాపు ఇరవై ఐదు చీరలపై స్త్రీ ప్రాధాన్యపు చిత్రాలున్నాయి. రవివర్మ చిత్రాలు అనగానే రంగులు, భావాలు, వివరాలు గల గొప్ప సమ్మేళనం. అంతగా వెలుగులోకిరాని రవివర్మ పెయింటింగ్స్‌ను ఎంచుకొని ఈ చీరలు తయారు చేశారు గౌరంగ్‌షా. ఈ కృషి వెనుక రవివర్మ మునిమనవరాలు రుక్మిణీ వర్మ ఆలోచన ఉంది. ఆమె బెంగళూర్ కేంద్రంగా 'రవివర్మ హెరిటేజ్ ఫౌండేషన్'ను నిర్వహిస్తున్నారు. రవివర్మ వారసత్వ సంపదను రక్షించే కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన గీసిన చిత్రాలను చేనేత చీరలపై ముద్రించాలని అనుకున్నారు. ఇందులో భాగంగానే గౌరంగ్‌షాను సంప్రదించారు. రవివర్మ అరుదైన చిత్రాలను సేకరించి వాటిని చీరలపై అచ్చంగా ముద్రించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. శ్రీకాకులం జిల్లాలోని 'జిందానీ' నేతకారులతో కలిసి ఈ పని పూర్తి చేయించారు. సుమారు ఆరు వందల రకాల సహజ రంగులు ఉపయోగించారు. పనిలో మొత్తం 20 చేనేత కుటుంబాలను భాగస్వాములను చేశారు. 'జిందానీ' చేనేత నైపుణ్యంతో ఈ చీరలను అనుకున్నట్టు ముద్రించడం సాధ్యం అయిందని గౌరంగ్‌షా తెలిపారు. మహిళలు, దేవతలు, కథలు.. ఇలా మూడు విభాగాలుగా 30 పెయింటింగ్స్‌ను ముద్రించారు. ఆరు నెలల కాలాన్ని పూర్తిగా పరిశోధనకే కేటాయించినట్టు చెప్పారు. 'తొలుత వీటిపై నైపుణ్యమున్న చేనేతకారులతో చర్చించినప్పుడు ఇది సాధ్యమా అన్నారు. దీనికి తగ్గట్టే ఖాదీలో సహజ రంగులను ఉపయోగించి ఈ చీరలు నేయాల్సి ఉండడం కూడా మరో సవాలు. తొలి రెండు చీరల ప్రయోగం విఫలమైనా తర్వాత సక్సెస్ అయ్యాం.' అని గౌరంగ్ చెప్పారు. ఈ చీరలను పూర్తిగా తయారు చేయడానికి మూడేండ్లు శ్రమించారు. ప్రతిచీరరంగూ రవివర్మ చిత్రాల్లోని రంగును బట్టే తీసుకున్నామని చెప్పారు.

### ఫేషన్ ప్రపంచానికి కొత్త ట్రీట్‌మెంట్..

గౌరంగ్ షా తన ప్రతిభా నైపుణ్యంతో ఫేషన్ ప్రపంచంలో కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. దేశవ్యాప్త ప్రదర్శనలనే కాకుండా విదేశాల్లో సొంత స్టోర్‌లను కలిగి ఉన్నారు. వీటిని నిర్వహిస్తూనే చేనేత వస్త్రాలతో ఆయా ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారు. 2012లో ముంబైలో జరిగిన లాక్మే ఫేషన్ వీక్‌లో ప్రపంచ ఫేషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేశారు గౌరంగ్ షా. పోచంపల్లి ఇక్కత్ చీరల సోయగం ఆకర్షణగా నిలిచింది. ఫేషన్ కూడా ఎప్పుడూ వాస్తవాన్ని దాటి పరుగెత్తదు. సాంప్రదాయ వస్త్ర శైలుల్ని గౌరంగ్ షా సరికొత్తగా మారుస్తాడు. ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌లో కౌసల్యం పేరుతో జమదానీ చేనేత చీరల ఫేషన్ షో కూడా నిర్వహించారు గౌరంగ్. 700 మందికి పైగా చేనేత కళాకారుల నైపుణ్యం చూపించిన డిజైనర్ దుస్తులతో మోడల్స్ కనువిందు చేశారు. ఈ పనితనం ఇతర దేశాల్లో కూడా ప్రత్యేకతను సొంతం చేసుకుంది. లాక్మే ఫేషన్ వీక్ లోనూ చేనేత చీరలు ప్రత్యేకతను చాటుకున్నాయి. ఫేషన్ ప్రపంచానికి ప్రత్యేక గుర్తింపు మన చేనేత చీరలని అంటారాయన.


### వెండితెరపై చేనేత వెలుగులు

వెండి తెరమీద సంచలనం సృష్టించి, జాతీయ అవార్డులు అందుకున్న మహానటి సావిత్రి సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేసింది గౌరంగ్‌షానే. అలనాటి నటి సావిత్రి సినిమాకు పని చేసే అవకాశం రావడంతో సృజనాత్మకతకు పదును పెట్టారు గౌరంగ్‌షా. చిత్ర బృందం తన మీద నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిందనీ, పూర్తి కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేసిన తొలి సినిమా అని తెలిపారు. ఈ సినిమా కోసం సావిత్రి ధరించిన వస్త్రాలపై, అప్పటి అభిరుచులపై ఆరు నెలలకు పైగా పరిశోధనలు చేశారు. తర్వాత ఏడాది సమయం కృషి చేసి వస్త్రాలను రూపొందించారు. వంద మందికి పైగా చేనేత కళాకారులతో నిర్విరామంగా శ్రమించి చేనేత వస్త్రాలను వెండితెరపై మెరిపించారు. మహానటి సినిమాకు వైవిధ్యమైన డిజైన్లను అందించడం, ఆ పనికి జాతీయ అవార్డు రావడం అన్నీ అద్భుతాలే అని చెప్పారు గౌరంగ్ షా.

... వినోద్ మామిడాల
గడసంతల శ్రీనివాస్

# స్త్రీవాదం.. సత్యవతి నినాదం

**ఆమె కథల్లో అనవసర పాత్రలుండవు. అతిశయోక్తులు అస్సలుండవు. వర్ణనలు, పోలికలు.. మోతాదుకు మించవు. ఆమె కథల్లో నిజజీవితాలు ప్రతిబింబిస్తాయి. సమాజ పోకడ, స్త్రీల మనస్తత్వాలు, సామాన్యుల జీవితాలు ఆమె కథకు నేపథ్యాలు. మధ్యతరగతి మగువల బతుకులే కథల్లోని పాత్రలు. నిజాల్ని అక్షరీకరించి, స్త్రీల తరపున నిలబడ్డ అతి తక్కువ మందిలో ఆమె ఒకరు.**




ఈ రచనకే కేంద్ర సాహిత్య అకాడమీ 2019 అనువాద అవార్డు లభించింది



**అది 1950.** చమురు దీపాలు చీకటిని తరిమేస్తున్న రోజులు. ఓ రైతు ఇంటి వసారాలో పెద్ద బ్యాటరీ. దానికి ప్లగ్ పెట్టి రేడియో నడిపించేవాడు. ఆ ఊరివాళ్లంతా అక్కడికొచ్చి వార్తలు వినేవారు. కానీ అవి గ్రామస్తులకెవరికీ అర్థం కాకపోయేవి. ఎందుకంటే అవి ఆంగ్లవార్తలు. ఆ రైతు సత్యనారాయణ. వార్తల్ని తెలుగులో తర్జుమా చేసి గ్రామస్తులకు చెప్పేవాడు. కొన్నాళ్లకు ఆ బాధ్యతను కూతురుకు అప్పగించాడు. ఆమె అర్థమైనంత మేరకు తెలుగులో చెప్పేది. ఆ రైతు చదువుకున్నది తక్కువే. కానీ సాహిత్యమన్నా, ఆంగ్లమన్నా ఆసక్తి. తెలియకుండానే కూతురుకూ ఆంగ్లంపై ఆసక్తి పెరిగింది. సత్యనారాయణ ఆంగ్ల నవల చదివాక షెల్ఫ్‌లో పెట్టేవాడు. ఆ వెంటనే ఆ చిన్నారి పెద్ద డిక్షనరీ ముందేసుకొని కూర్చునేది. నవల చదువుతూ డిక్షనరీలో అర్థాలు చూస్తూ అర్థం చేసుకునేది. రచనావ్యాసంగంలో ఏడు దశాబ్దాలు గడిచాయి. ప్రస్తుతం ఆమె అనువదించిన పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది.

**విస్తృత అధ్యయనం:** పి. సత్యవతి. సాహిత్యప్రపంచంలో ఈపేరు వినని వారుండరు. గుంటూరు జిల్లా కొలకలూరు ఆమె స్వస్థలం. తండ్రి సత్యనారాయణ వ్యవసాయదారు. తల్లి కనకదుర్గ గృహిణి. సత్యవతి ప్రాథమిక విద్య కొలకలూరులో, కోఠీ వుమెన్స్ కాలేజీలో బీఏ డిగ్రీ పట్టా అందుకున్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లీష్ పూర్తి చేశారు. విజయవాడలోని ఎస్ఏఎస్(సయ్యద్ అప్పలస్వామి) కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేశారు. ఆ సమయంలోనే అనేక రచనలు చేశారు. ఆంగ్ల సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేశారు. తనకంటూ ఓ ప్రత్యేక శైలిని ఏర్పర్చుకున్నారు. స్త్రీవాదాన్ని తలకెత్తుకున్నారు. 1975లో 'మంత్రినీడ' కథా సంపుటి ద్వారా సాహితీలోకానికి పరిచయమయ్యారు. రెండువందలకు పైగా కథలు రాశారు సత్యవతి. వాటిలో దమయంతి కూతురు, పేరులేని పిల్ల, గాంధారి రాగం, మూడేళ్ల ముచ్చట, ఎచటికిపోతావు రాత్రి, పగిలిన గాజు కప్పు కథలు బాగా పేరుపొందాయి. మొదటిసారి 1997లో ఆమె చాసో పురస్కారం అందుకున్నారు. 2012లో గురజాడ పురస్కారం. 2015లో మాలతీ చందూరు పురస్కారం, 2017లో తానా పురస్కారం అందుకున్నారు. ఇవేకాకుండా వందలాది పురస్కారాలు ఆమెను పలకరించాయి. సత్యవతి కథలు, ఇల్లలకగానే, 'మంత్రనగరి' కథల సంపుటాలు, 'పడుచుదనం రైలుబండి', 'గొడుగు' నవల మంచి పేరు తీసుకొచ్చాయి.

**పురస్కారం ఈ పుస్తకానికే:** ఆంగ్లంలో ఎ.రేవతి రచించిన 'ద ట్రూత్ ఎబౌట్ మి: ఎ హిజ్రా లైఫ్ స్టోరీ'ని సత్యవతి 'ఒక హిజ్రా ఆత్మకథ'గా తెలుగులోకి అనువదించారు. దీనికి ఆమెకు సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం దక్కింది. వివిధ భాషలకు చెందిన 23 మంది రచయితలను జ్యూరీ సభ్యులు కేంద్రసాహిత్య అకాడమీ 2019 అనువాద అవార్డుకు ఎంపిక చేశారు. ఆంగ్లం నుంచి తెలుగులో అనువాదం చేసినందుకుగాను సత్యవతిని ఎంపికచేశారు. ఈ పురస్కారం కింద సత్యవతి రూ. 50వేలు నగదు పురస్కారం అందుకోనున్నారు.

### పాఠ్యాంశాలుగా కూడా..

సత్యవతి రాసిన 'వాట్ ఈజ్ మై నేమ్' కథ పదో తరగతిలో పాఠ్యాంశంగా ఉంది. 'విల్ హీ కం హోం' కథ ఇంటర్‌లో పాఠ్యాంశంగా ఉంది. 200లకు పైగా కథలు, అనేక నవలలు రచించిన సత్యవతి వర్తమాన రచయితలకు ఆదర్శం.

... పడమటింటి రవికుమార్


# పీరియడ్ ఫీస్ట్ ముఖ్య ఉద్దేశం






**నెలసరిపై ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం. దీనిపై ఇప్పటికీ చర్చలు నడుస్తూనే ఉన్నాయి. నెలసరి సమయంలో భర్తలకు వంట చేసి పెట్టడం వల్ల మహిళలు వచ్చే జన్మలో ఆడకుక్కలుగా పుడతారనే వ్యాఖ్య నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఈ అనుమానాలను తొలగించేందుకే ఈ పనికి పూనుకున్నారు ఢిల్లీ మహిళలు.**

**పుకార్లు.** ఇది పుకారు అని అందరికీ తెలుసు. అయినా ఫాలో అవుతుంటారు. ఇక నెలసరి విషయానికొస్తే నమ్మలేనన్ని, చెప్పలేనన్ని. ఇటీవలె నెలసరిపై కొన్ని మాటలు బాగా వైరల్ అయిన సంగతి తెలిసిందే.. పీరియడ్స్ సమయంలో భర్తకు వంటచేసి పెట్టడం వల్ల భార్య వచ్చే జన్మలో ఆడకుక్కగా పుడుతుంది, మగవారు ఎద్దులవుతారు'. ఇవి మన శాస్త్రాలు చెబుతున్నాయని గుజరాత్‌లోని భుజ్‌లో స్వామి నారాయణ ఆలయానికి చెందిన కృష్ణ స్వరూప్ దాస్‌జీ అన్న మాటలు. ఈ మాటలు వివాదాలకు దారి తీశాయి. ఈ సంఘటన మరువక ముందే ఆదే ప్రాంతంలోని ఓ మహిళా కళాశాలలో అమ్మాయిలకు అనుకోని ఘటన ఎదురైంది. పీరియడ్స్ సమయంలో అమ్మాయిలు కిచెన్‌లోకి వెళ్తున్నారని, అక్కడ వస్తువులన్నీ తాకుతున్నారని హాస్టల్ వార్డెన్ ప్రిన్సిపాల్‌కు పిర్యాదు చేసింది. దీంతో విద్యార్థినుల్లో ఎవరెవరు నెలసరితో ఉన్నారో తెలుసుకునేందుకు లోదుస్తులు పరిశీలించాల్సిందిగా ప్రిన్సిపాల్ ఆదేశించింది. ఇలా మహిళలు నెలసరి సమయంలో ఆరోగ్యంతో బాధపడడమే కాకుండా ఇలాంటి విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇది ఇలానే కొనసాగితే.. మహిళలను అంటరానివాళ్లుగా పరిగణిస్తుందీ లోకం. అందుకే ఢిల్లీకి చెందిన 28 మంది మహిళలు నెలసరి సమయంలో 500 మందికి సరిపడా ఆహారం వండారు. దాన్ని అందరికీ వడ్డించారు. దీంతో తిన్నవారికి, చేసిన వారికీ ఏమీ కాలేదు. ఇవన్నీ పుకార్లు. నెలసరిలోని మహిళలు వండిన ఆహారం తినడం వల్ల ఎవరికీ ఏమీ కాదని చెప్పడమే తమ ఉద్దేశ్యం. ఇలా చేయడం వీరికి ఎంతో గర్వంగా ఉందంటున్నారు. ఇది సచ్చి సహేలి ఫౌండర్ సుర్భిసింగ్ ఆధ్వర్యంలో 'పీరియడ్ ఫీస్ట్' ను నిర్వహించారు. రుతుస్రావంలో ఉన్న మహిళలు అంటరాని వారు కాదు. స్వేచ్ఛగా ఉండొచ్చు. ఎక్కడికైనా వెళ్లొచ్చు. దేన్నైనా తాకొచ్చు అని స్పష్టం చేశారు సుర్భి సింగ్.




దిల్‌రాజు, రష్మిక మందన్న, నితిన్, మహతిస్వరసాగర్, నాగవంశీ, వెంకీ కుడుముల

# విజయంతో సమాధానం చెప్పాడు!

'నాలుగేళ్ల తర్వాత అందుకున్న ఈ విజయాన్ని ఎప్పటికీ మరువలేను. సినిమాలో నా కామెడీ టైమింగ్‌తో పాటు నటన బాగుందని అంటున్నారు. ఆ క్రెడిట్ మొత్తం దర్శకుడు వెంకీ కుడుములదే' అని అన్నారు నితిన్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'భీష్మ'. వెంకీ కుడుముల దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగ వంశీ నిర్మించారు. రష్మిక మందన్న కథానాయిక. ఇటీవల ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ 'చాలా రోజులుగా ఎదురుచూస్తున్న సక్సెస్ ఇది. ఈ ప్రయాణంలో దర్శకుడు వెంకీ కష్టాన్ని, అతడి జీవితంలోని ఎత్తుపల్లాల్ని దగ్గరుండి చూశాను. ఈ విజయం నాతో పాటు అతడికి ముఖ్యమైంది. ఈ సక్సెస్‌తో చాలా మందికి సమాధానం ఇచ్చాడు. ఈ నిర్మాణ సంస్థ నా కెరీర్‌కు సెంటిమెంట్‌గా మారింది. 'అఆ'తో కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌ను ఈ బ్యానర్‌లోనే అందుకున్నాను. ఆ తర్వాత నాలుగేళ్లలో మూడు ఫ్లాపులు వచ్చాయి. మళ్లీ ఈ సంస్థతోనే విజయాల బాట పట్టడం ఆనందంగా ఉంది. నా తదుపరి సినిమాను ఇదే బ్యానర్‌లో చేయబోతున్నాను. ఈ విజయపరంపర ఇలాగే కొనసాగాలి' అని తెలిపారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''ఛలో' సినిమాతో తొలి విజయాన్ని అందుకున్న వెంకీ ఈ చిత్రంతో సూపర్‌హిట్ కొట్టి హ్యాట్రిక్‌కు సిద్ధమయ్యాడు. దర్శకుడి విజన్ బాగుంటే నాణ్యతతో కూడిన మంచి సినిమా చేయచ్చని నిరూపించాడు. రష్మిక ఎక్కడ అడుగు పెడితే అక్కడ సూపర్‌హిట్స్ వస్తున్నాయి. ప్రతి సినిమాతో నటిగా ఎదుగుతున్నది. హీరోలతో పోటీపడి డ్యాన్సులు చేస్తున్నది. సరైన సక్సెస్ కోసం నితిన్ చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాడు. మా సంస్థలో 'శ్రీనివాసకళ్యాణం'తో హిట్ కొడదామని అనుకున్నాం. కానీ ఫ్లాప్ ఇచ్చాం. ఈ సినిమాతో నితిన్ సిక్సర్ కొట్టడం ఆనందంగా ఉంది. ఆద్యంతం వినోదాన్ని పంచే సినిమా ఇది. నవ్వుతూ థియేటర్ నుంచి ప్రతి ఒక్కరూ బయటకు వస్తారు' అని అన్నారు. వెంకీ కుడుముల మాట్లాడుతూ 'సమిష్టి విజయమిది. నిర్మాతలు కథను నమ్మి సినిమా చేయాలనుకున్నప్పుడే సక్సెస్ మొదలైంది. 'దిల్'తో నితిన్‌కు అభిమానిగా మారాను. దర్శకుడిగా కాకుండా ఓ అభిమానిగా ఆయన్ని కమర్షియల్ పంథాలో ఆవిష్కరిస్తూ సినిమాను తెరకెక్కించాను. ఈ సినిమాతో ఆయన వ్యక్తిత్వానికి ఫ్యాన్‌గా మారిపోయాను. స్నేహానికి విలువనిచ్చి రష్మిక ఈ సినిమా చేయడం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. 'నన్ను తెలుగు చిత్రసీమకు పరిచయం చేసిన వెంకీ కుడుముల ఈ చిత్రంతో నాకు మరో పెద్ద విజయాన్ని ఇచ్చారు. 'భీష్మ' పాత్రలో నితిన్ టైమింగ్, స్టైల్ చూసి ఆయనకు ఫ్యాన్‌గా మారిపోయాను' అని రష్మిక చెప్పింది. ఈ కార్యక్రమంలో శుభలేఖ సుధాకర్, సాగర్ మహతి పాల్గొన్నారు.

# 'గీతాంజలి-2' కథతో 'రాహు' చేశా!


సుబ్బు వేదుల

దర్శకుడిగా తాను చంద్రశేఖర్ ఏలేటిని అభిమానిస్తానని అన్నారు సుబ్బు వేదుల. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'రాహు'. కృతి గార్గ్, అభిరామ్‌వర్మ జంటగా నటించారు. ఈ నెల 28న విడుదల కానుంది. మంగళవారం హైదరాబాద్‌లో సుబ్బు వేదుల మాట్లాడుతూ 'థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కించాం. కన్వర్షన్ డిజార్డర్ సమస్యతో బాధపడే ఓ యువతి కథ ఇది. రక్తం చూస్తే కొద్ది క్షణాల పాటు ఆమెకు కళ్లు కనిపించవు. ఈ సమస్యతో సతమతమయ్యే ఆమె జీవితంలోకి ఓ రాహు లాంటి వ్యక్తి ప్రవేశిస్తాడు. ఈ చిక్కుముడుల నుంచి ఆమె ఎలా గట్టెక్కింది? అన్నది సినిమాలో ఉత్కంఠను పంచుతుంది. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కించాం. ఇండస్ట్రీలో స్టార్స్ ఎవరూ నాకు తెలియదు. వారిని కలిసే మార్గాలపై అవగాహన లేదు. అందుకే నాకున్న వనరులతో కొత్త నటీనటుల్ని ఎంచుకొని ఈ సినిమా చేశాను. ఏడేళ్ల క్రితం కోన వెంకట్‌తో పరిచయం ఏర్పడింది. ఆయనతో కలిసి చాలా సంవత్సరాలు ప్రయాణించాను. 'రాహు' కథతో 'గీతాంజలి -2' సినిమా చేయాల్సింది. అంజలి కథానాయికగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటించిన అనంతరం ఆర్థికపరమైన కారణాలతో ఆగిపోయింది. స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేసి ఆ కథనే 'రాహు'గా తెరకెక్కించాను. ఏ హాలీవుడ్ సినిమాకు స్ఫూర్తి కాదిది. 'మృగం' అనే కథను నిర్మాత బన్నీవాస్‌కు వినిపించాను. ఆయనకు నచ్చింది. థ్రిల్లర్ జోనర్ కావడంతో సంశయంలో ఉన్నారు. నా తదుపరి చిత్రాన్ని 'రాహు' నిర్మాతలతో చేయబోతున్నాను' అని తెలిపారు.

# నిర్మల్ నేపథ్య ప్రేమకథ


లక్ష్మీపార్వతి, ముస్కాన్‌సేతి

అనురాగ్, ముస్కాన్‌సేతి జంటగా నటిస్తున్న చిత్రం 'రాధాకృష్ణ'. ప్రసాద్‌వర్మ దర్శకుడు. పుప్పాల సాగరిక, శ్రీనివాస్ కానురు నిర్మాతలు. నందమూరి లక్ష్మీపార్వతి కీలక పాత్రలో నటిస్తోంది. చిత్రీకరణ చివరి దశలో ఉంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ' పల్లెవాతావరణంలో భావోద్వేగభరితంగా సాగే ప్రేమకథా చిత్రమిది. కనుమరుగవుతున్న నిర్మల్ కొయ్య బొమ్మల కథ నేపథ్యంలో హృదయాల్ని హత్తుకుంటుంది. ప్రతి సన్నివేశం సహజంగా సాగుతుంది. తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే సినిమా ఇది' అన్నారు. సంపూర్ణేష్‌బాబు, కృష్ణభగవాన్, చమ్మక్ చంద్ర తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: టి.సురేందర్‌రెడ్డి, సంగీతం: ఎం.ఎం.శ్రీలేఖ, ఆర్ట్: సాయి మణి, దర్శకత్వం: ప్రసాద్‌వర్మ.

# వంశీ సినిమాను గుర్తుకుతెస్తుంది


'వైతరుణి రాణా' పాటలు ఆవిష్కరణ దృశ్యం

శాంతిరాజు, దీపాలి రౌత్, అఖిల్‌ప్రియ, సోము ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వై తరుణి రాణా'. వి. అంబికావిజయ్ దర్శకుడు. బానా వెంకట కొండారెడ్డి నిర్మాత. ఎల్.ఎం. ప్రేమ్ రాయంచ, సదాచంద్ర స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. నటుడు జెమిని సురేష్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ పాటల్ని, ట్రైలర్‌ను ఆవిష్కరించారు. జెమిని సురేష్ మాట్లాడుతూ 'పెద్ద వంశీ గారి సినిమాల్లో మాదిరిగా అందమైన లొకేషన్స్‌తో పాటలు ఆహ్లాదకరంగా ఉన్నాయి. 1980 కాలం పాటి స్వరాల్ని గుర్తుకుతెస్తున్నాయి' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నమైన ప్రేమకథా చిత్రమిది. యువతరం మనోభావాలకు దర్పణంలా ఉంటుంది. మార్చిలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. కొత్తదనాన్ని కోరుకునే ప్రతి ఒక్కరిని ఈ సినిమా అలరిస్తుందని నిర్మాత అన్నారు. ఈ కార్యక్రమంలో కాశం సత్యనారాయణ, నరేంద్ర, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్, రామ్‌చరణ్

కొత్తదనాన్ని కనబరచాలంటే రొటీన్‌ను బ్రేక్ చేయాల్సిందే. నూతన మార్గాల్ని అన్వేషించాల్సిందే. మన కథానాయకులు ఇప్పుడు ఇదే సూత్రాన్ని ఫాలో అవుతున్నారు. కమర్షియల్ సినిమాలు చేస్తూనే తమ పాత్ర చిత్రణలో నవ్యత కోసం తపిస్తున్నారు. సరికొత్త మేకోవర్‌తో కొంగొత్తరీతిలో అభిమానుల్ని అలరించడానికి సిద్ధమవుతున్నారు. సహజత్వానికి, కథల్లో వైవిధ్యతకు పెద్దపీట వేస్తూ వాణిజ్యపంథాలోనే సవాళ్లకు సిద్ధపడుతున్నారు. ఈ కోవలో సీనియర్ హీరోలు మొదలుకొని యువ కథానాయకులు త్వరలో విభిన్న పాత్రలతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు.

# రొటీన్‌కు నై నవ్యతకు సై


అల్లు అర్జున్


శర్వానంద్

అగ్ర హీరోలు ఎన్టీఆర్-రామ్‌చరణ్ 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలో తొలిసారి చారిత్రక పాత్రల్లో కనిపించబోతున్నారు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ ప్రాజెక్ట్ ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇందులో తొలితరం స్వాతంత్ర్యసమరయోధులు కొమరం భీం, అల్లూరి సీతారామరాజు పాత్రల్ని ఎన్టీఆర్, రామ్‌చరణ్ పోషిస్తున్నారు. చారిత్రక ఇతివృత్తానికి కాల్పనిక అంశాల్ని జోడించి రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ హిస్టారికల్ క్యారెక్టర్స్‌లో పరిపూర్ణత కనబరచడానికి ఈ ఇద్దరు అగ్రహీరోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. లుక్స్‌పరంగా మునుపెన్నడూ లేని విధంగా వైవిధ్యతను చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సినిమా మేకప్ కోసం విదేశీ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. దాదాపు 400కోట్ల భారీ బడ్జెట్‌తో దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకులముందుకు రానుంది.

అల్లు అర్జున్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు సుకుమార్ ఓ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఇందులో పల్లెటూరి యువకుడిగా వైవిధ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు అల్లు అర్జున్. ఆయన తొలిసారి పూర్తి గ్రామీణ నేపథ్యంలో నటిస్తున్న చిత్రమిదే కావడం విశేషం. ఎర్రచందనం స్మగ్లింగ్ కథాంశంతో చిత్తూరు నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని చెబుతున్నారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ లారీ డ్రైవర్ పాత్రలో కనిపిస్తారని సమాచారం. వాస్తవికతకు పెద్దపీట వేస్తూ సహజత్వాన్ని ప్రతిబింబించేలా దర్శకుడు సుకుమార్..బన్నీ పాత్రను డిజైన్ చేశారని చెబుతున్నారు. రా లుక్‌లో తీవ్ర ఉద్వేగాల కలబోతగా అల్లు అర్జున్ పాత్ర సాగుతుందని అంటున్నారు. త్వరలో ఈ సినిమా తాజా షెడ్యూల్ కేరళలోని వాయనాడ్‌లో ప్రారంభం కానుంది.

ప్రేమ, కుటుంబ కథల్లో ఒదిగిపోయిన శర్వానంద్ మొదటిసారి రైతుగా కనిపించబోతున్నారు. ఆయన కథానాయకుడిగా కిషోర్.బి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'శ్రీకారం'. వ్యవసాయం, రైతుల గొప్పతనంతో ఈ సినిమా తెరకెక్కుతున్నది. వ్యవసాయంపై మక్కువతో విదేశాల నుంచి వచ్చే వ్యక్తిగా శర్వానంద్ పాత్ర వినూత్న పంథాలో ప్రయోగాత్మకంగా సాగనున్నట్లు సమాచారం. భుజంపై కండువాతో లుంగీలో ఇటీవల విడుదలచేసిన ఆయన ఫస్ట్‌లుక్ అభిమానుల్ని ఆకట్టుకుంటున్నది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా అతడు ఈ సినిమాలో కనిపించబోతున్నట్లు సమాచారం.

నితిన్ తొలిసారి అంధుడిగా అవతారం ఎత్తనున్నారు. చీకటిప్రపంచంలో తనకు ఎదురైన అవరోధాల్ని ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్‌లో విమర్శకుల ప్రశంసలతో పాటు జాతీయ పురస్కారాన్ని అందుకున్న 'అంధాధూన్' చిత్ర తెలుగు రీమేక్‌లో ఆయన కథానాయకుడిగా నటించబోతున్నారు. సోమవారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. అంధుడైన పియానో ప్లేయర్ జీవితగమనంలో ఎదురైన అనూహ్య పరిణామాలతో ఈ సినిమా రూపొందనున్నది. అంధుడి పాత్రను ఛాలెంజింగ్‌గా భావించి నితిన్ ఈ సినిమా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నట్లు సమాచారం. ప్రయోగాత్మక కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు.

గోపీచంద్ కబడ్డీ శిక్షకుడిగా కనిపించనున్నారు. మహిళా కబడ్డీ టీమ్‌ను విజయపథంలో నడిపించే మార్గదర్శకుడిగా వెండితెరపై అలరించబోతున్నారు. 'గౌతమ్‌నందా' తర్వాత గోపీచంద్, దర్శకుడు సంపత్ నంది కలయికలో రూపొందుతున్న చిత్రం 'సీటీమార్'. క్రీడా నేపథ్య కథాంశంతో కెరీర్‌లో తొలిసారి గోపీచంద్ నటిస్తున్న సినిమా ఇది. ఇందులో ఆంధ్రా మహిళాటీమ్‌కు కోచ్‌గా సరికొత్త పాత్రలో ఆయన నటిస్తున్నారు. తన పంథాకు భిన్నంగా చేస్తున్న ఈ పాత్ర కోసం గోపీచంద్ ప్రత్యేక శిక్షణ తీసుకొని నటిస్తున్నారు.


హాకీ క్రీడాకారుడిగా అభిమానుల్ని అలరించేందుకు సిద్ధమయ్యారు సందీప్‌కిషన్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'ఏ1 ఎక్స్‌ప్రెస్'. హాకీ క్రీడాకారుడి జీవితగమనంలో ఎదురైన ఎత్తుపల్లాలతో రూపొందుతున్న ఈ సినిమాలో సందీప్ కిషన్ పాత్ర సవాళ్లతో కూడి ఉంటుందని తెలిసింది. ఈ సినిమా కోసం సందీప్‌కిషన్ హాకీ క్రీడలో శిక్షణ తీసుకున్నారు.

ఇక అఘోరా జీవితాల్ని కళ్లకు కట్టినట్లుగా చూపించబోతున్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నది. ఈసినిమాలో అఘోరాగా, ఓ శక్తివంతమైన వ్యక్తిగా భిన్న పార్శ్వాలు ఉన్న పాత్రలో బాలకృష్ణ కనిపించబోతున్నారు.


చిరంజీవి

సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎన్నో మరపురాని పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసిన చిరంజీవి తొలిసారి నక్సలైటుగా వెండితెరపై కనిపించబోతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్నది. సామాజిక ఇతివృత్తానికి వాణిజ్య హంగులను మేళవిస్తూ రూపొందుతున్న ఈ చిత్రంలో చిరంజీవి విప్లవకారుడిగా శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నట్లు చెబుతున్నారు. భిన్న పార్శ్వాలతో విలక్షణ పంథాలో ఆయన పాత్ర సాగుతుందని సమాచారం. ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. ఇందులో రామ్‌చరణ్ ఓ కీలక పాత్రను పోషించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

న్యాయాన్ని కాపాడే నిజాయితీపరుడైన లాయర్‌గా తొలిసారి అభిమానుల్ని ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు పవన్‌కల్యాణ్. బాలీవుడ్ చిత్రం 'పింక్' ఆధారంగా పవన్‌కల్యాణ్ హీరోగా తెలుగులో ఓ సినిమా తెరకెక్కుతున్నది. శ్రీరామ్‌వేణు దర్శకత్వం వహిస్తున్నారు. తమపై అన్యాయంగా ఆరోపించబడిన నేరం నుంచి ముగ్గురు యువతుల్ని ఓ లాయర్ ఎలా రక్షించాడనే పాయింట్‌తో ఈ సినిమా తెరకెక్కుతున్నది. లాయర్‌గా పవన్‌కల్యాణ్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం.


రామ్

'ఇస్మార్ట్‌శంకర్'తో కెరీర్‌లో పెద్ద విజయాన్ని అందుకున్నారు రామ్. ఈ సినిమా తర్వాత కథల ఎంపికలో తన పంథాను మార్చిన ఆయన కెరీర్‌లో తొలిసారి ద్విపాత్రాభినయం చేయబోతున్నారు. రామ్ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రెడ్'. ఒకే పోలికలతో ఉన్న ఇద్దరు వ్యక్తుల కథతో మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతున్నది. క్లాస్, మాస్ లుక్‌లతో భిన్న పార్శ్వాలతో రామ్ ఈ సినిమాలో కనిపించబోతున్నట్లు సమాచారం. గడ్డంతో రఫ్‌లుక్‌లో ఓ పాత్రలో కనిపిస్తుండగా, కళ్లద్దాలు ధరించి క్లాస్‌గా మరో క్యారెక్టర్‌లో దర్శనమిచ్చి ఆకట్టుకుంటున్నారు. హీరోగా రామ్‌ను కొత్త పంథాలో ఆవిష్కరించే సినిమా ఇదని చిత్ర బృందం విశ్వాసాన్ని వ్యక్తంచేస్తున్నది.


రానా

'బాహుబలి' చిత్రంలో భల్లాలదేవ పాత్ర ద్వారా దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకట్టుకున్నారు రానా. పాత్రలపరంగా ప్రయోగాలకు, కొత్తదనం కనబరచడానికి ఎప్పుడూ ముందుంటారాయన. రానా కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అరణ్య'. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోంది. ప్రభు సాల్మన్ దర్శకుడు. హిందీలో 'హాథీ మేరీ సాథీ' పేరుతో తెరకెక్కుతోంది. ఈ సినిమాలో రానా బాణదేవ్ అనే అడవి మనిషి పాత్రలో కనిపించబోతున్నాడు. అస్సాంలోని కజిరంగా ప్రాంతంలో ఏనుగుల ఆవాసాన్ని మనుషులు అక్రమంగా కబ్జా చేసిన సంఘటనల్ని ఆధారం చేసుకొని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ, ప్రకృతిని కాపాడుకోవాలనే సందేశాత్మక ఇతివృత్తమని చిత్రబృందం చెబుతోంది. ఏనుగులతో పాటు వన్యప్రాణుల్ని కాపాడటానికి బాణదేవ్ ఎలాంటి పోరాటం చేశాడన్నది ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ పాత్రకోసం రానా 30కిలోల బరువు తగ్గారు. కఠినమైన ఆహారనియమాలతో ఆయన ఈ లుక్‌ను సంతరించుకున్నారు. బాగా పెరిగిన గడ్డం, నెరిసిన జుట్టుతో ఆయన పాత్ర సహజత్వాన్ని ప్రతిబింబిస్తూ కనిపిస్తోంది. ఇదివరకే విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభిస్తోంది. తన కెరీర్‌లోనే పూర్తి భిన్నమైన పాత్ర ఇదని రానా సినిమా సినిమా విజయంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 2న ఈ చిత్రం ప్రేక్షకులముందుకురానుంది.


నాని

నాని తొలిసారి తనలోని విలనిజాన్ని పూర్తిస్థాయిలో వెండితెరపై ఆవిష్కరించేందుకు రెడీ అవుతున్నారు. నాని కథానాయకుడిగా మోహన్‌కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వి'. ఈ సినిమాలో రాక్షసుడిలాంటి మనస్తత్వమున్న వ్యక్తిగా ప్రతినాయకఛాయలున్న పాత్రలో నాని కనిపించబోతున్నారు. గడ్డం, మెలితిరిగిన మీసాలతో మాస్ లుక్‌లో ప్రచార చిత్రాల్లో కనిపించారు. ఈ సినిమాలో సీరియల్ కిల్లర్‌గా నాని పాత్ర ఆసక్తికరంగా సాగుతుందని సమాచారం.గతంలో 'జెండాపై కపిరాజు' 'జెంటిల్‌మెన్' చిత్రాల్లో నాని నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించారు. ఫుల్‌లెంగ్త్ ప్రతినాయక పాత్రలో కనిపించడం ఇదే తొలిసారని అభిమానులు చెబుతున్నారు.

# ఉద్యమంలా గ్రీన్‌చాలెంజ్


హరితహారంపై అర్జున్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన వీడియోలోని దృశ్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'పచ్చదనంలో నిండుదనం' అన్న నినాదంతో రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ నేతృత్వంలో చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ జోరుగా కొనసాగుతున్నది. దేశ, విదేశాల్లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు గ్రీన్‌చాలెంజ్‌లో ఉత్సాహంగా మొక్కలు నాటుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కొండాపూర్ టెంపుల్‌పార్క్‌లో సింక్రోని ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ హెడ్ వెంకట్ టంకశాల మొక్కలునాటారు. ఆయన దేవరాజన్ దివ్య, సంధ్యారాణి కానేగంటి, మమూరి పట్నాల, సూజీ బూర్లకు గ్రీన్‌చాలెంజ్ విసిరారు. న్యూజిలాండ్ దేశంలో స్థిరపడి, కెల్‌స్టోన్ పార్లమెంటరీ నియోజకవర్గ జాతీయ పార్టీ చైర్‌పర్సన్ స్థాయికి ఎదిగిన హైదరాబాద్‌కు చెందిన బీరం బాలవేణుగోపాల్‌రెడ్డి ఆక్లాండ్‌లోని తన స్వగృహం ఆవరణలో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తన కూతురు త్రిషారెడ్డికి అప్పగించారు. ఇటీవల తాను హైదరాబాద్ వెళ్లినప్పుడు గ్రీన్‌చాలెంజ్ కార్యక్రమాన్ని చూసి స్ఫూర్తిని పొందానని, కీసరగుట్ట ప్రాంతం అరకును తలపిస్తున్నదని పేర్కొన్నారు.

### హీరో అర్జున్ వీడియో వైరల్

సినీహీరో అర్జున్ మొక్కలు నాటి తెలంగాణకు హరితహారం ఫేస్‌బుక్ పేజీలో పోస్ట్‌చేసిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రతిఒక్కరూ మొక్కలునాటి కన్నబిడ్డల్లా కాపాడాలని ఆయన ఇచ్చిన సందేశం స్ఫూర్తిగా నిలుస్తున్నది. ధర్మో రక్షతి రక్షితః అన్న రీతిలో వృక్షో రక్షతి రక్షితః అన్న సూక్తితో నలభై సెకన్ల నిడివితో ఉన్న వీడియో క్లిప్పింగ్‌కు మంచి ఆదరణ లభించింది. రెండురోజుల్లోనే ఈ వీడియోను ఐదున్నరలక్షల మంది వీక్షించగా, సుమారు 5,300 మంది షేర్‌చేశారు.


కొండాపూర్‌లో మొక్కలు నాటుతున్న సింక్రోని ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ హెడ్ వెంకట్

## జములమ్మ ఆలయాన్ని అభివృద్ధిచేస్తాం

- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భరోసా


జములమ్మ సన్నిధిలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాలరూరల్:** నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ ఆలయాన్ని పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం సమీపంలోని జములమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది వేదపండితులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జోగుళాంబ, జములమ్మ ఆలయాలకు ఎంతో మహిమ ఉన్నందున తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంతోమంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత భద్రాద్రి, మన్యంకొండ తదితర ఆలయాలను అభివృద్ధి చేశామని, త్వరలోనే జోగుళాంబ, జములమ్మ ఆలయాలను కూడా అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ముందుగా మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎంపీపీ ప్రతాపగౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్, తిమ్మారెడ్డి, కౌన్సిలర్లు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

## కాచిగూడ-నిజామాబాద్ రైలు పాక్షిక రద్దు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాచిగూడ-నిజామాబాద్ రైలును ఈ నెల 25 నుంచి మార్చి మూడు వరకు కామారెడ్డి-నిజామాబాద్ మధ్య పాక్షికంగా రద్దుచేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటించింది. నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.

## 1 నుంచి రాములోరి కల్యాణ టికెట్ల విక్రయం

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో మార్చి 25 నుంచి ఏప్రిల్ ఎనిమిది వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ రెండున రాములోరి కల్యాణం, మూడున మహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలను వీక్షించేందుకు రూ.5వేలు, రూ.2వేలు, రూ.1,116, రూ.500, రూ.200, రూ.100 విలువైన సెక్టార్ టికెట్లు మార్చి ఒకటినుంచి ఆన్‌లైన్‌లో విక్రయించనున్నట్టు దేవస్థానం ఈవో అధికారి జీ నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్లను www.bhadrachalamonline.com ద్వారా పొందవచ్చునని సూచించారు.

# త్వరలో మెట్రో రెండోదశ విస్తరణ

- 62 కిలోమీటర్ల డీపీఆర్ సమర్పించిన డీఎంఆర్సీ
- కొత్తమార్గాలకు సన్నాహాలు
- ఇతర మెట్రోచార్జీలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే తక్కువ
- మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి


మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మెట్రోరైలు మొదటిదశ పూర్తికావడంతో రాష్ట్ర ప్రభుత్వం రెండోదశపై దృష్టి సారించింది. కొత్తమార్గాల్లో రెండోదశను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నది. ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్ (డీఎంఆర్సీ) 62 కిలోమీటర్ల మార్గానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను సమర్పించిందని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. బేగంపేటలోని మెట్రోరైల్‌భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రెండోదశలో భాగంగా బీహెచ్‌ఈఎల్, హఫీజ్‌పేట్, కొండాపూర్, గచ్చిబౌలి, రేతిబౌలి, మెహిదీపట్నం, మాసాబ్‌ట్యాంక్, లక్డీకాపూల్ వరకు 31 కి.మీ. మార్గాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. ఎల్బీనగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు వయా ఇన్నర్‌రింగ్‌రోడ్డు, ఒవైసీ హాస్పిటల్, సైదాబాద్, ఫలక్‌నుమా మీదుగా మరో మార్గాన్ని నిర్మించనున్నామని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకుగల ఐదు కిలోమీటర్ల మార్గాన్ని కూడా కలుపుతామని తెలిపారు. ఎలివేటెడ్ మెట్రోరైలు నిర్మించడానికి కిలోమీటరుకు రూ.300 కోట్ల చొప్పున ఖర్చవుతుందని చెప్పారు. మంత్రి కేటీఆర్ సూచనల మేరకు నిర్మాణవ్యయాన్ని తగ్గించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పాతబస్తీలో పెండింగ్‌లో ఉన్న మెట్రోప్రాజెక్టు పనుల అంశం సీఎం కేసీఆర్ దృష్టిలో ఉందని, భూసేకరణ పూర్తయిన వెంటనే అక్కడ పనులు చేపడుతామని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు.

### బ్రేక్‌ఈవెన్‌కు వచ్చాం

మెట్రోరైలు నిర్వహణపరంగా బ్రేక్‌ఈవెన్‌కు చేరిందని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ప్రతినెల రూ.40 కోట్ల ఆదాయం వస్తున్నదన్నారు. సగటున రోజుకు కోటి చొప్పున నెలకు రూ.30 కోట్లు ప్రయాణికుల టికెట్ల ద్వారా వస్తున్నదని చెప్పారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నందున అవసరమైతే రైళ్లవేగం పెంచేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రస్తుతం 55 రైళ్లు రోజూ వెయ్యి ట్రిప్పులు నడుస్తున్నాయని చెప్పారు. మరో పది రోజుల్లో రెండు అదనపు రైళ్లను అందుబాటులోకి తెస్తామన్నారు. సీఎంఆర్‌ఎస్ అనుమతులు వచ్చిన వెంటనే అమీర్‌పేట్, రాయదుర్గం మార్గంలో రైళ్లవేగం పెంచుతామని తెలిపారు. మెట్టుగూడ-రాయదుర్గం, మియాపూర్-ఎంజీబీఎస్, అమీర్‌పేట-రాయదుర్గం మార్గంలో అదనపు రైళ్లను నడుపుతున్నామని చెప్పారు. ఇతర మెట్రోలతో పోలిస్తే హైదరాబాద్ మెట్రో చార్జీలు తక్కువగా ఉన్నాయని ఒక ప్రశ్నకు బదులుగా ఎన్వీఎస్‌రెడ్డి చెప్పారు. చాలామంది 8 నుంచి 12 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేస్తున్నారని, ఇందుకు రూ.40 టికెట్ ధర చెల్లిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మెట్రోకు 269 ఎకరాలు కేటాయించిందని చెప్పారు.

### తిరుమల మార్గాన్ని పరిశీలించాం

తిరుపతి నుంచి తిరుమల వరకు మెట్రోరైలు నిర్మాణంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతిపాదన ఉందని, దీనికి సంబంధించి ప్రాథమిక పరిశీలన చేశామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అక్కడ మెట్రో మార్గం నిర్మాణానికి అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. అక్కడ అటవీ ప్రాంతంతోపాటు వనజీవులు ఉన్నాయని తెలిపారు.

## అమెరికాలో హైదరాబాద్ దంపతుల దుర్మరణం


- ఏపీ వ్యక్తికూడా మృత్యువాత
- తల్లిదండ్రుల మృతితో అనాథగా మిగిలిన చిన్నారి రియా
- చావులోనూ వీడని స్నేహబంధం


దంపతులు దివ్య, రాజా, మిత్రుడు ప్రేమ్ (ఫైల్)

**దోమలగూడ:** అమెరికాలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలుగువారు మృతిచెందారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన దంపతులు, గుంటూరు చెందిన మరోవ్యక్తి ఉన్నారు. ముషీరాబాద్ గాంధీనగర్‌లోని జగదాంబ అపార్ట్‌మెంట్స్‌లో నివసించే ఆవుల గౌతమ్, శివలీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఒకరైన దివ్య (33)కు మలేషియన్ టౌన్‌షిప్‌కు చెందిన రాజా గవిని (40)తో 2007లో వివాహమైంది. ప్రస్తుతం వీరు డల్లాస్‌లోని ఫ్రిస్కోలో నివసిస్తున్నారు. 2వ తరగతి చదువుతున్న వీరి ఏడేండ్ల కుమార్తె రియాను సోమవారం సాయంత్రం డాన్స్ క్లాస్‌లో వదిలారు. తర్వాత దివ్య, రాజా కలిసి తమ మిత్రుడు ప్రేమ్‌తో కారులో ప్రయాణిస్తుండగా ఓ ట్రక్కు వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం ఉదయం సమాచారం అందింది. దివ్య అమెరికాలోని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తుండగా.. రాజా, ప్రేమ్ వెల్స్‌ఫార్గోలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో రియా అనాథగా మారింది. చదువుకునే సమయం నుంచే రాజా, ప్రేమ్ మిత్రులని, అమెరికాలో వీరు ఒకేచోట ఉంటారని దివ్య తండ్రి గౌతమ్ వెల్లడించారు. అమెరికాలో అన్ని లాంఛనాలు పూర్తయిన తర్వాత మృతదేహాలను భారత్‌కు తరలించనునట్లు అక్కడి పోలీసులు తమకు సమాచారం ఇచ్చారని గౌతమ్ తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే సంజీవరావు కన్నుమూత

- కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న టీఆర్‌ఎస్ నేత
- గేటువనంపల్లిలో నేడు అంత్యక్రియలు
- సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి


సంజీవరావు (ఫైల్)

**వికారాబాద్, నమస్తే తెలంగాణ:** వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే సంజీవరావు (67) మంగళవారం మధ్యాహ్నం కన్నుమూశారు. అనారోగ్యంతో సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేరిన ఆయన చికిత్స తీసుకుంటుండగానే గుండెపోటురావడంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. బుధవారం ఆయన స్వగ్రామమైన గేటువనంపల్లిలో అంత్యక్రియలు జరుగనున్నాయి. సంజీవరావు ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంజీవరావు కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. 2014లో టీఆర్‌ఎస్ తరపున వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సంజీవరావు 2018 వరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశారు. ఆయన మృతి వార్త తెలియగానే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల, వికారాబాద్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మెతుకు ఆనంద్, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు నిమ్స్ దవాఖానకు చేరుకొని నివాళులర్పించారు. సంజీవరావు మృతి పట్ల శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంజీవరావు భౌతికకాయాన్ని బుధవారం ఉదయం 10 గంటల నుంచి వికారాబాద్‌లోని మెథడిస్టు చర్చిలో ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. మధ్యాహ్నం 2 గంటలకు గేటువనంపల్లికి తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## ఆడపిల్ల పుట్టిందని.. మగబిడ్డను ఎత్తుకొచ్చాడు!

- పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ తండ్రి దారుణం
- సీసీటీవీ ఫుటేజీ సాయంతో నిందితుల పట్టివేత
- గాంధీ దవాఖానలో ఘటన


బాలుడిని అపహరించిన నిందితుడు, సహకరించిన మహిళ

**బన్సీలాల్‌పేట:** ఆడపిల్ల పుట్టడం ఇష్టంలేని ఓ తండ్రి.. ఆ పక్కనే ఉన్న మగబిడ్డను ఎత్తుకెళ్లాడు. చివరకు సీసీటీవీ ఫుటేజీకి చిక్కి గంటల వ్యవధిలోనే కటకటాలపాలయ్యాడు. గాంధీ దవాఖానలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. పశ్చిమబెంగాల్‌కు చెందిన మంజిత్‌నాయక్ (27), సరితనాయక్ దంపతులు కొన్నేండ్ల కిందట హైదరాబాద్‌కు వచ్చి మల్లాపూర్‌లో స్థిరపడ్డారు. ప్రసవం కోసం సరిత సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో చేరగా రెండ్రోజుల కిందట ఆమెకు ఆడపిల్ల పుట్టింది. పాప ఆరోగ్యంగా లేకపోవడంతో నియోనాటల్ ఐసీయూలోనిఇంక్యుబేటర్‌లో ఉంచారు. ఆడపిల్ల అంటే ఇష్టంలేని మంజిత్‌నాయక్.. స్నేహితుడి భార్య సాయంతో పక్కబాక్సులో ఉన్న మగశిశువును ఎత్తుకెళ్లాలని పథకం వేశాడు. ఐసీయూలోకి వెళ్లిన మంజిత్‌నాయక్.. పిల్లాడికి పాలివ్వాలని తన భార్య కోరిందని నర్సుకు చెప్పి, మరో బాక్స్‌లో ఉన్న మగశిశువును తీసుకెళ్లి సరిత వద్ద పడుకోబెట్టాడు. తన మగబిడ్డను చూసేందుకు వచ్చిన హైదరాబాద్ సంతోష్‌నగర్‌కు చెందిన సూఫియాభాను అక్కడ ఆడశిశువు ఉండటం చూసి బోరున ఏడుస్తూ కుప్పకూలిపోయింది. వైద్యులు, అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా మంజిత్‌నాయక్, మరో మహిళ కలిసి బాబును తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. వాటిని ఫొటోలుగా మార్చి గాంధీ దవాఖాన సెక్యూరిటీ వాట్సప్ గ్రూపుల్లో పెట్టగా, మెటర్నిటీ వార్డులోనే నిందితులు ఉన్నట్టు గుర్తించారు. దవాఖాన సూపరింటెండెంట్.. చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసి, నిందితులను అప్పగించారు.

## నయీం ఇంటిగోడకు ఐటీ నోటీసులు

**భువనగిరి అర్బన్:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన గ్యాంగ్‌స్టర్ నయీం కుటుంబసభ్యులకు ఆదాయం పన్నుశాఖ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకోవడానికి వారు అందుబాటులో లేకపోవడంతో అధికారులు భువనగిరిలోని ఖాజీ మహల్ల చౌరస్తా సమీపంలో ఉన్న నయీం ఇంటిగోడకు ఆ నోటీసులను అతికించారు. నయీం తల్లి తాహెరా బేగం, భార్య హసీనాబేగం, మేనకోడలు సలీమాబేగం, ప్రధాన అనుచరుడు పాశం శ్రీనుకు ఈ నోటీసులు జారీ అయ్యాయి. పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన నయీంపై అనేక భూకబ్జా కేసులు ఉన్న సంగతి తెలిసిందే. బలవంతంగా ఆక్రమించిన, బెదిరించి లాక్కున్న భూములు, ప్లాట్లను నయీం తన అనుచరులు, కుటుంబ సభ్యుల పేరున రిజిస్ట్రేషన్ చేయించాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దురాక్రమణలపై కేసులు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. భువనగిరి మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఓ వ్యక్తికి చెందిన 16 ఎకరాల భూమిని వేర్వేరు వ్యక్తుల పేరున నయీం రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆ బినామీల పేర్లు చెప్పాలని కోరుతూ నయీం కుటుంబసభ్యులు, అనుచరులకు ఐటీ అధికారులు సెక్షన్24(1) కింద నోటీసులు జారీ చేశారు.


నాగార్జునసాగర్‌లో ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణానది యాజమాన్యబోర్డు చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్

## సాగర్‌ను సందర్శించిన కృష్ణానది యాజమాన్య బోర్డు చైర్మన్

**నందికొండ:** కృష్ణానది యాజమాన్యబోర్డు చైర్మన్ చంద్రశేఖర్‌అయ్యర్ మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. సాగర్ డ్యాం, గ్యాలరీ, క్రస్ట్ గేట్లు, ఎడమ, కుడికాల్వలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. డ్యాంలోకి చేరుతున్న నీటిని ఎలా వినియోగిస్తున్నారనే విషయాన్ని ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి నీటిని ఏవిధంగా వినియోగిస్తున్నారు.. రివర్సబుల్ పంపింగ్ విధానంలో ఎంతనీటిని వాడుతున్నారు.. టెయిల్‌పాండ్ డ్యాం నుంచి డ్యాం వరకు ఎంతనీరు నిల్వ ఉంటుంది, డ్యాం డెడ్‌స్టోరేజ్ నీటి నిల్వఎంత.. ఆ పరిస్థితిలో తాగునీటి అవసరాలకు ఏం చేస్తారు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత విజయవిహార్ హోటల్‌కు చేరుకున్న ఆయనకు తెలంగాణ, ఆంధ్రా ఇరిగేషన్ అధికారులు స్వాగతం పలికారు. ఆయనవెంట డ్యాం సీఈ జలంధర్, ఎస్ఈ పురుషోత్తం గంగరాజు, ఈఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసులరెడ్డి, సుభాష్‌చంద్రారెడ్డి, డీఈలు తదితరులు ఉన్నారు.

# నాగమణి.. దుర్గామాత పేరిట టోపీ!

- ఇత్తడి విగ్రహాన్ని పంచలోహం పేరుతో విక్రయించే యత్నం
- దీనిని పూజిస్తే వ్యాపారం వృద్ధిచెందుతుందని ప్రచారం
- రూ. కోటికి అమ్మబోతూ పోలీసులకు పట్టుబడ్డ ముఠా


మీడియా సమావేశంలో దుర్గామాత విగ్రహాన్ని చూపుతున్న సీపీ అంజనీకుమార్

**హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ:** పంచలోహాలతో చేసిన దుర్గామాత విగ్రహం చేతిలో నాగమణి రాయిని పెట్టి పూజిస్తే.. వ్యాపా రం దినదినాభివృద్ధి చెందుతుందంటూ నమ్మిం చి, ఇత్తడి విగ్రహాన్ని కోటి రూపాయలకు విక్రయించేందుకు ప్రయత్నించిన ఓ ముఠాను హైదరాబాద్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లుతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. మూడేండ్ల క్రితం ముంబైకి వెళ్లిన సందర్భంలో జియాగూడ ప్రాంతానికి చెందిన బీ దేవేందర్ అలియాస్ దేవ గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి నాగమణి (నల్లటిరాయి) కొనుగోలుచేశాడు. దేవకు ఇటీవల కూకట్‌పల్లిలో నివసిస్తున్న వంట మనుషులు టీ జాన్ (పశ్చిమగోదావరి జిల్లా), దుర్గా ప్రసాద్ (కాకినాడ)తో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తన వద్ద ఉన్న నాగమణిని, పంచలోహాలతో తయారుచేసిన దుర్గామాత విగ్రహంతో కలిపి పూజిస్తే వ్యాపారం అభివృద్ధి చెందుతుందని దేవ వారిని నమ్మించాడు. కొనుగోలుదారుడిని చూపిస్తే.. మంచి కమిషన్ ఇస్తానని ఆశ పెట్టాడు. వీరికి కార్వాన్‌కు చెందిన అష్రఫ్, హైదరాబాద్‌లో ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రేమ్‌చంద్‌గుప్తా జత కలిశారు. ఈ ఐదుగురు కలిసి కొనుగోలుదారుడి కోసం అన్వేషించారు.

### ఇత్తడితో చేసిన విగ్రహం

మంగళవారం జియాగూడ ప్రాంతంలో విగ్రహాన్ని విక్రయించేందుకు యత్నిస్తూ.. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు బృందానికి చిక్కారు. వారి వద్ద ఉన్న విగ్రహాన్ని పరిశీలించగా అది పంచలోహ విగ్రహంకాదని, ఇత్తడి విగ్రహమని తేలింది. కాకినాడలో తయారుచేయించిన ఈ విగ్రహాన్నే పంచలోహ విగ్రహంగా నమ్మించి, నాగమణితో కలిసి రూ. కోటికి విక్రయించాలని వ్యూహం పన్నినట్టు నిందితులు చెప్పారు. విగ్రహంతోపాటు నల్లటిరాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొన్న పోలీసులు ప్రధాన సూత్రధారి దేవేందర్, టీ జాన్, అష్రఫ్, ప్రేమ్‌చంద్‌గుప్తాను అరెస్ట్‌చేశారు. కేసు తదుపరి దర్యాప్తును కుల్సుంపురా పోలీసులకు అప్పగించారు.

## జాస్తి కృష్ణకిశోర్ సస్పెన్షన్ రద్దు

- కేంద్ర సర్వీసులకు వెళ్లనివ్వాలని ఏపీకి క్యాట్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ ఐఆర్‌ఎస్ అధికారి జాస్తి కృష్ణకిశోర్ సస్పెన్షన్‌ను కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) రద్దుచేసింది. ఆయన తిరిగి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు అనుమతిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కృష్ణకిశోర్‌పై ఉన్న కేసును ఏపీ ప్రభుత్వం చట్టప్రకారం పరిశీలించుకోవచ్చని సూచించింది. గతంలో ఏపీ ఆర్థిక అభివృద్ధి మండలి సీఈవోగా కృష్ణకిశోర్ పనిచేసినప్పుడు అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు రావడంతో ఏపీ ప్రభుత్వం సస్పెండ్‌చేసింది. దీనిపై ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు.

### ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌పై క్యాట్‌లో విచారణ

ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెం కటేశ్వరరావు సస్పెన్షన్ వ్యవహారంలో మంగళవారం క్యాట్‌లో విచారణ జరిగింది. ఏపీ సర్కారు తనను సస్పెండ్‌చేయడాన్ని సవాల్‌చేస్తూ ఆయన క్యాట్‌ను ఆశ్రయించడంతో ప్రభుత్వం తరపు న్యాయవాది కౌంటర్ దాఖలుచేశారు. దీనిపై వెంకటేశ్వరరావు తరపు న్యా యవాది ఓ అఫిడవిట్ దాఖలుచేశారు. కనీస విచారణ లేకుండా తనను సస్పెండ్‌చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న క్యాట్ కేసు తదుపరి విచారణను మార్చి ఆరో తేదీకి వాయిదా వేసింది.

## మహిళా కండక్టర్‌పై దాడి.. డ్రెస్ చించివేత

- ఏపీలోని చిత్తూరు జిల్లాలో ఘటన

**చిత్తూరు:** విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్‌పై ఓ ప్రయాణికుడు దాడిచేసి డ్రెస్ చించివేశాడు. ఈ ఘటన మంగళవారం ఏపీలోని చిత్తూరు జిల్లాలో గుర్రంకొండ తరికొండల మధ్య తిరిగే మదనపల్లి డిపో బస్సులో చోటుచేసుకుంది. టికెట్ ఎందుకు తీసుకోలేదని అడిగిన మహిళా కండక్టర్‌పై శివారెడ్డి అనే ప్రయాణికుడు దాడికి పాల్పడ్డాడు. ఆమె వేసుకున్న ఖాకీ అంగి చించివేశాడు. డ్రైవర్, ప్రయాణికులు అడ్డుకున్నా లెక్కచేయకుండా అందరి సమక్షంలోనే కండక్టర్‌పై దాష్టీకం ప్రదర్శించాడు. వారంతా అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

## విధాన నిర్ణయాల్లో హైకోర్టు జోక్యం చేసుకోవచ్చా?

- ప్రభుత్వ విధానాలను సాధారణ వ్యక్తులు సవాల్ చేయగలరా?
- సచివాలయం అంశంలో అడ్వకేట్ జనరల్ ప్రశ్నలు
- ఏజే ప్రశ్నలపై విచారించేందుకు అంగీకరించిన హైకోర్టు ధర్మాసనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమీకృత నూతన సచివాలయం నిర్మాణ అంశాన్ని హైకోర్టు ఎదుట రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మరో మారు ప్రస్తావించింది. కోర్టు ప్రారంభ సమయంలో అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ ఈ అంశాన్ని చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట లేవనెత్తారు. సచివాలయం కూల్చివేత, డిజైన్లు, బడ్జెట్ తదితర అంశాలపై క్యాబినెట్ నిర్ణయం తీసుకొనేవరకు ప్రస్తుత సచివాలయ భవనాలను కూల్చడానికి వీల్లేదని పేర్కొంటూ హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తేయాలని విజ్ఞప్తిచేశారు. నూతన సచివాలయ భవనం నిర్మాణంకోసం ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖలు ప్రస్తుత భవనాలను ఖాళీ చేశాయని ధర్మాసనానికి గుర్తుచేశారు. ఈ దశలో స్టే విధించడం వల్ల ప్రభుత్వం ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వ విధాననిర్ణయాల్లో కోర్టులు జోక్యంచేసుకోవడానికి ఉన్న పరిధి చాలా చాలా తక్కువ అని, హైకోర్టుకు ఉన్న పరిధి ఎంత అనేదానిపై మొదట విచారణ జరుపాలని పేర్కొన్నారు. సాధారణ పౌరు లు ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చే యవచ్చా? లేదా? చేస్తే ఆయా పిటిషన్ల విచారణార్హత ఎంత? అనే అంశాలను ముందు తేల్చాలని ధర్మాసనానికి విజ్ఞప్తిచేశారు. అడ్వకేట్ జనరల్ పేర్కొన్న అంశాలపై విచారించేందుకు ధర్మాసనం అంగీకరించింది. తదుపరి విచారణను మార్చి మూడుకు వాయిదా వేసింది.

## గుప్తనిధులు తవ్వే ముఠా అరెస్టు

**పెంచికల్‌పేట్:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం పోతెపల్లిలో గుప్తనిధులు తవ్వే ముఠాను పోలీసులు అరెస్టుచేశారు. గ్రామ సమీపంలోని ఉచ్చమల్లివాగు ఒడ్డున వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ముఠాను గ్రామస్థులు సర్పంచ్‌సాయంలో పట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షుద్రపూజలకు ఉపయోగించిన సామగ్రిని, ఎనిమిది సెల్‌ఫోన్లు, రూ.22 వేల నగదు, డిటెక్టరీ యంత్రం, కారు, బైక్‌తోపాటు ముఠా సభ్యులైన ఎనిమిది మందిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


గంగదేవిపల్లిలో పర్యటిస్తున్న అమెరికా రాయబారి కార్యాలయ అధికారులు

## గంగదేవిపల్లిని సందర్శించిన అమెరికా రాయబారి బృందం

**గీసుగొండ:** వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఆదర్శగ్రామమైన గంగదేవిపల్లిని మంగళవారం అమెరికా రాయబార కార్యాలయ అధికారులు జోయెల్‌సిఫ్ మెన్, జాన్‌డ్రిగిబ్బన్ సందర్శించారు. బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు గ్రామాన్ని సందర్శించారు. వారికి స్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతర గ్రామంలో తిరిగి గ్రామాభివృద్ధిని పరిశీలించారు. స్థానిక సర్పంచ్ గోనె మల్లారెడ్డి వారికి ఆదర్శ గ్రామం గురించి వివరించారు.

## ఎన్పీఆర్ లేఖ ఎందుకు?

- కేవైసీలో భాగంగా ఎన్పీఆర్ లేఖను ఎస్బీఐ కోరడంపై హైకోర్టులో పిల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేవైసీ (నో యువర్ కస్టమర్) సేకరణలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తమ ఖాతాదారులను జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్పీఆర్) జారీచేసే లేఖను సమర్పించాలని కోరడాన్ని సవాల్‌చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు వంటి పత్రాలతోపాటు ఎన్పీఆర్ జారీచేసిన లేఖను కోరడాన్ని పిటిషనర్ తప్పుబట్టారు. దేశంలో ఇంకా ఎన్పీఆర్ ప్రక్రియ మొదలుకాకముందే లేఖను కోరడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. పత్రాలు సమర్పించకపోతే ఖాతాలు నిలిపేస్తామని ఎస్బీఐ ఆ ప్రకటనలో పేర్కొన్నదని గుర్తుచేశారు. కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ, ఆర్థికశాఖ కార్యదర్శి, ఆర్బీఐ, ఎస్బీఐ, జాతీయ జనాభా లెక్కల కమిషనర్ తదితరులను ప్రతివాదులుగా ఉన్న ఈ పిటిషన్ బుధవారం విచారణకు రానున్నది.

RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES
Basar Mandal, Nirmal District, Telangana - 504107.
E-PROCUREMENT TENDER NOTICE
Online tenders are hereby invited from eligible bidders for Providing of CMC services to RO Water Plants of 4000 LpH capacity (6 No's) in the premises of RGUKT Basar.
Interested bidders can download and submit the bids online from 26.02.2020 to 10.03.2020 up to 05:00PM through https://tender.telangana.gov.in. For further details please visit our website: www.rgukt.ac.in
Date: 26.02.2020 Sd/- Vice-Chancellor

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, మహబూబ్‌నగర్
టెండరు ప్రకటన నెం. 10, 18 to 20/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 10-02-2020
దిగువ సంతకందారు పరిధిలో మైనర్ ఇరిగేషన్-మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డకల్ (మం), కన్మనూర్ (గ్రా) వద్ద పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం, మైనర్ ఇరిగేషన్-మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట (మం), గురకొండ (గ్రా) వద్ద పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం, మైనర్ ఇరిగేషన్-మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట (మం), లాల్‌కోట (గ్రా) వద్ద పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం, మైనర్ ఇరిగేషన్-మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర (మం), పెద్దరాజమూర్ (గ్రా) వద్ద పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం మరియు ఇతర సివిల్ పనులు. **మొత్తం ECV: రూ. 19.87 కోట్లు**. టెండర్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం: 05-03-2020న సా॥ 5.00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవచ్చును. **ఫోన్ నెం: 9177306253, 7093604056.**
DIPR RO.No. 2517-DP/CL/ADVT/1/2019-20, Dt: 25-02-2020 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్

## 10కి10వికెట్లు

### చండీగఢ్ యువ బౌలర్ సంచలనం



కాశ్వీ గౌతమ్ (4.5-1-12-10)

**న్యూఢిల్లీ:** బీసీసీఐ అండర్ –19 అంతర్రాష్ట్ర క్రికెట్‌లో చండీగఢ్ బౌలర్ కాశ్వీ గౌతమ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. అరుణాచల్ ప్రదేశ్‌పై వన్డే మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టి సత్తాచాటింది. ఆంధ్రప్రదేశ్‌లోని కడప కేఎల్ఆర్ మైదానంలో ఈ అరుదైన రికార్డు నమోదైంది. వన్డే ట్రోఫీలో భాగంగా బుధవారం అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో చండీగఢ్ పేసర్, కెప్టెన్ కాశ్వీ గౌతమ్ 29బంతులేసి 12 పరుగులే ఇచ్చి 10మందిని ఔట్ చేసింది. ఇందులో ఓ హ్యాట్రిక్ కూడా ఉంది. కాశ్వీ విజృంభణతో అరుణాచల్ ప్రదేశ్ 8.5ఓవర్లలోనే 25 పరుగులకే ఆలౌటై ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. అంతకుముందు బ్యాట్‌తోనూ కాశ్వీ మెరిసింది. ఆమె 49పరుగులతో సత్తాచాటడంతో తొలుత బ్యాటింగ్ చేసిన చండీగఢ్ 50ఓవర్లలో 186పరుగులు చేసింది. మొత్తానికి కాశ్వీ గౌతమ్ అదిరే ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చండీగఢ్ 161పరుగుల భారీ విజయం సాధించింది.



బింద్రా

## టోక్యోలో మన షూటర్లు సత్తాచాటుతారు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌లో ఒకటి కంటే ఎక్కువ స్వర్ణ పతకాలు సాధించే సత్తా భారత షూటర్లకు ఉందని షూటింగ్ చాంపియన్ అభినవ్ బింద్రా అన్నాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో పసిడి దక్కించుకున్న బింద్రా... విశ్వక్రీడల వ్యక్తిగత విభాగంలో ఆ ఘనత సాధించిన ఏకైక భారతీయుడిగా చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. 'ఒలింపిక్ గేమ్స్‌లో ఒకటి కంటే ఎక్కువ స్వర్ణ పతకాలు సాధించే సత్తా మనకు ఉంది. నేను అదే ఆశిస్తున్నా' అని బింద్రా అన్నాడు.



# ఒక్కడానికే..!

**గతేడాది కరీబియన్ దీవుల్లో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పరుగు ప్రారంభించిన టీమ్ఇండియా.. వెస్టిండీస్ వెన్ను విరిచి.. సఫారీలను సఫా చేసి.. బంగ్లాదేశ్ కొమ్ములు వంచి అజేయంగా ఏడు విజయాలు ఖాతాలో వేసుకొని న్యూజిలాండ్ గడ్డపై అడుగుపెట్టింది. అప్పటివరకు ధీరులుగా కనిపించిన మనవాళ్లు.. కివీస్ గడ్డపై ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఆల్‌రౌండ్ ఫ్లాప్ షోతో తొలి టెస్టును ప్రత్యర్థికి సమర్పించుకొని చాంపియన్‌షిప్‌లో మొదటి పరాజయాన్ని మూటగట్టుకున్నారు. ఒక్క ఓటమితోనే అంతా అయిపోయినట్లుకాకున్నా.. బ్లాక్‌క్యాప్స్‌పై మన ఆటగాళ్ల ప్రదర్శనపై ఓ కన్నేస్తే..**

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

విరాట్ కోహ్లీ నాయకత్వ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే టెస్టు క్రికెట్‌లో తిరుగులేకుండా దూసుకెళ్తున్న టీమ్ఇండియా.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లోనూ అదే జోరు కొనసాగిస్తూ వచ్చింది. న్యూజిలాండ్‌తో తొలి టెస్టుకు ముందు వరకు డబ్ల్యూటీసీలో ఆడిన అన్నీ మ్యాచ్‌ల్లో జయకేతనం ఎగురవేసిన భారత్‌కు.. న్యూజిలాండ్ రూపంలో తొలి దెబ్బ ఎదురైంది. 'ఒక్క ఓటమితో పెద్దగా చింతించాల్సిన అవసరం లేదు'అని కెప్టెన్ కోహ్లీ అంటున్నా.. వరుసగా ఏడు టెస్టుల్లో ఎదురులేకుండా సాగిన టీమ్ఇండియా జైత్రయాత్రకు బ్రేక్ పడటం అభిమానులకు మింగుడుపడటం లేదు. రెండో మ్యాచ్‌లోనూ ఓడినా మేం పెద్దగా పట్టించుకోబోమని కోహ్లీ పేర్కొంటుంటే.. మరోవైపు నుంచి ఇప్పటికే విమర్శల వర్షం ప్రారంభమైంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దుమ్మురేపుతున్న లోకేశ్ రాహుల్‌ను టెస్టులకు ఎంపిక చేయకపోవడంపై క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ అసహనం వ్యక్తం చేశాడు. ఆసీస్ మాజీ ఆటగాడు బ్రాడ్ హగ్ మరో అడుగు ముందుకేసి 'న్యూజిలాండ్ పర్యటనలో తొలి రెండు వారాలే టీమ్ఇండియా అసలు సిసలు క్రికెట్ ఆడింది. ఆ తర్వాత నాలుగు వారాలు వారికి కివీస్ టూర్ విహార యాత్రగా మారింది'అని విమర్శలు ఎక్కుపెట్టాడు. బయటి వారి మాటలను పెద్దగా పట్టించుకోమంటున్న కోహ్లీ.. నెట్స్‌లో చెమటోడ్చి రెండో టెస్టులో పుంజుకుంటాం అని ధీమా వ్యక్తం చేస్తున్నాడు. మరి తొలి మ్యాచ్‌లో మనవాళ్ల పొరపాట్లెంటో ఓసారి పరిశీలిస్తే..

**వాళ్లిద్దరి వల్లే..** బ్యాటింగ్, బౌలింగ్‌ల్లో భారత మూల స్తంభాలైన విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వైఫల్యమే ఈ ఓటమికి ప్రధాన కారణం అనేది ఆట చూసిన వారెవరికైనా ఇట్టే అవగతమవుతుంది. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారించే కోహ్లీ ఈ పర్యటనలో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. అన్ని ఫార్మాట్‌లలో కలిపి వరుసగా 45, 11, 38, 11, 51, 15, 9, 2, 19 పరుగులు చేశాడు. మొత్తం తొమ్మిది ఇన్నింగ్స్‌ల్లో అతడి బ్యాట్ నుంచి ఒక్క అర్ధ శతకం కూడా నమోదు కాలేదు.

**రాహుల్ ఉండుంటే..**

న్యూజిలాండ్ పర్యటనలో టీమ్ఇండియా తరఫున అదరగొట్టిన ఆటగాడెవరైనా ఉన్నాడంటే నిస్సందేహంగా అతడు లోకేశ్ రాహులే. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 224 పరుగులు చేసిన అతడు మూడు వన్డేల్లో 204 రన్స్ కొట్టాడు. అందులో ఒక సెంచరీ, మూడు అర్ధ శతకాలు ఉన్నాయి. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పరుగుల వరద పారించినా.. టెస్టులకొచ్చేసరికి అతడికి జట్టులోనే చోటు దక్కలేదు. రోహిత్ గైర్హాజరిలో మయాంక్‌తో పాటు యువ ఆటగాడు పృథ్వీ షాను ఓపెనర్‌గా ఎంపిక చేశారు. పృథ్వీలో ప్రతిభకు కొదవ లేకున్నా.. కివీస్ పేసర్లను ఎదుర్కోవడంలో మాత్రం అతడు తడబడ్డాడనే చెప్పాలి.

సంప్రదాయ క్రికెట్‌లో ఓపెనర్‌గా కొత్త అవతారం ఎత్తిన రోహిత్ శర్మ గాయం కారణంగా పర్యటనకు దూరం కావడంతో కోహ్లీపై అదనపు భారం పడిందనేది వాస్తవం. అయితే పరిస్థితులకు తగ్గట్లు తనను తాను మార్చుకుంటూ దూసుకెళ్లే కోహ్లీ ప్రస్తుతం కాస్త అయోమయంలో కనిపిస్తున్నాడు. చివరి 20 ఇన్నింగ్స్‌ల్లో కోహ్లీ ఒక్క శతకం కూడా నమోదు చేయకపోవడం మరింత ఆందోళన పరుస్తున్న అంశం. రెండుమూడేండ్లుగా ఎలాంటి పిచ్‌పైనైనా వికెట్లు పడగొడుతూ.. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర పేసర్‌గా పేరు తెచ్చుకున్న యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడం కూడా ఫలితంపై ప్రభావం చూపింది. శస్త్రచికిత్స తర్వాత కోలుకొని పునరాగమనం చేసిన అతడు వన్డే సిరీస్‌లో ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోగా.. తొలి టెస్టులో కేవలం ఒక వికెట్ మాత్రమే ఖాతాలో వేసుకున్నాడు. వన్డే సిరీస్ అనంతరం న్యూజిలాండ్ బౌలింగ్ కోచ్ షేన్ బాండ్ మాట్లాడుతూ.. 'బుమ్రాను చూసి ప్రపంచంలో ఇక ఏ జట్టు భయపడదు. కివీస్ బ్యాట్స్‌మెన్ బుమ్రాస్త్రాన్ని ఛేదించారు. ఇక మిగిలిన జట్లు కూడా అతడిని మెరుగ్గా ఎదుర్కొంటాయి'అని పేర్కొనడం మరింత కలవరపాటుకు గురిచేస్తున్నది. అయితే సహచర పేసర్లు ఇషాంత్ శర్మ, మహమ్మద్ షమీ మాత్రం బుమ్రాను వెనకేసుకొచ్చారు. అతడు చాంపియన్ బౌలర్ అని నాలుగు మ్యాచ్‌ల్లో ప్రభావం చూపలేకపోవడంతోనే అతడిని తక్కువ అంచనా వేయడం తగదని అంటున్నారు. మరి క్రైస్ట్‌చర్చ్ టెస్టులో బుమ్రా తన బుల్లెట్లకు పదును పెంచి విమర్శకుల నోరు మూయిస్తాడా చూడాలి.

## ఆసియా ఎలెవెన్‌లో కోహ్లీ

### జట్టులో మరో ఐదుగురు భారత క్రికెటర్లు

**ఢాకా:** బంగ్లాదేశ్ జాతిపిత(బంగబంధు) షేక్ ముజిబుర్ రెహమాన్ వందో జయంతి సందర్భంగా వరల్డ్ ఎలెవెన్‌తో ఆసియా ఎలెవెన్ జట్టు మార్చిలో మూడు అంతర్జాతీయ టీ20లు ఆడనుంది. బంగ్లా వేదికగా జరిగే ఈ మ్యాచ్‌ల కోసం ఆసియా ఎలెవెన్ జట్టును బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) మంగళవారం ప్రకటించింది. టీమ్ఇండియా నుంచి కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు బ్యాట్స్‌మెన్ శిఖర్ ధవన్, కేఎల్ రాహుల్, వికెట్ కీపర్ రిషబ్ పంత్, పేసర్ మహమ్మద్ షమీ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ జట్టులో ఉన్నారు. ఈ సిరీస్‌లో జరిగే మూడు టీ20ల్లో కోహ్లీ ఆడాలని బీసీబీ భావిస్తుండగా... ఇప్పటికే విరామం లేకుండా ఆడుతున్న అతడు ఒక్క మ్యాచ్‌కే అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఈ విషయంపై బీసీసీఐ ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం కివీస్ పర్యటనలో ఉన్న టీమ్ఇండియా... మార్చి 12 నుంచి 18 వరకు దక్షిణాఫ్రికాతో స్వదేశంలో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఐపీఎల్ 29న ప్రారంభం కానుంది. దీంతో ఈ ప్రత్యేక సిరీస్ కోసం ఆటగాళ్ల అందుబాటుపై అనుమానాలు తలెత్తడంతో బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ ఇటీవలే స్పందించాడు. ఆసియా ఎలెవెన్ తరపున ఆడేందుకు నలుగురు లేదా ఐదుగురు భారత ఆటగాళ్లను పంపిస్తామని స్పష్టం చేశాడు. మరోవైపు దక్షిణాఫ్రికా మాజీ సారథి డుప్లెసిస్ నాయకత్వం వహిస్తున్న వరల్డ్ ఎలెవెన్‌లో క్రిస్ గేల్, పొలార్డ్, బెయిర్‌స్టో లాంటి స్టార్లు ఉన్నారు.

